www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 294
గురువారం 8-2-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 11.18 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 2.15 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 11.50-1.16, తె. 5.47 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.36-11.22, మ. 3.09-3.54; అమృతఘడియలు: రా. 8.29-9.55; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.49, సూర్యాస్తమయం: 6.10
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

● నకిలీ



ఢిల్లీ మెట్రో రైలులో ప్రధాని ముందు చంద్రబాబు చేతులు కట్టుకుని నిలబడినట్లుగా సృష్టించిన నకిలీ ఫొటో.

● అసలు



మెట్రో రైలులో యువతతో ప్రధాని మోదీ ముచ్చటిస్తున్న దృశ్యమిది. ఒరిజినల్ ఫొటోలో లేని చంద్రబాబును గ్రాఫిక్స్‌తో తెచ్చి నిలబెట్టారు.

● నకిలీ



చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కాళ్లు మొక్కుతున్నట్లుగా పేటీఎం బ్యాచ్ సృష్టించిన ఫేక్ ఫొటో.

● అసలు



2018 జూన్ 21న... అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సీఎం హోదాలో చంద్రబాబు యోగా చేస్తున్న దృశ్యం. దీనినే అమిత్ షా ముందు వంగినట్లుగా మార్ఫింగ్ చేశారు.

అధికార వైసీపీ ఫేక్ బతుకులు, ఫేక్ ఫేసులు మరోసారి బయటపడ్డాయి. తప్పుడు వార్తలను సృష్టించడం... వాటికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, వే2న్యూస్, ఇతర ప్రముఖ మీడియా సంస్థల లోగోలు వాడుకోవడం! ఇవే నీచపు ఆలోచనలు! తాజాగా... టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా ఫేక్ బ్యాచ్ మరింత బరితెగించింది.

ఫేక్ బతుకులు!

మళ్లీ రెచ్చిపోయిన వైసీపీ పేటీఎం బ్యాచ్

మార్ఫింగ్ ఫొటోలు, లోగోలతో తప్పుడు వార్తల సృష్టి

చంద్రబాబు ఢిల్లీలో అమిత్‌షా కాళ్లు మొక్కినట్లు ఫొటో

మెట్రో రైలులో మోదీ ముందు నిల్చున్నట్లు మరో ఫొటో

బాబు ఢిల్లీలో అడుగు పెట్టకముందే విష ప్రచారం

భేటీ మొదలు కాకుండానే పొత్తులు, సీట్లు 'ఖరారు'

యోగా ఫొటోతో షా చిత్రాన్ని కలిపి మార్ఫింగ్

మోదీ ముందు నిల్చున్న ఫొటో కూడా మిక్సింగే...

తప్పుడు వార్తలను ఖండించిన 'వే2న్యూస్'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు మేరకు చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్లారు. రాత్రి 7.30 గంటలకు భేటీ ఉంటుందని తొలుత వార్తలు వచ్చాయి. అంతే! రాత్రి 7.30 కాగానే ఫేక్ ప్రచారం మొదలైంది. చంద్రబాబు ఢిల్లీలో అమిత్ షా పాదాలకు వంగి నమస్కరిస్తున్నట్లు ఒక ఫేక్ ఫొటో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. మెట్రో రైలులో ప్రధాని మోదీ ముందు

మిగతా 10వ పేజీలో...

బీజేపీకి దేశ ప్రయోజనాలు ముఖ్యం

టీడీపీకి రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం

ఈ దృష్ట్యానే మా నిర్ణయాలుంటాయ్

ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో వెనక్కిపోయింది

షాతో భేటీకి ముందు బాబు వ్యాఖ్యలు



ఎన్డీయేను బలపరచండి

దేశం బలోపేతం కావడమే మా లక్ష్యం

ఏపీలో జగన్‌కు వ్యతిరేక పవనాలు

బాబుతో అమిత్‌షా 'పొత్తు' చర్చలు

ఢిల్లీలో సుమారు గంటపాటు భేటీ

కలిసి పనిచేయడంపై అవగాహన?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కలిసి పని చేయడంపై టీడీపీ, బీజేపీ మధ్య ఒక అవగాహన కుదిరినట్లు తెలిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు మేరకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఇరువురు నేతలు

మిగతా 10వ పేజీలో...

పథకాలన్నీ కొనసాగిస్తాం

డ్వాక్రా రుణాల మాఫీనీ పరిశీలిస్తున్నాం 10

జగన్ అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు.. బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పవన్



శాసనసభలో బడ్జెట్ పెట్టడానికి ముందు సీఎంకు బడ్జెట్ బ్యాగ్‌ను అందజేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

మొత్తం బడ్జెట్:	రూ.2,86,389 కోట్లు
4 నెలలకు :	రూ.95,463 కోట్లు
ఆదాయం :	రూ.2,05,352 కోట్లు
అప్పులు :	రూ.81,037 కోట్లు
రెవెన్యూ లోటు:	రూ.24,758 కోట్లు

అప్పుచేసి చిప్పకూడు!

అంకెలే.. ఆదాయం ఎక్కడ?

జగన్ సర్కారు బడ్జెట్ సారాంశం ఇదే!

ఐదేళ్లుగా అప్పులే ఆలంబనగా పాలన



రూ.2.86 లక్షల కోట్లతో బుగ్గన బడ్జెట్

ఇందులో రూ.1.20 లక్షల కోట్లకు అప్పులే ఆధారం

'మంగళవారం' అప్పుల అంచనాలే 81వేల కోట్లు

మరో 40 వేల కోట్లు వివిధ మార్గాల్లో తేవాల్సిందే

కేవలం అప్పుల కోసం రెవెన్యూ లోటుకు కోత

రాష్ట్ర ఆదాయంపై లేనిపోని గొప్పలు

4 నెలల కాలానికి 95,463 కోట్లతో ఓటాన్ అకౌంట్

తిందాం.. తిందాం!
ఏం తెచ్చుకొని తిందాం?
అప్పు తెచ్చుకొని తిందాం!
తెచ్చిన అప్పు ఎలా తీరుద్దాం!
ఆ తిప్పలు వచ్చే ప్రభుత్వాలవి, ఓట్లేసే జనాలవి! తిని పారిపోవడమే మన పని!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

...ఇదీ ఐదేళ్లుగా జగన్ సర్కారు అనుసరిస్తున్న విధానం! ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' కూడా సరిగ్గా ఇలాగే రూపొందింది. రూ.2.86 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో... రూ.1,20,000 కోట్లు అప్పే! ప్రభుత్వం మాత్రం అసలు అప్పులకు ముసుగేసి.. రూ.81,000 కోట్లు మాత్రమే రుణం చూపిస్తోంది. అప్పు పుట్టకపోతే... ఆర్థికంగా

మిగతా 11వ పేజీలో...

బుగ్గన బడ్జెట్ 'క్లాసు'

లెక్చరర్‌ను తలపించిన ఆర్థిక మంత్రి

చదవడం.. సభ్యులకు తిరిగి వివరించడం

సూచనల కోసం సీఎం వైపు చూపులు

సుదీర్ఘ వివరణలతో 2 గంటలకుపైగా స్పీచ్

శాసన మండలిలో 35 నిమిషాలకే ముగించిన అమర్నాథ్ 11

పొంతన లేని 'పెద్దల' ప్రస్తావన

బడ్జెట్‌లో బుగ్గన గొప్పలపై సర్వత్రా విమర్శ

'సాగు'కు స్పష్టత కరవు

రైతు సంక్షేమ పథకాలకు మంగళం?

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై రైతుల్లో నిరాశ 11

'ఉద్యోగుల'పై ఉత్తుత్తి కబుర్లు

ఎంతో చేశామంటూ బడ్జెట్‌లో బొంకులు



సీపీఎస్ రద్దుపై మడమ తిప్పేశారు..

వద్దు మొర్రో అన్నా జీపీఎస్ రుద్దారు

11వ పీఆర్సీ అమలు చేశామంటూ గొప్పలు

జగన్ పాలన ముగుస్తున్నా ఇంకా అరకొరే

పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపులు ఎప్పుడనేది కనీసం చెప్పలేకపోయిన ఆర్థిక మంత్రి

ఇచ్చింది 23%.. చెప్పేది 27%

జగన్ సర్కారు తీరు సిగ్గుచేటు: ఉద్యోగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగ సమస్యల పరిష్కారంలో సీఎం జగన్ తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కిందామీద పడుతున్నారు. గత ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక అసెంబ్లీ వేదికగా తన చేతగానితనాన్ని చాటుకున్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని, ఓపీఎస్ పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చి జగన్ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంలోకి వచ్చారు. అప్పటి ఆయన హామీ నెరవేర్చాలంటూ సీపీఎస్ ఉద్యోగులు ఉద్యమబాట పట్టినా ప్రయోజనం లేకపోయింది. పైగా జీపీఎస్ తీసుకొస్తున్నామంటూ ఉద్యోగులకు ఇష్టంలేనిదాన్ని వారిపై రుద్దారు. ఇప్పటికీ సీపీఎస్ ఉద్యోగులు నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. వాస్తవం ఇది కాగా, ఆర్థిక మంత్రి

మిగతా 10వ పేజీలో...

ఎన్నికల వేడి రాజుకుంది! బహుశా... మరో రెండు వారాల్లో ఎన్నికల షెడ్యూలు కూడా వస్తుంది. ఐదేళ్లు నిద్రపోయిన జగన్ సర్కారు ఇప్పుడే లేచికూర్చుంది. నాన్చినాన్చి ఇన్నేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. నిజంగానే ఈ సర్కారుకు ఉపాధ్యాయ ఖాళీలు నింపే ఆలోచన ఉందా? ఉంటే... ఎన్నికల దాకా ఎందుకు ఊరుకుంది? షెడ్యూలు వచ్చాక అధికార యంత్రాంగమంతా ఎన్నికల హడావుడిలో ఉంటుంది కదా! మరి... ఉపాధ్యాయ నియామక ప్రక్రియ సాఫీగా సాగుతుందా? నిరుద్యోగ అభ్యర్థుల్లో ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు!

ఇవ్వక ఇవ్వక ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ... పోస్టులు మాత్రం అరకొరే! ప్రతిపక్షంలో ఉండగా 23వేల ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చాక దాదాపు ఐదేళ్లు మౌనం దాల్చి, ఇప్పుడు కేవలం 6100 ఖాళీలే ఉన్నాయని తేల్చేశారు. మెగా డీఎస్సీ స్థానంలో.. ఊసూరుమంటూ మినీ డీఎస్సీని ప్రకటించారు. ఇక.. ఏప్రిల్ నెలాఖరుకు రిటైర్ అయ్యేవారితో కలిపి 6100 పోస్టులు ఉన్నాయని తేల్చారు. మరి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23వేల ఖాళీలు అన్న ఆయన మాటలన్నీ అబద్ధాలేనా? అధికారంలోకి వచ్చాక ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండానే ఆయన చెప్పిన ఖాళీలన్నీ ఎటుపోయాయి? కేవలం అధికారంలోకి రావడం కోసమే ఆయన అబద్ధాలు ప్రచారం చేశారా?

మాటతప్పి.. మడమ తిప్పి..

ఎన్నికల 'డీఎస్సీ'

చివరికి మినీ డీఎస్సీ

ఐదేళ్లు ఊరించి.. 6,100 పోస్టులతో సరి

అదీ.. ఏప్రిల్‌లో రిటైర్ అయ్యేవాటితో కలిపి..

విపక్షంలో ఉండగా 23 వేల ఖాళీలని ప్రకటన

ఇప్పుడు తక్కువ ఖాళీలే ఉన్నాయని బుకాయింపు

పోస్టులపై అన్నీ వింత.. తప్పుడు లెక్కలే

ఎంటీఎస్ కూడా రెగ్యులర్ అన్నట్టు కొత్త భాష్యం

ఎన్నికల కోసం డీఎస్సీ డ్రామా

జీవో 117తో పోస్టులు మాయం చేసిన ప్రభుత్వం

దగాకోరు సీఎంకు బుద్ధి చెబుతాం!

జగన్‌కు నిరుద్యోగుల హెచ్చరిక

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ ప్రభుత్వం నిరుద్యోగులను మభ్యపెడుతూ వచ్చింది. ఇప్పుడు కూడా కేవలం ఎన్నికల నేపథ్యంలోనే డీఎస్సీ ప్రకటించినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అది కూడా కేవలం 6100 పోస్టులతో తేల్చేసింది. వాస్తవానికి డీఎస్సీ ఎప్పుడంటూ నిరుద్యోగులు గళమెత్తుతుండడంతో.. కొంతకాలంగా టీచర్ ఖాళీలపై

మిగతా 3వ పేజీలో...



12న నోటిఫికేషన్

మొత్తం రిటైర్మెంట్‌లతో కలిపి 6,100 పోస్టుల భర్తీకి చర్యలు

మార్చి 15 నుంచి పరీక్షలు

ఏప్రిల్ 7న ఫలితాలు: మంత్రి బొత్స

నేటి నుంచి టెట్‌కు దరఖాస్తులు

కాంగ్రెస్‌కు 40 సీట్లైనా



రావాలని కోరుకుంటున్నా: మోదీ

పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన సవాల్‌ను స్వీకరించి లక్ష్యాన్ని సాధించాలి

యువరాజు స్టార్టప్ కాదు.. స్టార్ట్ కూడా కాదు

'ఉత్తరం-దక్షిణం'తో దేశానికి నష్టం

మా పన్నులు-మా డబ్బులు.. ఇదా వాదన?

మానవ శరీరం లాంటిదే దేశం కూడా

ఎక్కడ బాధైనా అది అందరి సమస్యే

రిజర్వేషన్లను నెహ్రూ వ్యతిరేకించారు

నాటి సీఎంలకు రాసిన లేఖే సాక్ష్యం

దేశమంతటా పైప్‌లైన్‌తో వంటగ్యాస్

సౌరశక్తి ద్వారా ఉచితంగా కరెంటు

'వికసిత భారత్'ను నిర్మిస్తాం

రాజ్యసభలో ప్రధానమంత్రి మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు రావాలని కోరుకుంటున్నానని ప్రధాని నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యురాలైన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల.. కాంగ్రెస్ 40 సీట్లనైనా గెలుచుకోగలదా? అని సవాల్ విసిరారు. మమత వ్యాఖ్యలను ప్రధాని మోదీ

మిగతా 2వ పేజీలో...

కేంద్రం వివక్షపై ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా

సీఎం సిద్దూ, డీకే, మంత్రుల హాజరు.. నేడు కేరళ ప్రభుత్వ నిరసన

ఉమ్మడి పౌర స్మృతికి

ఉత్తరాఖండ్ ఆమోదం

దేశంలోనే తొలి రాష్ట్రం.. రాజ్యాంగం ప్రకారమే అన్న సీఎం పుష్కర్

వివాహం, విడాకులకు అన్ని వర్గాలకూ ఒకే విధమైన నిబంధనలు

సహజీవనానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి 2



బీసీల్లో 'వారు' రిజర్వేషన్

వదులుకోలేరా?

ఉన్నత ఉపకులాల వారు జనరల్ కేటగిరీతో పోటీ పడలేరా? 2

సుప్రీం జడ్జి జస్టిస్ నాథ్ ప్రశ్నలు

దేనికి 'సిద్ధం' సార్?

హోదాను మళ్లీ మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడానికా?.. బీజేపీతో అక్రమ దోస్తీకా?

ఇంకో 8 లక్షల కోట్ల అప్పు చేయడానికా?.. లిక్కర్, మైనింగ్ మాఫియా కోసమా?

19 లక్షల మంది నిరుద్యోగులు మీ ఘనతే.. బాపట్ల సభలో షర్మిల ధ్వజం 10

భద్రత ఇవ్వలేదంటే నా చెడు కోరుకున్నట్లే.. జగన్ సర్కారుపై మండిపాటు



బాపట్ల సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల

నాకాబందీలో 14.47 కిలోల బంగారం స్వాధీనం

» విశాఖలో భారీగా వాహన తనిఖీలు.. 518 వాహనాలు సీజ్

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), ఫిబ్రవరి 7: నగర పోలీసులు మంగళవారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో అగనంపూడి వద్ద 14.471 కిలోల బంగారం, 31.314 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను డీసీపీ మోకా సత్తిబాబు దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం విలేకరులకు వెల్లడించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-2 లా అండ్ ఆర్డర్ పరిధిలో 55 బృందాలతో మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం తెల్లవారు జామున ఐదు గంటల వరకూ వాహనాల తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా కాకినాడ నుంచి విశాఖపట్నం వెళుతున్న సీక్వెన్స్ లాజిస్టిక్స్‌కు చెందిన వాహనాన్ని తనిఖీ చేయగా 14.471 కిలోల బంగారం, 31.314 కిలోల వెండి కనిపించింది. బంగారం, వెండితోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బంగారం, వెండి విలువ సుమారు రూ.8.5 కోట్లు ఉంటుంది. వాహనంలో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వాటికి సంబంధించి వారి వద్ద పత్రాలు ఉన్నాయని, జీఆర్‌టీ, ఖజానా

నాస్తిక ఉద్యమకారుడు జయగోపాల్ మృతి



డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 7: ఆధునిక ఆంధ్ర పెరియార్, నాస్తిక ఉద్యమకారుడు జయగోపాల్ (82) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. 1972 ఫిబ్రవరి 13న భారత నాస్తిక సమాజం ఏర్పాటుకు కృషి చేసిన వారిలో ఒకరైన జయగోపాల్... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో నాస్తిక ఉద్యమ వ్యాప్తికి విశేష కృషి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలిచారు. సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆయన భావించేవారు. 52 ఏళ్లుగా భారత నాస్తిక సమాజం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారు. దళితుల పైన దాడులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలను నిర్మించారు. అంతర్జాతీయ బ్రేవ్ మైండ్ అవార్డును అందుకున్న జయగోపాల్... సాంస్కృతిక ఉద్యమ నిర్మాణం కోసం, భౌతికవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసం ఎన్నో రచనలు చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జయగోపాల్ బుధవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల భారత నాస్తిక సమాజం సభ్యులు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్తరాఖండ్‌లో యూసీసీకి ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఉత్తరాఖండ్ రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) బిల్లును ఆమోదించింది. దేశంలో ఇటువంటి బిల్లును ఆమోదించిన తొలి రాష్ట్రంగా నిలిచింది. గవర్నర్ ఆమోదం పొందితే ఈ బిల్లు చట్టంగా మారనుంది. అసెంబ్లీలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలను పాటించే తమ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశ పెట్టిందని చెప్పారు. కొందరికి దీనిపై సందేహాలు ఉన్నాయని... అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ద్వారా తగిన సమయంలో రాష్ట్రాలు ఉమ్మడి పౌరస్మృతిని ప్రవేశ పెట్టే హక్కును రాజ్యాంగ రూపకర్తలు కల్పించారని చెప్పారు.

వారు రిజర్వేషన్ వదులుకోలేరా: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: వెనకబడిన తరగతు(బీసీ)ల్లో ఉన్నత స్థానాలకు చేరిన ఉపకులాల వారు రిజర్వేషన్లను వదులుకోలేరా? అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. 'ద పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్) యాక్ట్-2006'లో.. ఎస్సీ రిజర్వేషన్లలో వాల్మీకి, మజ్హబీ సిక్కులకు 50% కోటా ఇవ్వాలంటున్న సెక్షన్ 4(5)ను సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ ప్రారంభించింది. విచారణ సందర్భంగా జస్టిస్ నాథ్ మాట్లాడుతూ.. ఉన్నతస్థాయికి చేరిన వారు రిజర్వేషన్లను వదులుకుని, జనరల్ కేటగిరీతో పోటీపడలేరా? అని ప్రశ్నించారు. ఒకసారి ఉన్నత వర్గానికి చేరుకున్న వారు రిజర్వేషన్లను త్యజిస్తే.. సమాజంలో ఇంకా వెనుకబాటులో ఉన్న ఉప కులాల వారికి ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరో న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి కూడా ఐపీఎస్, ఐఏఎస్ పిల్లలు.. ఉన్నతస్థాయికి చేరినా రిజర్వేషన్లను ఉపయోగించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

17న విచారణకు రండి.. కేజ్రీకి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ ఫిర్యాదుకు సంబంధించి ఈ నెల 17న విచారణకు హాజరుకావాలని ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఢిల్లీ కోర్టు ఆదేశించింది. కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా తాము పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించడం లేదని ఈడీ ఈ నెల 3న కేజ్రీవాల్‌పై కోర్టులో ఫిర్యాదు చేసింది. ఈడీ సమన్లు రాజకీయ ప్రేరేపితమని కేజ్రీవాల్ గతంలో ఆరోపించారు.

అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అమెరికాలో భారతీయ విద్యార్థులు వరుసగా మరణిస్తుండటం ఆందోళన రేపుతోంది. తాజాగా ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యు యూనివర్సిటీలో డాక్టరేట్ చేస్తున్న సమీర్ కామత్(23) సోమవారం సాయంత్రం ఒక పార్కులో అనుమానాస్పద స్థితిలో మరణించారని వారెన్ కౌంటీ కొరోనర్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. కామత్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. గతేడాది ఆగస్టులో ఆయనకు అమెరికా పౌరసత్వం కూడా లభించింది. 2025 సంవత్సరంలో ఆయన డాక్టరేట్ పూర్తికావాల్సి ఉంది. ఇంతలోనే ఆయన అనుమానాస్పద స్థితిలో మరణించారు. పోస్టుమార్టం నిర్వహించి త్వరలో నివేదికను విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

బుల్డోజర్లతో ఆ కూల్చివేతలు ఆపండి: ఆమ్నెస్టీ

భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ముస్లింల ఇళ్లు, దుకాణాలు, ప్రార్థన మందిరాలను చట్టవ్యతిరేకంగా కూల్చివేస్తున్నారంటూ మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. బుల్డోజర్లతో జరుగుతున్న ఆ కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చింది. ఈ కూల్చివేతలకు జేసీబీ కంపెనీకి చెందిన యంత్రాలను అధికంగా వినియోగిస్తున్నారని, దీంతో జేసీబీ అనేది ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే పదంగా మారిపోయిందని పేర్కొంది.

ఎన్నికల ముందురోజు పాక్‌లో జంట పేలుళ్లు

» 30 మంది మృతి.. 42 మందికి గాయాలు

కరాచీ, ఫిబ్రవరి 7: దేశ సార్వత్రిక ఎన్నికలకు ఒక్కరోజు ముందు పాకిస్థాన్ జంట బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. గంట వ్యవధిలోనే సంభవించిన ఈ పేలుళ్లలో 30 మంది మృతి చెందగా, దాదాపు 42 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో బుధవారం సంభవించింది. పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ క్రమంలో బుధవారం పిషిన్ జిల్లాలో ఓ స్వతంత్ర అభ్యర్థి కార్యాలయం బయట మొదటి పేలుడు, ఖిల్లా అబ్దుల్లా ప్రాంతంలో జమియత్-ఉలేమా- ఎ- ఇస్లామ్ పాకిస్థాన్ పార్టీ కార్యాలయం బయట రెండో పేలుడు సంభవించింది.

కాంగ్రెస్‌కు 40 సీట్లైనా!

(మొదటి పేజీ తరువాయి)

పరోక్షంగా ప్రస్తావిస్తూ.. '40 సీట్లను కూడా కాంగ్రెస్ దాటలేదని పశ్చిమ బెంగాల్ నుంచి ఆ పార్టీకి ఓ సవాల్ వచ్చింది. మీరు 40 సీట్లను గెలుచుకోవాలని నేను ప్రార్థిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని బుధవారం రాజ్యసభలో సమాధానం ఇచ్చారు. గంటన్నరపాటు సాగిన ఆయన ప్రసంగంలో ప్రతిపక్షాలపై ముఖ్యంగా కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. దళితులు, బీసీలు, గిరిజనులకు ఆ పార్టీ వ్యతిరేకమని..అంబేద్కరే లేకుంటే ఆయా వర్గాలకు రిజర్వేషన్ లభించి ఉండేది కాదని చెప్పారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ ఆనాటి సీఎంలకు రాసిన ఒక లేఖను ఉదహరిస్తూ, అన్ని రకాల రిజర్వేషన్లకు ముఖ్యంగా ఉద్యోగాల్లో కోటాకు నెహ్రూ వ్యతిరేకమని ఈ లేఖ స్పష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్ల ప్రభుత్వ పనితీరు దెబ్బతింటోందని ఆ లేఖలో పేర్కొన్నారని చెప్పారు. ఓబీసీలకు కాంగ్రెస్ ఎన్నడూ పూర్తి రిజర్వేషన్ కల్పించలేదని, జనరల్ క్యాటగిరీలో పేదలకు ఆ పార్టీ ఎన్నడూ రిజర్వేషన్ ఇవ్వలేదని, భారతరత్నకు అంబేద్కర్‌ను అర్హుడిగా కాంగ్రెస్ భావించలేదని, తన కుటుంబానికి మాత్రం ఆ అత్యున్నత పురస్కారం ఇస్తూ వెళ్లిందని ప్రధాని విమర్శించారు. అటువంటి పార్టీ నేడు తమకు పాఠాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకరించటం లేదన్న కాంగ్రెస్ విమర్శల నేపథ్యంలో మోదీ ఈ విధంగా ఎదురుదాడి చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా గొంతుపిసికి చంపిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన డజనుకుపైగా ప్రభుత్వాలను రాత్రికిరాత్రి ఆ పార్టీ రద్దు చేసిందని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌కు నా సానుభూతి..

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'యువరాజును ఓ స్టార్టప్‌గా మలచాలన్నది కాంగ్రెస్ ప్రయత్నం. కానీ, ఆయన అసలు స్టార్టే కారు. ఆయనను ఎత్తుకోలేము.. ఓ లక్ష్యం వైపు ప్రయోగించనూ లేము. కాంగ్రెస్ ఆలోచనాధారకు కాలం చెల్లింది. అందుకనే ఆ పార్టీ తన పనిని ఔట్‌సోర్స్ చేస్తోంది (ఇతరులకు అప్పగిస్తోంది). ఆ పార్టీ పతనం పట్ల మేమేమీ సంతోషంగా లేము. సానుభూతి తెలుపుతున్నాం. కాంగ్రెస్‌కు తన విధానంపైన, తన నాయకుడి పైనే గ్యారెంటీ లేదు కానీ, మోదీ గ్యారెంటీలను ప్రశ్నిస్తోంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, కర్ణాటకలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ప్రభుత్వం.. ఉత్తరం, దక్షిణం అంటూ ప్రచారం చేయటం సరికాదని, ఇది దేశభవిష్యత్తుకు నష్టం చేస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త కొత్త వాదనలను తీసుకొస్తూ దేశాన్ని విభజించేలా మాటలు మాట్లాడటం చూస్తుంటే తనకు తీవ్రమైన బాధ కలుగుతోందన్నారు. 'హమారా ట్యాక్స్-హమారా మనీ (మా పన్ను-మా డబ్బు)... ఒక రాష్ట్రమే ఈ విధంగా మాట్లాడమేమిటి? దేశానికి ఇంతకన్నా ఘోరమైనది ఏం ఉంటుంది? ఒక జాతీయ రాజకీయ పార్టీ నుంచి ఈ విధమైన మాటలు వెలువడటం బాధాకరం. దేశమంటే ఓ భూభాగంకాదు. అది మనిషి శరీరం. ఏ అవయవం పని చేయకపోయినా ఇబ్బంది తలెత్తుతుంది. దేశంలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేసినా.. దేశమే అభివృద్ధి కాకుండా ఉండిపోతుంది' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేళ్లపాలనలో దేశంలో విధానపరమైన పక్షవాతం నెలకొన్నదని, నాడు మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్నదని మోదీ చెప్పారు. కాంగ్రెస్ సుదీర్ఘపాలన కారణంగా దేశాన్ని కమ్ముకున్న సమస్యలను నిర్మూలించటానికే తన రెండు దఫాల పదవీకాలం సరిపోయిందని, ఇక మీదట వికసిత్ భారత్ మీద పూర్తి దృష్టి పెడతామని చెప్పారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తామన్న ధీమాను మోదీ పునరుద్ఘాటించారు. 'మా మూడోదఫా ప్రభుత్వం మరెంతో దూరంలో లేదు. కొందరు దీనిని మోదీ 3.0గా అభివర్ణిస్తున్నారు.' అని తెలిపారు. 'యావత్ దేశానికి పైప్ లైన్ ద్వారా వంటగ్యాస్‌ను సరఫరా చేసే వ్యవస్థను నిర్మిస్తాం. సౌరశక్తి ద్వారా ఉచితంగా కరెంటును అందజేస్తాం. భారత్ మరిన్ని స్టార్టప్‌లను చూస్తుంది. బుల్లెట్ ట్రెయిన్లు వస్తాయి. సెమీకండక్టర్ రంగంలో భారత్ గొప్ప ప్రగతి సాధిస్తుంది' అని చెప్పారు.



పదేళ్లలో చేసిందేమిటో చెప్పకుండా..
మాపై శాపనార్థాలేమిటి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పదేళ్ల అధికారంలో ఉన్న ప్రధాని మోదీ తాను చేసిందేమిటో చెప్పకుండా తమపై శాపనార్థాలు పెట్టడమేమిటని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నిలదీశారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ మోదీ కాంగ్రెస్‌పై తిట్ల వర్షమే కురిపించారని, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అసమానతల గురించి మాత్రం మాట్లాడలేదన్నారు. 'బీజేపీ వాళ్లకు రాజ్యాంగంపై విశ్వాసం లేదు. దేశానికి 1947లో కాకుండా 2014లో స్వాతంత్ర్యం వచ్చిందని వాళ్లు భావిస్తారు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పోరాడిందన్న వాస్తవాన్ని గుర్తించరు. దండి సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనని వారు కాంగ్రెస్‌కు దేశభక్తి గురించి బోధిస్తారు. ప్రధానికి అబద్ధాలు చెప్పటం అలవాటుగా మారిపోయింది' అని ఖర్గే విమర్శించారు.


ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా

నేడు హస్తినలో కేరళ ప్రభుత్వ ప్రదర్శన




బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కర్ణాటకకు నిధుల విషయంలో మోదీ సర్కారు వివక్ష చూపుతోందంటూ సీఎం సిద్దరామయ్య సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. దానికి పోటీగా బీజేపీ కూడా బెంగళూరులో భారీ ప్రదర్శన చేపట్టింది. పన్నుల ఆదాయం పంపిణీ, గ్రాంట్ల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని కేంద్రంపై సిద్దూ మండిపడ్డారు. ఈ ధర్నాలో ఆయనతోపాటు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు, రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా కర్ణాటకకు ఐదేళ్లలో రూ.1.87 లక్షల కోట్ల మేర కేంద్రం నష్టం చేసిందని వారు ఆరోపించారు. తమ ధర్నా బీజేపీకి వ్యతిరేకంగా కాదని.. కర్ణాటకపై వివక్షకు వ్యతిరేకంగా చేస్తున్నామని చెప్పారు. ఈ ధర్నా ద్వారా కాంగ్రెస్ ఉత్తరం-దక్షిణం అన్న విభేదాలు సృష్టిస్తోందన్న బీజేపీ నేతల ఆరోపణను తోసిపుచ్చారు. దేశం ఐక్యంగా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని.. అయితే దక్షిణ రాష్ట్రాలపై వివక్ష ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్ర నుంచి తమ హక్కులు, వాటా కోరుతున్నామని డీకే చెప్పారు. సహకార సమాఖ్య గురించి ప్రధాని మోదీ పెద్దపెద్ద మాటలు చెబుతారని.. కర్ణాటకకు చేస్తున్న అన్యాయంతో ఆయన ప్రజావ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి బట్టబయలైందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. కాగా.. కేరళలో సీపీఎం సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కూడా గురువారం ఢిల్లీలో నిరసన చేపట్టనుంది. ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ నాయకత్వంలో ఆయన మంత్రివర్గ సహచరులు, ఎంపీలు పాల్గొంటారు.

లోకం తీరు



మంచి చేసేవారికి గౌరవం దక్కదు

» కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు



ముంబై, ఫిబ్రవరి 7: రాజకీయాల్లో సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నేతల సంఖ్య తగ్గిపోతోందని కేంద్ర మంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. అవకాశవాద నాయకులు అధికారంలో ఉన్న పార్టీతో అంటకాగాలని కోరుకుంటున్నారని, ఈ విధంగా రాజకీయాల్లో భావజాలం క్షీణించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మంచి పనులు చేసేవారికి గౌరవం దక్కదని, చెడ్డ పనులు చేసేవారికి శిక్ష పడదని గడ్కరీ అభిప్రాయపడ్డారు. లోక్‌మత్ మీడియా గ్రూపు ఆధ్వర్యంలో పార్లమెంటేరియన్లకు అవార్డులు ప్రదానం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. "రాజకీయ నాయకులు వస్తుంటారు... పోతుంటారు.. పబ్లిసిటీ, పాపులరిటీ అవసరమే కానీ పార్లమెంట్‌లో ఏం మాట్లాడతారు అనే దానికంటే నియోజకవర్గాల్లో ప్రజల కోసం చేసిన పనులే వారికి గౌరవాన్ని తీసుకొస్తాయి" అని మంత్రి వివరించారు. ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ వాక్చాతుర్యాన్ని ప్రశంసించిన గడ్కరీ... మాజీ రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్ ప్రవర్తన, నిరాడంబరత, వ్యక్తిత్వం నుంచి తాను చాలా నేర్చుకున్నట్లు చెప్పారు. వాజపేయి తర్వాత తనను ఎక్కువగా ప్రభావితం చేసిన వ్యక్తి ఫెర్నాండెజ్ అని తెలిపారు. ఇటీవల భారతరత్న పురస్కారానికి ఎంపికైన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్... దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ నేతలంతా ఆయనలాంటి గొప్ప నాయకుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.

సమస్యకు సమ్మె పరిష్కారం కాదు

» న్యాయవాదులకు సూచించిన ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం, రూ.20 వెల్ఫేర్ స్టాంప్ నిర్ణయాన్ని నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. సమస్యకు సమ్మె పరిష్కారం కాదని తెలిపింది. భూ హక్కు చట్టంతో సంబంధం లేకుండా సివిల్ దావాలు విచారణకు స్వీకరించాలని సివిల్ కోర్టులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని, ఇప్పటికీ సమ్మెను కొనసాగించడం ఏమిటని ప్రశ్నించింది. సమ్మె విరమించాలని సర్క్యులర్ జారీ చేయడం తప్ప సమ్మె విరమింపచేసేందుకు ఏపీ బార్ కౌన్సిల్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అభ్యంతరం తెలిపింది. చర్యలు జరిపాలని, అప్పటికీ సమ్మె విరమించకుంటే న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సమ్మె విరమణకు ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా కోర్టు విధులు బహిష్కరించేందుకు రాష్ట్రంలోని పలు బార్ కౌన్సిళ్లు తీర్మానాలు చేయడాన్ని చట్ట విరుద్ధమైన, కోర్టుధిక్కరణ చర్యగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేశ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సంబంధిత బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పదవుల నుంచి తొలగించాలని, కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదుల లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా న్యాయవాది యోగేశ్ వాదనలు వినిపించారు. న్యాయవాదుల సమ్మె విషయంలో మీ పాత్రేమిటని ఏపీ బార్ కౌన్సిల్‌ను కోర్టు ప్రశ్నించింది. దీనిపై బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది జి.వెంకటరెడ్డి సమాధానం ఇస్తూ.. సమ్మె చేస్తున్న అన్ని న్యాయవాద సంఘాలకు బార్ కౌన్సిల్ కార్యదర్శి సర్క్యులర్ పంపిస్తూ సమ్మె విరమించాలని కోరారని వివరించారు. బీసీఐ తరఫు న్యాయవాది కుంచెం మహేశ్వరరావు వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు.

400కు పైగా సీట్లు గెలుస్తాం!

దక్షిణాదిలో స్థానాలను పెంచుకుంటాం.. జనాదరణలో మోదీతో పోల్చదగ్గ నేత ఎవరూ లేరు

» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఉత్తరాదికే పరిమితమైన పార్టీ కాదని, దక్షిణాదిలో కూడా లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు గతంలో కంటే పెరుగుతాయని ఆ పార్టీ నేత, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. దక్షిణాదిన కూడా మోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ఇందుకు తోడ్పడుతుందన్నారు. ఈసారి బీజేపీ మొత్తంగా 400కుపైగా స్థానాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనురాగ్ పలు అంశాలపై స్పందించారు. దేశంలో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తున్నదనేది పూర్తి అబద్ధమని పేర్కొన్నారు. మీడియాపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్నదని ఆరోపిస్తున్న విదేశీ మీడియా.. ఒక ఎజెండాతో ప్రధానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. నిజంగానే ప్రభుత్వ ఆంక్షలు ఉంటే.. ఈ తప్పుడు ప్రచారం చేస్తున్న వారు తమకు ఇష్టం వచ్చినట్లు ఏదైనా ప్రచారం చేసే స్వేచ్ఛ ఉండేది కాదని చెప్పారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ చేయడం ద్వారా ప్రజల కలలను మోదీ నెరవేర్చారన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్‌పై నిషేధం, రామమందిర నిర్మాణం ద్వారా ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను బీజేపీ నెరవేర్చిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయాల వల్ల మోదీ ప్రభుత్వ జనాదరణతో పాటు విశ్వసనీయత పెరిగిందని చెప్పారు. వీటితోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో మోదీ గ్యారంటీల ద్వారా తమ భవిష్యత్తు సురక్షిత హస్తాల్లో ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారని అనురాగ్ చెప్పారు.

అత్యంత క్షీణ దశలో కాంగ్రెస్

దేశ విదేశాల్లో మోదీ ప్రతిష్ఠ గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నతంగా ఉన్నదని, ఇప్పటి వరకూ మోదీ జనాదరణతో తులతూగగలిగిన నేత లేరని మంత్రి పేర్కొన్నారు. బీజేపీ.. వారసత్వ ప్రయోజనాల కోసం, కుటుంబాల కోసం పనిచేసే పార్టీ కాదని చెప్పారు. ఆర్జేడీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత బిహార్‌లో ఆటవిక రాజ్యం కొనసాగుతోందని గ్రహించినందు వల్లే జేడీయూ నేత నితీశ్ కుమార్ మళ్లీ బీజేపీవైపు వచ్చారని, ఈసారి ఆ రాష్ట్రంలో మొత్తం 40 సీట్లు ఎన్డీఏకే వస్తాయని మంత్రి అంచనా వేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర ఒక ప్రహసనమని, ప్రజలకు న్యాయం కోసం మాట్లాడుతున్నామని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎందరో నేతలు.. తమకు న్యాయం జరగడం లేదని వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. ముందు వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. నెహ్రూ కుటుంబ వారసత్వాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే రాహుల్‌గాంధీని భుజానికెత్తుకుంటున్నారని విమర్శించారు. రాహుల్‌ది భారత్ తోడో అన్యాయ యాత్ర అని, దీనివల్ల బీజేపీపై ఎలాంటి ప్రభావం ఉండదని, ఇండియా కూటమే మరింత నష్టపోతుందని అనురాగ్ ఠాకూర్ విశ్లేషించారు. పలు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు అత్యంత క్షీణదశలో ఉన్నదన్నారు.

ఎన్నో విజయాలు సాధించాం

మన్మోహన్ సింగ్ ప్రభుత్వ పదేళ్ల పనితీరుతో పోలిస్తే మోదీ ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందని, ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే ఇందుకు నిదర్శనమని అనురాగ్ చెప్పారు. 2027-28 నాటికి మన దేశం 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమన్నారు. భారతదేశం ఇప్పుడు ఒక ప్రాంతీయ శక్తి మాత్రమే కాదని, అంతర్జాతీయంగా శక్తివంతమైన దేశాల్లో ఒకటన్నారు. సరిహద్దుల్ని పటిష్ఠంగా మార్చి, సవాళ్లను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. గత తొమ్మిదేళ్లలో 24.82 కోట్ల మంది భారతీయులు బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని యూఎన్‌డీపీ, నీతీఆయోగ్ సంయుక్త నివేదిక తెలిపిందని గుర్తు చేశారు.

జగన్, కవితలపై దర్యాప్తు కొనసాగుతుంది!

ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐ కేసులు నత్తనడకన సాగడానికి, కవితపై మద్యం కేసులో ముందడుగు పడకపోవటానికి కారణమేమిటన్న ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ.. అవినీతి కేసుల్లో ఉన్నవారిపై దర్యాప్తులు తప్పకుండా కొనసాగుతాయని, జాతి సంపదను కొల్లగొట్టిన వారు వాటిని తిరిగి ప్రజలకు ఇవ్వాల్సిందేనన్నారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరి ఎప్పటికీ మారదని చెప్పారు.

క్రీడల్లో మంచి ఫలితాలు

తన మంత్రిత్వ శాఖల గురించి అనురాగ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. దేశంలో కమ్యూనికేషన్, మీడియా రంగాల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేంద్ర యువజన క్రీడా వ్యవహారాల శాఖ ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే భారత క్రీడాకారులు ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్, డెఫ్ ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఆసియన్ క్రీడల్లో మంచి ఫలితాలు సాధించారన్నారు.

మట్టి పెళ్లల కింద ఏడుగురు సజీవ సమాధి

» ఊటీలో భవన నిర్మాణ పనుల్లో విషాదం

» 13 మంది కార్మికులకు తీవ్రగాయాలు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని రాయల్ కేస్ట్ ప్రాంతంలో ప్రైవేట్ భవన నిర్మాణ పనుల సందర్భంగా మట్టిపెళ్లలు విరిగిపడి ఏడుగురు కార్మికులు దుర్మరణం చెందారు. వీరిలో ఆరుగురు మహిళలున్నారు. మరో 13 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాయల్ కేస్ట్ ప్రాంతంలో గత నెల రోజులుగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉత్తరాది కార్మికులు సహా 30 మంది రోజూ ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఆ మేరకు బుధవారం ఉదయం ప్రొక్లయిన్లతో తవ్వకాలు జరుపుతుండగా అకస్మాత్తుగా పెద్దపెద్ద మట్టి పెళ్లలు, బండరాళ్లు కార్మికులపై పడ్డాయి. ఈ ఘటనలో రాయల్ కేస్ట్ ప్రాంతానికి చెందిన రాధ (38), భాగ్యం (36), ముత్తులక్ష్మి (36), ఉమ (35), సంగీత (30), షకీలా (30) అనే ఆరుగురు మహిళలు, మాసిలా అనే కార్మికుడు మృతి చెందారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే జిల్లా కలెక్టర్ అరుణ, ఊటీ పోలీసులు, అగ్నిమాపక దళ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాలను తొలగించి ఏడుగురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మట్టిపెళ్లల మధ్య చిక్కుకుని తీవ్రగాయాలతో, ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న జయంతి (56), శాంతి (45), థామస్ (24), మహేష్ (23) సహా 13 మంది కార్మికులను అంబులెన్స్‌లలో ఊటీలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు రూ.2లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.50 వేలు చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అరుణను ఆయన ఆదేశించారు.



భవన శిథిలాల కింద మృతదేహం

కోర్టు అనుమతి తీసుకున్నాకే ముందుకు!

» భూహక్కు చట్టంపై హైకోర్టుకు సర్కార్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే భూ యాజమాన్య హక్కు చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. చట్టం అమలుకు నిబంధనలు రూపొందించలేదని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ సర్వే కొనసాగుతోందని, ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాతే చట్టం అమల్లోకి వస్తుందని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు నాలుగు వారాలు సమయం ఇవ్వాలని అభ్యర్థించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కౌంటర్ వేసేందుకు ప్రభుత్వానికి సమయం ఇస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈలోపు చట్టంలోని నియమ నిబంధనలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే కోర్టు దృష్టికి తీసుకొచ్చేందుకు పిటిషనర్లకు స్వేచ్ఛనిచ్చింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చారు. టైటిల్ యాక్ట్‌ను సవాల్ చేస్తూ ఏపీ బార్ కౌన్సిల్ తరఫున సభ్యులు కె.చిదంబరం, ముప్పాళ్ల సుబ్బారావు, జి.సుదర్శనరావు పిటిషన్ దాఖలుచేశారు. ఈ చట్టాన్ని తీసుకొచ్చే శాసనాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని పేర్కొంటూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఏపీ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ పిల్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని పలు అధికరణలను అతిక్రమించేలా ఉన్న భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎంవీ చక్రపాణి పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాల్లోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు నియమ నిబంధనలు రూపొందించేందుకు సమయం పడుతుందని ఏజీ చెప్పిన వివరాలను నమోదు చేసింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది చిదంబరం వాదనలు వినిపించారు. దానిపై ప్రభుత్వ న్యాయవాదులు మహేశ్వరరెడ్డి, బాలస్వామి వాదనలు వినిపించారు.

16 నుంచి శ్రీశైలంలో మహాకుంభాభిషేకం

» 21 వరకూ పూజా క్రతువులు

» హైకోర్టుకు దేవదాయ శాఖ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో మహాకుంభాభిషేకం, ఇతర పూజా క్రతువుల నిర్వహణ కోసం ఈ నెల 16 నుంచి 21 వరకు ముహూర్తం నిర్ణయించామని హైకోర్టుకు దేవదాయ శాఖ నివేదించింది. 21న మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని వివరించింది. ఆగమ పండితులను సంప్రదించిన తర్వాత తేదీలు ఖరారు చేశామని తెలిపింది. పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేశామని పేర్కొంది. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం పిల్‌పై విచారణను మూసివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. శ్రీశైలంలో మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణను వాయిదా వేస్తూ దేవదాయశాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అఖిల భారత వీరశైవ ధార్మిక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గతేడాది మేలో విచారణ జరిపిన ధర్మాసనం ముహూర్తం తిరిగి ఖరారు చేయాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, శ్రీశై లం ఈవోను ఆదేశించింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధర్మాసనం దేవదాయశాఖ కమిషనర్ హాజరుకు ఆదేశించింది. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దేవదాయశాఖ కమిషనర్, ఐఏఎస్ అధికారి సత్యనారాయణ హైకోర్టు ముందు హాజరయ్యారు. దేవదాయశాఖ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మహాకుంభాభిషేకం నిర్వహణకు పీఠాధిపతులు, ఆగమపండితులు భిన్న ముహూర్తాలు నిర్ణయించార ని తెలిపారు. అందరి సలహాలు తీసుకొని ఈ నెల 16 నుంచి 21 వరకు మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు ముహూ ర్తం ఖరారు చేశామని పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. పుష్కరాలు ముగిసిన తరువాత మహాకుంభాభిషేకం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. 2016లో పుష్కరాలు ముగిశాయని, దాదా పు ఏడేళ్ల తరువాత కోర్టు ఆదేశాలతో తేదీలు ఖరారు చేశారన్నారు. గతంలో కుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు చేసి, అర్ధాంతరంగా రద్దు చేయడంతో రూ.2 కోట్లు నష్టం వాటిల్లిందని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొనేందుకు వీలుగా పిల్‌పై విచారణను మూసివేయవద్దని కోరారు.

మనమంతా ఒకే కుటుంబం.. ధైర్యంగా ఉండండి

» పల్నాడులో భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర



నరసరావుపేట మండలం ములకలూరులో సైదా కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

నరసరావుపేట, ఫిబ్రవరి 7: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో కలత చెంది మరణించిన పల్నాడు జిల్లాలోని 5 కుటుంబాలను నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. మనమంతా ఒకే కుటుంబం.. ధైర్యంగా ఉండండి.. పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నిజం గెలవాలి పేరుతో యాత్ర చేపట్టిన భువనేశ్వరి బుధవారం చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక యడ్లపాడు ఎస్టీ కాలనీలో మరణించిన మొగిలి సత్యనారాయణ, నరసరావుపేట మండలం ములకలూరులోని షేక్ సైదా, పాలపాడులోని కొలికొండ ఆంజనేయులు, రొంపిచర్ల మండలం అన్నవరంలో ఉదయ్‌శేఖర్, చిన్న బిక్షాలు కుటుంబాలను పరామర్శించారు.

ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్య

నార్పల/కొండాపురం, ఫిబ్రవరి 7: అప్పుల బాధతో రాష్ట్రంలో ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని పులసులనూతల గ్రామానికి చెందిన రైతు శ్రీధర్(38)కు 4 ఎకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని అరటి పంట సాగుచేస్తున్నాడు. ఏటా నష్టాలు రావడంతో వడ్డీ వ్యాపారుల వద్ద రూ.12 లక్షలు, బ్యాంకులో రూ.90 వేల రుణాన్ని తీర్చలేకపోయాడు. ఈ క్రమంలో ఒత్తిడి భరించలేక బుధవారం తోటకు వెళ్లి సెల్ఫీ వీడియో తీసుకుని, చెట్టుకు ఉరివేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం గొట్టిగుండాల గ్రామానికి చెందిన పులివర్తి శ్రీను(36) యాభై ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నాడు. రూ.18 లక్షలకు పైగా అప్పులపాలయ్యాడు. తీవ్రమనోవేదనకు గురైన శ్రీను పురుగు మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పి.అప్పలరాజు(41) 2 ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట వేయగా నష్టాలు వచ్చాయి. చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి మృతి చెందారు.

..చివరికి మినీ డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

లెక్కలు వేయడం మొదలుపెట్టిన ప్రభుత్వం అనేక సార్లు మాట మార్చింది. ఒకసారి అసలు లేవని, ఒక సారి 700 మాత్రమే ఉన్నాయని, మరొకసారి 18వేలు ఉన్నాయని, కానీ 8వేలు మాత్రమే అవసరమని రకరకాల ప్రకటనలు చేసింది. దీంతో అసలు డీఎస్సీ ఇచ్చే ఆలోచన లేకే ఇలా కాకి లెక్కలు చెబుతున్నారని నిరుద్యోగులు భావించారు. కానీ ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం డీఎస్సీ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు కూడా తప్పుడు లెక్కలు వేసింది. గత ప్రభుత్వం 2018లో 7729 పోస్టులతో డీఎస్సీ ప్రకటించి ప్రక్రియ ప్రారంభించింది. ఆ ప్రక్రియ ఈ ప్రభుత్వంలో పూర్తయ్యింది. మధ్యలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ పేరుతో సుమారు 46 పోస్టులు భర్తీ చేశారు. ఇవి కాకుండా ఇంకే పోస్టులనూ ఈ ప్రభుత్వం భర్తీ చేయలేదు. కానీ భర్తీ చేసినట్లుగా చూపించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేసింది. అందుకోసం 1998, 2008 డీఎస్సీల్లో న్యాయ వివాదాలతో పోస్టులు పొందలేకపోయిన అర్హులను ఇప్పుడు మినిమం టైమ్ స్కేలు ప్రాతిపదికన తీసుకున్నారు. అంటే వారు రెగ్యులర్ టీచర్లు కారు. కాంట్రాక్టు ప్రాతిపదికనే పనిచేస్తారు. 1998 డీఎస్సీలో 4534 మంది, 2008 డీఎస్సీలో 1910 మందిని తీసుకునేందుకు అనుమతిచ్చారు. కానీ వారిలో అందరూ వాటిలో చేరలేదు. 1998 డీఎస్సీలో సుమారు 400 మంది చేరలేదు. కానీ అందరూ చేరినట్టుగా చూపిస్తోంది. ఇంకా విచిత్రం ఏంటంటే 1998 డీఎస్సీకి సంబంధించి ఈ ప్రభుత్వంలో విధుల్లో చేరినవారు నెలలోపే అనేక మంది రిటైర్ అయిపోయారు. కానీ వారందరూ విధుల్లో ఉన్నట్టుగా ప్రభుత్వం చూపించింది. అలా 2018, 1998, 2018 డీఎస్సీలు కలిపి 14,219 టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు చూపిస్తోంది. ఇందులో 6,444 పోస్టులు పూర్తిగా కాంట్రాక్టు అయినప్పటికీ వాటినీ రెగ్యులర్‌గా ప్రచారం చేస్తోంది. అలా చూసినా ప్రతిపక్ష నేతగా జగన్ చెప్పిన 23వేల ఖాళీలకు లెక్క కుదరడం లేదు. ఈ ప్రభుత్వం భర్తీ చేసినట్లుగా చెబుతున్న 14,219, ఇప్పుడు ప్రకటించిన 6,100 కలిపితే 20,319 అవుతున్నాయి. అది కూడా రాబోయే రిటైర్‌మెంట్లతో కలిపి. మరి మిగిలిన 3వేల పోస్టులు ఏమయ్యాయి?.

జీవో 117తో పోస్టులు మాయం

ప్రభుత్వం హడావుడిగా డీఎస్సీ ప్రకటించినా.. అధికారులు అసలు పోస్టులే లేవని అంచనా వేశారు. ఎందుకంటే 2022లో తీసుకొచ్చిన జీవో 117 మొత్తం పాఠశాల విద్య స్వరూపాన్ని మార్చేసింది. 20 మంది పిల్లలకు ఒక్క టీచర్‌చాలని, 60 మంది వరకు ఇద్దరు టీచర్లేనని, ప్రతి టీచర్ వారంలో 36 పీరియడ్లు బోధించాలనే నిబంధన తెచ్చింది. అలాగే 137 మంది కంటే తక్కువ మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ పోస్టు అక్కర్లేదని తొలగించింది. 98 మంది కంటే తక్కువ మంది ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు రెగ్యులర్ సబ్జెక్టు టీచర్లు అవసరం లేదని పేర్కొంది.



మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు

దగాకోరు సీఎంకు బుద్ధి చెబుతాం!

» జగన్‌కు నిరుద్యోగుల హెచ్చరిక.. పలు చోట్ల ర్యాలీలు

అనంతపురం విద్య, కలెక్టరేట్(విజయనగరం), ఫిబ్రవరి 7: మెగా డీఎస్సీ విడుదల చేస్తానని హామీ ఇచ్చి.. దగా డీఎస్సీ విడుదల చేసిన దగాకోరు ముఖ్యమంత్రి జగన్‌కు బుద్ధి చెబుతామని నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. బుధవారం అనంతపురం, విజయనగరంలలో నిరసనలు ర్యాలీలు నిర్వహించారు. నిరుద్యోగుల జేఏసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో నిర్వహించిన ర్యాలీలో 'సీఎం డౌన్‌డౌన్.. మెగా డీఎస్సీ విడుదల చేయాలి' అంటూ నినాదాలు హోరెత్తించారు. జగన్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలపడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా ఏపీ నిరుద్యోగుల జేఏసీ కన్వీనర్ పవన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 15 లక్షల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం 6,100 పోస్టులు మాత్రమే భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. అప్రెంటిస్ విధానాన్ని తీసుకొచ్చి, నిరుద్యోగులను నిలువునా మోసం చేశారన్నారు. మెగా డీఎస్సీని విడుదల చేయకుంటే నిరుద్యోగులంతా రిటర్న్ బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపుతారని హెచ్చరించారు. విజయనగరంలో కోట నుంచి కలెక్టరేట్ వరకు డీఎస్సీ అభ్యర్థులు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, 25 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 'నాలుగేళ్లుగా డీఎస్సీ విడుదల చేయకపోవడం సిగ్గు సిగ్గు.. మెగా డీఎస్సీ ఎక్కడ? మెగా డీఎస్సీ ఇవ్వకపోతే నిన్ను దింపడానికి మేము సిద్ధం.. జీవో 117ను రద్దు చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

12న డీఎస్సీ నోటిఫికేషన్ / మార్చి 15 నుంచి పరీక్షలు

మొత్తం రిటైర్మెంట్‌లతో కలిపి 6,100 పోస్టుల భర్తీకి చర్యలు

» ఏప్రిల్ 7న ఫలితాలు: మంత్రి బొత్స

» నేటి నుంచి టెట్‌కు దరఖాస్తులు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ వివరాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం వెల్లడించారు. మొత్తం 6,100 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. భర్తీ చేయనున్న ఖాళీలు ప్రస్తుతం ఉన్నవే కాదని, ఈ ఏడాది ఏప్రిల్ 31 నాటికి రిటైరయ్యే వారిని కూడా కలిపి అంచనా వేసినట్లు పేర్కొన్నారు. జూన్ నాటికి కొత్తగా ఉద్యోగాలు పొందిన టీచర్లకు పోస్టింగ్‌లు ఇచ్చి, పాఠశాలల్లో ఒక్క ఖాళీ కూడా లేకుండా చూస్తామన్నారు. 2018 డీఎస్సీలో ఉన్న నిబంధనలనే ఇప్పుడు అమలు చేయబోతున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో 14,219 టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. వీటిలో 1998, 2008 డీఎస్సీకి చెందిన ఎంటీఎస్ టీచర్లు కూడా ఉన్నారని చెప్పారు. ఎన్నికల తర్వాత పోస్టింగులు ఇచ్చే ప్రక్రియ ఉంటుందని, అందువల్ల ఎన్నికల కారణంగా ఇది మధ్యలో నిలిచిపోయే అవకాశం లేదని తెలిపారు. గత ప్రభుత్వం పరీక్షల్లో అక్రమాలను ప్రోత్సహించిందని, తాము పాస్ పర్సంటేజీల కోసం కాకుండా పరీక్షలను పరీక్షల్లా నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో రిటైర్ అయ్యే టీచర్లను విద్యా సంవత్సరం ముగిసే వరకూ కొనసాగించాలనే ఆలోచన ఉందన్నారు.

భర్తీ చేయనున్న పోస్టులు	
సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)	2,280
స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)	2,299
ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)	1,264
పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)	215
ప్రిన్సిపాల్	42

డీఎస్సీ షెడ్యూల్ ఇదీ..

డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వివరించారు. ఈ నెల 12న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అదే రోజు నుంచి ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం. ఈ నెల 12 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లింపు. మార్చి 5 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం. మార్చి 15 నుంచి 30 వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు జరుగుతాయి. జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు అర్హతగా నిర్ణయించారు.

టెట్ షెడ్యూల్

టెట్ షెడ్యూలును పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించవచ్చు. 18 వరకు దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉంది. ఈ నెల 23 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 27 నుంచి మార్చి 9 వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు వారికి కావాల్సిన పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవచ్చు. ఎవరైనా ఎంపిక చేసుకోకపోతే వారికి సమీపంలోని కేంద్రం ఆటోమేటిక్‌గా ఎంపిక అవుతుంది.

డీఎస్సీపై ఎందుకీ హడావుడి?

» నోటిఫికేషన్‌పై ఆశావాహ అభ్యర్థుల ఆగ్రహం

అవనిగడ్డ, ఫిబ్రవరి 7: ఐదేళ్లుగా మెగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న తమ ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం సాధారణ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని డీఎస్సీ ఆశావహులు ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ప్రక్రియ మొదలు నుంచి తుది పరీక్ష వరకు 37 రోజుల సమయమే ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బుధవారం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం మార్చి 15వ తేదీ నాటికి తుది పరీక్ష పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో నిర్వహించిన డీఎస్సీలకు కనీసంలో కనీసం నోటిఫికేషన్, పరీక్షకు మధ్య 45 రోజులు గడువు ఇచ్చారు. కానీ, ఇప్పుడు హడావుడిగా మార్చిలోపు పరీక్షలు పూర్తి చేసేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుట్రతో తమపై ఒత్తిడి పెంచుతున్నారని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం సమావేశమైన డీఎస్సీ ఆశావాహులు మండిపడ్డారు.

రూ.100 కోట్ల వసూలే లక్ష్యం

ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి టెట్, డీఎస్సీల పేరుతో ఫీజులు వసూళ్లు చేయటమే ప్రభుత్వ ధ్యేయంగా ఉందని డీఎస్సీ ఆశావాహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలు రాకముందే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులందరితో టెట్‌కు ఒకసారి, డీఎస్సీకి ఇంకోసారి మొత్తం రెండు సార్లు ఫీజు కట్టించుకోవాలని ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఐదేళ్లుగా ఎలాంటి ఆదాయం లేకుండా తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవిస్తున్న తమ నుంచి ప్రభుత్వం రూ.100 కోట్ల మేర ఫీజుల రూపంలో వసూలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వకుండా ఇలా హడావుడిగా నోటిఫికేషన్ ఇవ్వటంపై న్యాయపోరాటం చేయాలన్న ఆలోచనలో ఉన్నామని వారు పేర్కొన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారి నుంచే డీఎస్సీ ఫీజు కట్టించుకోవాలన్నారు.

ఎవర్ని మభ్యపెట్టడానికి డీఎస్సీ: నాదెండ్ల

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఏపీపీఎస్సీ, డీఎస్సీ ద్వారా ఒక్క ఉద్యోగం భర్తీ చేయకుండా, ఎన్నికల ముందు హడావుడిగా డీఎస్సీ ప్రకటన చేయడం ఎవరిని మభ్యపెట్టడానికని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు జగన్‌రెడ్డి... అధికారంలోకి రాగానే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని డాంబికాలు పలికారని, ఐదేళ్లవుతున్నా టీచర్ పోస్టు ఒక్కటీ భర్తీ చేయలేదని మండిపడ్డారు. మాట తప్పం, మడమ తిప్పం అని జగన్ ప్రగల్భాలు పలికితే.. నిరుద్యోగులను మభ్యపెట్టడానికే విద్యా మంత్రి బొత్స సిగ్గులేకుండా, ఎన్నికలు దగ్గరకు వచ్చాక 6,100 టీచర్ పోస్టులతో డీఎస్సీ ప్రకటించారని ఆరోపించారు.

టీచర్ల రిటైర్మెంట్‌పై కొత్త ఎత్తు

» విద్యా సంవత్సరం మధ్యలో రిటైరైనా ఏడాదంతా కొనసాగించేలా వ్యూహం

» ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు వల

» రిటైర్మెంట్ ప్రయోజనాలు సకాలంలో ఇచ్చే అవకాశం లేకుండా తప్పించుకునే ఎత్తుగడ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదవీ విరమణ విషయంలో జగన్ ప్రభుత్వం కొత్త ఎత్తు వేస్తోంది. సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా రిటైర్మెంట్ సమయాన్ని మార్చే ఆలోచన చేస్తోంది. తద్వారా వారిని ఎన్నికలకు ముందు మచ్చిక చేసుకోవడం ఒక ఎత్తయితే, రిటైర్మెంట్ ప్రయోజనాలను సకాలంలో అందించకుండా జాప్యం చేసే మరో ఎత్తుగడ ఈ వ్యూహం వెనుక దాగి ఉండడం గమనార్హం. వాస్తవానికి ఉపాధ్యాయులైనా, ఉద్యోగులైనా రిటైర్మెంట్ అనేది వారి పుట్టిన తేదీ ఆధారంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో 58 ఏళ్ల రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లు చేస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని 62 ఏళ్లకు పెంచింది. అయితే రిటైర్మెంట్ వయసు ఏదైనా పుట్టిన తేదీ ఆధారంగా నిర్దేశిత సమయం చేరుకున్నప్పుడు ఆ నెలలోనే రిటైర్ అవుతారు. కానీ, వైసీపీ ప్రభుత్వం టీచర్లు రిటైర్ అయినా విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగించాలని ప్రతిపాదించింది. ఏటా పాఠశాలలకు విద్యా సంవత్సరం జూన్‌లో ప్రారంభమై, ఏప్రిల్‌లో ముగుస్తుంది. ఈ మధ్య కాలంలో ఎవరైనా టీచర్ రిటైర్ అయితే, వారిని ఆ విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగాలించాలనేది ప్రభుత్వ ఆలోచన. అంటే జూన్ నుంచి మార్చి మధ్యలో ఏ నెలలో రిటైర్ అయినా ఏప్రిల్ వరకు వారు కొనసాగనున్నారు. దీనివల్ల విద్యార్థులకు టీచర్ల కొరత ఉండదని ప్రభుత్వం చెబుతోంది. కానీ, గతంలో ఎప్పుడూ ఇలాంటి విధానం ఎక్కడా అమలుచేయలేదు. సాధారణంగా విద్యా సంవత్సరం మధ్యలోనూ టీచర్లను బదిలీ చేస్తుంటారు. అప్పుడు కూడా విద్యార్థులకు ఇబ్బంది ఏర్పడుతుంది. అలాగే, ఒక టీచర్ రిటైర్ అయితే ఆ స్థానంలో కొత్తవారు పాఠాలు చెబుతారు. ఈ ప్రభుత్వంలోనూ ఇదే విధానం ఉంది. ఇప్పుడు కొత్తగా విద్యార్థుల ఇబ్బంది గుర్తుకొచ్చింది. ఇకపై ఒక్క టీచర్ ఖాళీ కూడా ఉండకూడదనే లక్ష్యంతో ఇలా ఆలోచన చేసినట్లు చెబుతోంది. కానీ, గత నాలుగున్నరేళ్లుగా వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టించుకోలేదు. 10 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉంటే భర్తీ చేయకుండా వదిలేసింది. ఇంతకాలం టీచర్ల కొరత ఉన్నా పట్టించుకోకుండా, ఇప్పుడు రిటైర్మెంట్ విధానాన్నే మార్చాలని చూస్తోంది. ఎన్నికలకు ముందు టీచర్లను ఆకర్షించడానికి రాజకీయ కోణంలో ఈ ఆలోచన చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనివల్ల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంది. అంతేకాదు, ఎప్పటి ఖాళీలు అప్పుడు భర్తీ చేయడంలో ఈ విధానం అడ్డంకిగా మారుతుంది. ఇప్పటికే రిటైర్ అయిన వారికి సకాలంలో పదవీ విరమణ ప్రయోజనాలు అందడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతుంటే మళ్లీ ఈ కొత్త విధానాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కొత్త ఆలోచనతో ప్రయోజనాలను ఇంకా ఆలస్యం చేసే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే ఎవరైనా టీచర్ జూలైలో రిటైర్ అయినా వారికి ఆ తర్వాత ఏడాది ఏప్రిల్ వరకు ప్రయోజనాలు అందవు.

కలిసి ఉద్యమం చేద్దాం!

» ఏపీజేఏసీ అమరావతితో ఏపీజేఏసీ బృందం చర్చలు

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవటంపై కలిసి ఉద్యమం చేద్దామని ఏపీజేఏసీ అమరావతి నాయకత్వానికి, ఏపీజేఏసీ నాయకత్వం ప్రతిపాదించింది. ఏపీజేఏసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు బుధవారం తన బృందాన్ని విజయవాడలోని ఏపీ రెవెన్యూభవన్‌కు పంపించారు. ఈ బృందంలో జేఏసీ ప్రధానకార్యదర్శి హృదయరాజు, ఏపీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, హరనాథ్, జగదీష్ తదితరులున్నారు. ఏపీజేఏసీ అమరావతి తరఫున చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, విజయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. బండి శ్రీనివాసరావు పంపిన వర్తమానాన్ని ఏపీజేఏసీ బృందం బొప్పరాజుకు తెలియజేసింది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉండటం, ఉద్యోగుల బకాయిల చెల్లింపులపై ఏ ఒక్క హామీ అమలు కాకపోవటం వంటి కారణాల వల్ల ఉద్యమం దిశగా వెళ్లాల్సి వచ్చిందని శివారెడ్డి, హృదయరాజు చెప్పారు. ఈ నెల 11వ తేదీన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని, అందులో కార్యాచరణ ప్రకటించాలన్న నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గతంలో మాదిరిగా రెండు జేఏసీలు కలిసి పోరాటం సాగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని బండి శ్రీనివాసరావు భావిస్తున్నారని బొప్పరాజుకు వివరించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ బృందానికి బొప్పరాజు ఒక షరతు విధించారు. ఈ సారి నల్లబ్యాడ్జీలు, ధర్నాలు, ప్రదర్శనలు అంటూ సుదీర్ఘ షెడ్యూల్ లేకుండా నేరుగా రాష్ట్ర స్థాయిలో ఉద్యోగుల సత్తా చాటేలా 'చలో విజయవాడ'ను మళ్లీ నిర్వహిద్దామని ప్రతిపాదించారు. ఆ తర్వాత నేరుగా సమ్మెలోకి వెళదామన్నారు. ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ ఈ విధంగా ఉంటే తాము తక్షణం కలిసి వస్తామని చెప్పారు.

పశువుల కంటైనర్ బోల్తా

» ఇద్దరు కూలీలు దుర్మరణం

» 40 ఆవులు, ఎద్దులు మృతి

» మరో 20 పశువులకు గాయాలు



బోల్తాపడ్డ కంటైనర్

తాడిపత్రి, ఫిబ్రవరి 7: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా పశువులను తరలిస్తున్న కంటైనర్ అదుపు తప్పి.. రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్‌లో ఉన్న ఇద్దరు కూలీలు దుర్మరణం పాలయ్యారు. సుమారు 40 ఆవులు, ఎద్దులు మృత్యువాతపడ్డాయి. మరో 20 పశువులు కూడా గాయపడ్డాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు నుంచి కంటైనర్‌లో 60కిపైగా ఆవులు, ఎద్దులను అక్రమంగా బెంగళూరు వైపు తరలిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. మృతులను విశాఖపట్నం జిల్లా దేవవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు (45), శ్రీకాకుళం జిల్లా వంగవానిపేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు (46)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని.. గాయపడిన పశువులను గుత్తి పశువైద్యశాలకు తరలించారు.

కరోనా కంటే ప్రమాదకరమైంది వైసీపీ

» దానికి వ్యాక్సిన్ జనసేన - టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమే: నాగబాబు



పాయకరావుపేట రూరల్, నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 7: 'రాష్ట్రంలో కరోనా కంటే ముందే వచ్చిన ప్రమాదకరమైన వైరస్ వైసీపీ. దానిని అరికట్టడానికి ఒకే ఒక వ్యాక్సినేషన్ జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం' అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అధికారంలో ఉంటే ఏమైనా చేయగలమనే అహంకారాన్ని కూలదోయాలి. మనకు ముఖ్యమైన ప్రత్యర్థి వైసీపీయే. పోరాడవలసిందీ ఆ పార్టీతోనే. విశాఖపట్నం అద్భుతమైన ప్రాంతం. రాజధాని పేరుతో దానిని నాశనం చేశారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో శాసనసభలో జనసేన అభ్యర్థుల గళం వినిపించాలి. అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను అర్థం చేసుకుని ప్రతి జనసైనికుడు పనిచేయాలి. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించి తీరాలి. ఎందుకంటే మనం యుద్ధం చేసేది ఆంధ్ర జాతికే అత్యంత ప్రమాదకరమైన శత్రువు వైసీపీతో. పొత్తు ధర్మాన్ని పాటించాలి' అని నాగబాబు అన్నారు. కాగా.. ఉత్తరాంధ్రలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నామని నాగబాబు అన్నారు. బుధవారం ఆయన అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'జనసేన, టీడీపీ మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తికాలేదు. త్వరలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒక నిర్ణయం తీసుకొని ప్రకటన చేస్తారు' అని అన్నారు.

పొత్తుల వ్యవహారం అగ్ర నాయకత్వం చూసుకుంటుంది: పురందేశ్వరి

» ప్రజా కంటక పాలన అంతం అవ్వాలన్నదే మా లక్ష్యం: సత్యకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుల వ్యవహారాన్ని తమ పార్టీ అగ్రనాయకత్వం చూసుకుంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం గుంటూరు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఎప్పుడు, ఎవరితో భేటీ అవ్వాలో, పొత్తులు ఎవరితో పెట్టుకోవాలో పార్టీ ఆలోచన చేసి తుది నిర్ణయం తీసుకొంటుంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీ పర్యటన గురించి మాకు సమాచారం లేదు' అని పురందేశ్వరి అన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ.. 'జాతీయ స్థాయిలో జరిగే వ్యవహారాలపై మాకు అవగాహన ఉండదు. మూడు నాలుగు రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుంది. రాష్ట్రం బాగుండాలి, ప్రజా కంటక పాలన అంతం అవ్వాలి అనే నినాదంతోనే రాష్ట్ర నాయకత్వం ముందుకెళుతుంది. షర్మిలకు ప్రత్యేక హోదా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో ఎందుకు చేర్చలేదో ఆమె పార్టీనే అడగాలి' అని హితవు పలికారు.

దొంగలతో దోస్తీ.. ముగ్గురు పోలీసుల డిస్మిస్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: దొంగతో సావాసం చేసినందుకు అనంతపురం జిల్లాలో ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగించారు. అనంతపురం టూటౌన్‌లో పనిచేస్తూ, సీసీఎస్‌కు అటాచ్‌లో ఉన్న ఎస్.ప్రవీణ్‌కుమార్, వన్‌టౌన్‌లో పనిచేస్తున్న ఎస్.ఫరూక్‌బాషా, డీటీసీలో పనిచేస్తున్న ఆనంద్‌బాషాను ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. కడప జిల్లా ముద్దనూరు మండలం నల్లబల్లికి చెందిన కె.సాంబయ్యశెట్టి దొంగతనం కేసులలో నిందితుడు. దోచుకున్న సొమ్ములో పెద్ద మొత్తాన్ని ముగ్గురు కానిస్టేబుళ్లకూ అప్పగించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై 2012లో చార్జ్‌మెమో ఇచ్చారు. విచారణ అనంతరం ముగ్గురినీ ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఆ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్ఐని చెప్పుతో కొట్టిన వైసీపీ నాయకుడు

కొత్తచెరువు, ఫిబ్రవరి 7: విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై అధికార పార్టీ సర్పంచ్ తనయుడు చెప్పుతో దాడి చేశాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం లోచెర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. జగనన్న లే అవుట్లలో పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం గ్రామ సచివాలయాల్లో జరుగుతోంది. లోచర్ల గ్రామ సచివాలయంలో సిబ్బందితో కలిసి ఆర్ఐ దుర్గేశ్ రిజిస్ట్రేషన్ పనులను చేపట్టారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కిత్తర గంగమ్మ తనయుడు, వైసీపీ నాయకుడు నారాయణస్వామి అక్కడికి చేరుకుని వీరంగం సృష్టించాడు. ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశాడు. ఆర్ఐ దుర్గేశ్‌ను చెప్పుతో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిన్న ఎన్నిక–పెద్ద కుట్ర

ప్రజాస్వామ్యాన్ని హత్యచేశారు, అపహాస్యం చేశారు అంటూ సుప్రీంకోర్టు చండీగఢ్ మేయర్ ఎన్నికల వ్యవహారంలో తీవ్రంగా విరుచుకుపడినందుకు చాలామందికి సంతోషం కలిగింది. దేశంలో ఈ తరహా హత్యలు, ఇంకా పెద్దపెద్దవే అనేకం జరుగుతున్నకాలంలో, ఒక చిన్న ఎన్నికను కూడా సుప్రీంకోర్టు ఇంత తీవ్రంగా తీసుకొని, కఠినంగా మాట్లాడినందుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుంకట్టినందుకు మెచ్చుకోవాల్సిందే. పాలకపక్షం తన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నప్పుడూ, పార్టీలను చీల్చి రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నప్పుడూ విపక్షాలు వాడే పదజాలం ఇప్పుడు సుప్రీంకోర్టు నోటినుంచి రావడం కూడా ఓ విశేషం.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉన్నదో చండీగఢ్ ఉదంతం చెబుతోందని చాలామంది వాపోతున్నారు. ఎన్నికల ప్రక్రియ ఎలా జరిగిందో తెలియచెప్పే వీడియోలు న్యాయమూర్తుల కళ్ళముందే ఉన్నందున వారికి కూడా అలాగే అనిపించి ఉంటుంది. ఆ వీడియోల్లో పోలింగ్ పెద్దగా వ్యవహరించిన బీజేపీ మైనారిటీ విభాగానికి చెందిన నామినేటెడ్ కౌన్సిలర్ అనిల్ మాసి బ్యాలెట్ పత్రాల మీద తన రాతకోతలతో కొన్ని ఓట్లను చెల్లకుండా చేసి, ఫలితాన్ని తన పార్టీకి అనుగుణంగా మార్చుకోవడం కనిపించింది. ఓటును పనికిరాకుండా చేయడానికి ఉన్న మూడుమార్గాలను వినియోగించుకొని, కాంగ్రెస్ కౌన్సిలర్ల ఎనిమిది ఓట్లను రద్దుచేసి, చెల్లిన ఓట్లలో ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థికంటే బీజేపీ అభ్యర్థికి నాలుగు ఓట్లు ఎక్కువ వచ్చాయని నిర్ధారించాడాయన. ఒక విధంగా ఇది పట్టపగలు, నడిబొడ్డున, అందరూ చూస్తుండగా జరిగిన హత్యలాంటిది. అమాయకత్వమో, భయమో తెలియదు కానీ, ఆయన ఈ తప్పుచేస్తూ కెమెరావైపు చూస్తుండటం కూడా పాపాన్ని సులువుగా పట్టిచ్చింది.

ఇదేమీ అప్పటికప్పుడు జరిగిన కుట్ర కాదు. తిమ్మినిబమ్మిని చేసి అయినా సరే మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్న ప్రయత్నాలు ముందే ఆరంభమైనాయి. జనవరి 18న జరగాల్సిన ఈ ప్రక్రియను ఆఖరునిముషంలో, అనిల్ మాసి అనారోగ్యం పేరిట ఫిబ్రవరి 6కు వాయిదావేయడంతో, ఆప్ అభ్యర్థి పంజాబ్–హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు జోక్యంతో అది ముందుకు జరిగి జనవరి 30న పూర్తయింది. ఆప్–కాంగ్రెస్ ఉమ్మడి బలం ఇరవై కనుక, మేయర్ స్థానం అతి సులభంగా ఆ పక్షానికే దక్కాలి. కానీ, ఈ బ్యాలెట్ల రద్దు తరువాత, కేవలం 16 ఓట్లు వచ్చిన బీజేపీ అభ్యర్థి విజేత కాగలిగాడు. ఇది ఆఖరినిముషంలో జరిగిన మరో కుట్ర అని అనుమానం వచ్చిన ఆప్–కాంగ్రెస్ కౌన్సిలర్లు రద్దయిన ఓట్లను తమకు చూపించాలని ప్రిసైడింగ్ అధికారిని డిమాండ్ చేసినా ఆయన అంగీకరించలేదు. దీనితో, బీజేపీ అభ్యర్థికి ఆ పార్టీ కౌన్సిలర్ల ఓట్లన్నీ పూర్తిగా పడి, ఆప్ అభ్యర్థికి పడాల్సినవన్నీ ఎందుకు పడలేదో ఎవరికీ తెలియకుండా పోయింది. ముపె[illegible]దుమంది కౌన్సిలర్లు, ఒక పార్లమెంటు సభ్యుడు చేతులు ఎత్తి ఈ ప్రక్రియను సులువుగా పూర్తిచేయవచ్చు. కానీ, రహస్యబ్యాలెట్ ప్రవేశపెట్టడం ద్వారా క్రాస్ ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉండివుంటుంది. అది సాగకపోవడంతో బ్యాలెట్లనే భ్రష్టుపట్టించాలన్న కుట్ర జరిగివుంటుంది. ఎన్నిక వాయిదాను నిలువరించి, దానిని ముందుకు జరిపిన హైకోర్టు, ఈ కీలక పరిణామం తరువాత, అన్యాయం జరిగిన ఆప్ అభ్యర్థికి తలుపులు మూసివేయడం విచిత్రం. ఈ కారణంగానే, తగిన సమయంలో సరైన ఉత్తర్వులు జారీచేయాల్సిన హైకోర్టు అందులో విఫలమైందని సుప్రీంకోర్టు ఓ మాట అనక తప్పలేదు.

సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహాలు, ఆదేశాలు అటుంచితే, ఆప్–కాంగ్రెస్ ఒక్కటిగా తెరమీదకు వచ్చిన ఈ తొలి ఎన్నికను చావుదెబ్బతీయడం బీజేపీ అంతిమలక్ష్యం కావచ్చు. అధికారం కంటే, ఆ రెండుపార్టీల కలయికతో సాధించిన విజయం, అది దేశవ్యాప్తంగా అందించే సందేశం మరింత ప్రమాదకరమైనవని దానికి అనిపించివుండవచ్చు. నిస్సిగ్గుగా, నిర్లజ్జగా సాగిన ఈ వ్యవహారం ఒక చిన్న మునిసిపల్ కార్పొరేషన్‌కు పరిమితం కాదనీ, అది ప్రజాస్వామ్యం మనుగడనే ప్రశ్నిస్తోందని సుప్రీంకోర్టుకు సైతం అనిపించింది. సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి మూడోసారి అధికారంలోకి రావాలని, రాగలనని అనుకుంటున్న ఒక పెద్దపార్టీ, ఒక చిన్న ఎన్నిక విషయంలో ఈ విధంగా వ్యవహరించడం దానికి తీవ్ర అప్రదిష్ట తెస్తుంది. మేయర్ ఎన్నికలోనే ఇంత కుట్రచేసినవారు పెద్ద పెద్ద ఎన్నికల్లో పెద్దరికంతో వ్యవహరిస్తారా అని ప్రజలకు అనిపిస్తే అది ఓ పార్టీకే కాదు, యావత్ ఎన్నికల ప్రక్రియకు, ప్రజాస్వామ్యానికీ ప్రమాదకరం.

దేశ సమగ్రత కోసమే కులగణన

'కుల గణన విదేశీశక్తుల ఎజెండా!?' శీర్షికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ డా. కె. అరవింద రావు ఆంధ్రజ్యోతిలో రాసిన వ్యాసంలో (04.02.2024) కులగణన వల్ల భారతదేశంలో విదేశీ శక్తులు బలపడతాయన్న వాదన చేశారు. ఆయన కులగణనకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఈ అంశాలను లోతుగా ఆలోచిస్తే ఏది నిజం ఏది అబద్ధం అనే విషయం బయటకు వస్తుంది.


అరవింద రావు తన వ్యాసంలో ఇటలీ మార్క్సిస్ట్ స్కాలర్ ఆంటోనియో గ్రామ్సి కల్చరల్ హెజిమొని (Cultural Hegemony) అంశాన్ని ప్రస్తావిస్తూ అమెరికా దేశంలో ఉన్న నల్లజాతీయులు, యూదులు, ముస్లిం దేశాల వలసదారులు, స్వలింగ సంపర్కుల వల్ల అక్కడున్న సంస్కృతి దెబ్బతింటున్నదని, జర్మనీ నుంచి వలస వెళ్ళిన మార్క్సిస్ట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో పాతుకుపోయి అక్కడి సంస్కృతిని నాశనం చేశారని వాపోయారు. బహుశా అమెరికా చరిత్ర తెలియక ఆయన ఇలా రాశారు. అక్కడి నేటివ్ రెడ్ ఇండియన్స్‌ని ఊచకోత కోసి అమెరికా ఎదిగింది. తర్వాతి కాలంలో అమెరికాలో అమల్లోకి వచ్చిన ఉదార విధానాల వల్ల అక్కడకు వివిధ దేశాల నుంచి ప్రజలు వచ్చి స్థిరపడటం, అందువల్ల అక్కడ వైవిధ్యం పెరగడం, ఆర్థికంగా పురోగతి సాధించడం అందరికీ తెలిసిన విషయమే. అమెరికాకు ఒక నల్ల జాతీయుడు అధ్యక్షుడు అయ్యాడు, భవిష్యత్తులో భారతీయ మూలాలు ఉన్న వ్యక్తి కూడా అధ్యక్షుడు కావచ్చు. ఇవన్నీ సాధ్యమయ్యేది అక్కడ నల్లజాతివారి మీద జరిగే వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ లాంటి వారి వల్లనే. అమెరికాలో కేవలం అమెరికా వాళ్ళే ఉండాలి అని, వాళ్ల సంస్కృతిని మాత్రమే పాటించాలని అంటే అక్కడికి ఎవరు వెళ్లేవారు కారు, అక్కడ అంత అభివృద్ధి కూడా జరిగేది కాదు.

అప్పటివరకు సమాజంలోని అసమానతలను ఆర్థిక, రాజకీయ కోణాల్లోంచి మాత్రమే చూసిన మార్క్సిస్ట్ సిద్ధాంతం ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదని విశ్లేషించే తరుణంలో ఆంటోనియో గ్రామ్సి సంస్కృతి అనే అంశం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాడు. ఆధిపత్య వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఏ ప్రాధాన్యతలు పనికి వస్తాయో వాటినే అందరి ప్రాధాన్యతలుగా సంస్కృతి ద్వారా చిత్రీకరించే ప్రయత్నం చేస్తాయని గ్రామ్సీ చెప్పారు. ఈ విషయాన్ని తదుపరి సామాజికవేత్తలు శాస్త్రీయ పద్ధతిలో చేసిన అధ్యయనాల ద్వారా ఆధారాలతో సహా ధ్రువీకరించారు.

ఆంటోనియో గ్రామ్సీ చేసిన సామాజిక విశ్లేషణలో ఇంకొక ముఖ్య అంశం ఆర్గానిక్ ఇంటలెక్చువల్ అనే కాన్సెప్ట్. ఇది ఏం చెప్తుందంటే– ప్రతి వర్గమూ తమ ప్రాధాన్యతలను పెంపొందించుకొనే క్రమంలో తమ వర్గపు మేధావులతో ప్రజలను జయించే ప్రయత్నం చేస్తుంది. కులాన్ని రూపుమాపేందుకు పీడిత వర్గాల మేధావులు కృషి చేస్తుంటే కుల వ్యవస్థ వల్ల బాగుపడుతున్న అగ్రవర్ణాల మేధావులు కొందరు కులం లేదన్న అబద్ధం తరఫున వాదిస్తున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 'శూద్రులు ఎవరు' అనే రచనలో దేశవ్యాప్తంగా చేస్తున్న సెన్సెస్‌లో శూద్రులు ఎందరో తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయడంలో ప్రధానంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించకపోవడమనే అంశాన్ని పేర్కొన్నారు. ఆ తర్వాత బీపీ మండల్ అధ్యక్షతన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ శాస్త్రీయంగా దేశవ్యాప్తంగా పర్యటించి ఆధారాలతో 1931 కుల గణన లెక్కల ఆధారంగా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసులు చేసింది. కానీ సిఫారసులను పదేళ్లపాటు అమలు చేయలేదు. వి.పి.సింగ్ ప్రభుత్వం అమలు చేసింది. ఇది సామాజిక న్యాయం కోసమే కానీ అద్వానీ చేసే రథయాత్రకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదు.

కుల వ్యవస్థలోని అసమానతల రూపురేఖలను, మూల కారణాలను తెలుసుకొనే పలు శాస్త్రీయ ప్రయత్నాలలో కులగణన ఒకటి. శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సమాజాన్ని చదువుతున్న సామాజిక వ్యక్తులను కల్చరల్ మార్క్సిస్టులని, ఆటంకవాదులనీ, భారతదేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని నిరాధారాలతో అపవాదులు అంటగట్టి వాదించడం మనువాద శక్తులకు మామూలైపోయింది. ఎందుకంటే కుల వ్యవస్థ నుంచి అత్యధికంగా లాభపడుతున్నది అగ్రవర్ణాలేనని అందులోని మనువాద శక్తులకు బాగా తెలుసు. అందుకనే వాళ్లు కుల వ్యవస్థను, కులగణనను తొసిపుచ్చే యత్నాలు చేస్తున్నారు. ఈ పోస్ట్ ట్రూత్ (Post–Truth) యుగంలో అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేసే ప్రయత్నాలు ట్రంప్‌ని మొదలుకొని చాలామంది ఫాసిస్టులు చేశారు. ఈ డాక్టర్ కరణం అరవింద్ కూడా ఆ కోవకు చెందిన వారే. ఒకవేళ వారు చేసేది నిజమని వారు నమ్మితే



కుల గణన

శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సమాజాన్ని చదువుతున్న సామాజిక వ్యక్తులను కల్చరల్ మార్క్సిస్టులని, ఆటంకవాదులనీ, భారతదేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని నిరాధారాలతో అపవాదులు అంటగట్టి వాదించడం మనువాద శక్తులకు మామూలైపోయింది. ఎందుకంటే కుల వ్యవస్థ నుంచి అత్యధికంగా లాభపడుతున్నది అగ్రవర్ణాలేనని అందులోని మనువాద శక్తులకు బాగా తెలుసు.

ఫీల్డ్ వర్క్ ఆధారంగా, సర్వే డేటా ఆధారంగా నిరూపించాలని సవాలు చేస్తున్నాం.

కుల గణన వల్ల దేశంలో ఏయే కులాలు ఎంత శాతం ఉన్నాయో, ఆయా కులాల్లో పేదరికం ఎంతో, సంపద ఎంతో తెలుస్తుంది. దీని వలన ఏ కులాన్ని ఏ విధంగా అభివృద్ధి చెయ్యాలో చట్టాలు చేసుకునే వీలు కలుగుతుంది. కుల గణన వలన దేశం ముక్కలవుతుంది అంటున్నారు. అసలు కులం వలనే దేశం ముక్కలు అవుతుంది. కులం ఉన్నంత కాలం కుల కుంపట్లు రాజుకుంటూనే ఉంటాయి. కులం ఉన్నంత వరకు భారతదేశం ఎప్పటికీ ఒక జాతి కాలేదు. కులనిర్మూలన అనేది కేవలం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలతోనే సాధ్యం. అందులో మొదటి మెట్టు ఈ కుల గణన. 'కుల గణన వద్దు' అనే వారు అమాయకత్వంతో ఆ మాట అనటం లేదు. సబ్బండ వర్గాల వారికి తమ జనాభా ఎంతో, తమకి దేశ సంపదలో రావల్సిన వాటా ఎంతో తెలియకుండా ఉండడానికే, అగ్ర కుల ఆధిపత్యాన్ని కొనసాగేలా చెయ్యటానికే వారు ఈ వాదన చేస్తున్నారు.


■ జి. కిరణ్ కుమార్
జాతీయ అధ్యక్షుడు,
ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్

అత్యున్నత గౌరవం వెనుక అంతరార్థం ఏమిటి?

సాక్షాత్తూ ప్రధానమంత్రే పార్లమెంటులో అసత్యాలూ అర్థసత్యాలూ పావుసత్యాలూ చెప్పకూడదు కదా? బుధవారం నాడు రాజ్యసభలో అరివీరభయంకరంగా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వస్తే కానీ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు భారతరత్న గౌరవం దక్కలేదని నరేంద్రమోదీ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎప్పుడూ తమ కుటుంబం వారికే భారతరత్నలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రాధాన్యాల గురించి చర్చించవచ్చు, తప్పులేదు. కానీ, అంబేడ్కర్‌కు అత్యున్నత పౌరగౌరవ ప్రదానాన్ని తమ ఖాతాలో వేసుకోవడమే విచిత్రం. 1990 మార్చి 31 నాడు అంబేడ్కర్‌కు మరణానంతరం భారతరత్న ప్రకటించారు. అప్పుడు కేంద్రంలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ ప్రభుత్వానికి బీజేపీ వెలుపలినుంచి మద్దతు ఇచ్చిన మాట నిజమే కానీ, ప్రభుత్వ నిర్ణయంలో వారి పాత్ర ఉందని ఎట్లా చెప్పగలం? ప్రధానిగా విపిసింగ్ సామాజిక న్యాయం గురించి పట్టింపుగా ఉన్నారు. భారతరత్నతో పాటు, పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటావిష్కరణ కూడా ఆ వెనువెంటనే జరిగింది. ఇందుకు దేశంలో ఆనాడు వస్తూ ఉండిన మార్పులే కారణం. దేశవ్యాప్తంగా దళిత చైతన్యం పెరుగుతున్నది, కాన్షీరామ్ ప్రభావం విస్తరిస్తున్నది. ఈ నేపథ్య కారణాలు కాదని, అప్పటికే రామజన్మభూమిలో తలమునకలై ఉన్న బీజేపీ, అంబేడ్కర్ పేరును ప్రతిపాదించిదని ఎట్లా చెప్పగలం? కాకపోతే, మండల్ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్టు, అంబేడ్కర్‌కు భారతరత్నను బీజేపీ వ్యతిరేకించలేదు, అంతవరకు ఆ కీర్తిలో వాటా ఇవ్వవచ్చు.

నిజంగా విపిసింగ్ భారతరత్న నిర్ణయాలలో తన ప్రమేయం ఉంటే, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఇమ్మని బీజేపీ చెప్పి ఉండేది. అప్పటికే లాల్ కృష్ణ అద్వానీ అభినవ సర్దార్ పటేల్‌గా రూపొందుతూ ఉన్నారు. సర్దార్ పటేల్‌కు భారతరత్న ఆ మరుసటి సంవత్సరం, పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉండగా ప్రకటితమైంది. రాజీవ్ గాంధీకి, జనతారాజకీయాల కురువృద్ధుడు మొరార్జీ దేశాయ్‌కు కూడా పీవీ హయాంలోనే భారతరత్నలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ నాయకపరివారానికి లేదా అస్మదీయులకు మాత్రమే అత్యున్నత పురస్కారాలు ఇచ్చాయని మోదీ అన్నమాట కూడా వాస్తవం కాదు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలకు వారు పదవుల్లో ఉండగానే భారతరత్న ఇవ్వడం ఈ రోజు అనుచితంగా అనిపించవచ్చు కానీ, స్వాతంత్ర్యానంతర కాలపు తొలిసంవత్సరాలలో నెహ్రూకు ఉండిన జనాదరణ, బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలో ఇందిర ప్రాచుర్యం నేపథ్యంలో ఆ గౌరవాలను చూడాలి. పౌరపురస్కారాల ప్రారంభం తరువాత, మొట్టమొదటి భారతరత్న గౌరవం నోబెల్ పొందిన శాస్త్రవేత్త సి.వి. రామన్‌కు 1954లో దక్కింది. ఆ తరువాత, జాతీయోద్యమకాలానికి చెందిన అనేకమంది ప్రముఖులకు, వివిధరంగాల మేధావులకు భారతరత్నలు ఇచ్చారు. 1970 దశకం నుంచి ప్రమాణాలు పలచబడడం మొదలయింది. భారతరత్నల ప్రకటనే అరుదు అయింది. 1990 దశకం మలుపులో జరిగిన ప్రకటనలు, దేశరాజకీయాలలో వస్తున్న మార్పులకు సూచనలుగా చెప్పుకోవచ్చు.

మొదటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఆశ్చర్యకరంగా ఒక్క మితవాద రాజకీయవాదికీ భారతరత్నలు ఇవ్వలేదు. వాజపేయి ప్రధానిగా ఉన్న కాలంలో సంగీతకళాకారులు పండిట్ రవిశంకర్, బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ జోషి, అస్సాం ప్రజానాయకుడు గోపినాథ్ బోర్దోలోయి, నోబెల్ గ్రహీత అమర్త్య సేన్, సంపూర్ణ విప్లవ వాది జయప్రకాశ్ నారాయణ్.. వీరూ భారతరత్నలు. మొదటి, రెండో ఎన్‌డీఏ ప్రభుత్వాల మధ్య, వాజపేయికి, నరేంద్రమోదీకి మధ్య ఉన్న తేడాను భారతరత్నల ప్రదానంలో కూడా చూడవచ్చు. రావడం రావడమే వాజపేయి, మదన్ మోహన్ మాలవీయకు భారతరత్నలు ఇచ్చారు. మాలవీయ జాతీయోద్యమకాలపు మత, మితవాది. నానాజీ దేశ్‌ముఖ్‌కు ఇవ్వడం ద్వారా జనసంఘ్ కోవలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నదని, ఇది నెహ్రూ, గాంధీయేతర పరంపర అని బీజేపీ ప్రభుత్వం చాటి చెప్పింది. ఇతరులకు కూడా మోదీ హయాంలో రత్నాలు దొరకలేదని కాదు. ప్రణబ్ ముఖర్జీ, తాజాగా కర్పూరీ ఠాకూర్ బీజేపీ మార్గీయులు కారు కానీ, వారికి గౌరవం ఇచ్చిన సందర్భాలకు రాజకీయ సందర్భం ఉన్నది.



అయోధ్య వ్యాజ్యాన్ని తేల్చివేస్తూ సుప్రీంకోర్టు, సివిల్ పరిష్కారంగా భూమిని హిందువుల పక్షానికి అప్పగించింది. అదే సమయంలో, 1992 డిసెంబర్ నాటి బ్రాబీమసీదు కూల్చివేతను దారుణచర్య అని తప్పు పట్టింది. ఆ చర్యకు బాధ్యులైనవారిపై ఇంకా నేరవిచారణ జరుగుతున్నది. రామజన్మభూమి వ్యవహారంలో ఆ ఒక్క అభియోగాన్ని కూడా పూర్వపక్షం చేయడానికి, కూల్చివేత కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తికి భారతరత్న ఇచ్చి, తమ సర్వంసహా ఆధిపత్యాన్ని బీజేపీ ప్రకటించిందా? అది ఉద్దేశ్యం అయినా కాకపోయినా, ఆ ప్రయోజనం అయితే ఈ ప్రకటన ద్వారా సిద్ధించింది. రాజ్యాంగాలూ న్యాయస్థానాల కంటె అతీతమైన అధికారం దేశంలో ఉనికిలో ఉన్నదని స్పష్టమైంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇక లాల్ కృష్ణ అద్వానీ. ఆయన భారతరత్నకు అర్హుడా కాదా? ఆయనకు ఎందుకు ఇచ్చినట్టు? వంటి చర్చలేవో మీడియాలో జరుగుతున్నాయి. సర్వసాధారణ అర్హతల గురించిన చర్చల వల్ల ఉపయోగం లేదు. బీజేపీ ప్రమాణాల ప్రకారమే అయినా, అద్వానీని గౌరవించాలని మోదీ ప్రభుత్వం ఎందుకు అనుకున్నది అన్న ప్రశ్న రావడం అకారణం కాదు. రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి అద్వానీ ఎందుకు వెళ్లలేదు అన్న కుతూహలం దేశమంతా ఉన్నది. ఆయనను రావద్దన్నారని, లేదు, ఆయనే రాలేనన్నారని అనుకున్నారు. ఆయన వస్తున్నారని విశ్వహిందూపరిషత్ నేతలు చెప్పినట్టు మళ్లీ వార్తలు వచ్చాయి. రామాలయ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన అద్వానీ, మురళీమనోహర్ జోషి ఇద్దరూ అయోధ్య కార్యక్రమంలో కనిపించలేదు. రామాలయ సాధన మోదీ విజయంగా మాత్రమే ప్రదర్శించుకోవడానికి అలనాటి నేతలను ఎడం పెట్టారని కొందరు అర్థం చేసుకున్నారు. నిజానికి, నరేంద్రమోదీకీ, రామాలయ అవతరణకూ అంత పెద్ద సంబంధం ఏమీ లేదు. ప్రభుత్వం నిర్మించింది కాదు కాబట్టి, ప్రధానిగా కూడా ఆయనకు ప్రత్యక్ష ప్రమేయం ఏమీ లేదు. కానీ, మోదీ లేకపోతే రామాలయం సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయాన్ని ప్రజలందరిలోనూ కలిగించడానికి గట్టి ప్రచారమే జరిగింది. ఆ ప్రచారానికి అడ్డంకి అవుతుందని అద్వానీని శ్రమతీసుకోవద్దని 'మర్యాదగా' చెప్పి ఉంటారు. తప్పేమీ లేదు. రాముడికే రాజకీయాల బెడద తప్పలేదు. మానవమాత్రులెంత?

నిరాడంబరత, నిజాయితీ, సిద్ధాంతనిబద్ధత కలిగిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడంలో ఓబీసీల మీద దృష్టి పెట్టిన వ్యూహం తప్ప మరేమీ లేకపోవచ్చు. కానీ, అద్వానీకి ఇవ్వడంలో అసలు అర్థమేమిటి? అయోధ్యకు రాకుండా ఉండి, సహకరించినందుకు భారతరత్న ఇచ్చి ఉంటారని కొందరు అనుకుంటున్నారు. కాదు, మూడు దశాబ్దాల కిందట రథయాత్ర నిర్వహించినందుకు ఇచ్చి ఉంటారని కొందరంటున్నారు. సగౌరవంగా సాగనంపడంలో మోదీ బృందం ప్రసిద్ధమయినది. క్రియాశీల రాజకీయాలలో ఇంకా కొనసాగాలన్న ఉత్సాహం, అందుకు తగ్గ శక్తీ ఉన్న వెంకయ్యనాయుడిని ఉపరాష్ట్రపతిని చేసినప్పుడు ఆయన అభిమానులు నిరుత్సాహపడ్డారు. తాజాగా ఆయనకు పద్మవిభూషణ గౌరవం దక్కడం, అందుకు పరిహారమేమో అని అనిపిస్తే అది సకారణమే. ఎంతటి వెంకయ్య, ఈ మాత్రపు గౌరవానికి సంతోషించి ఊరుకోవలసి వస్తున్నదే అన్న విచారం కలిగితే కూడా తప్పేమీ లేదు. మరి ప్రధాని కావలసిన అద్వానీ, బీజేపీని అధికారపీఠాలకు చేరువ చేసిన సాధకుడు, వృద్ధ సింహంగా, గౌరవరత్నంగా మిగులుతున్నందుకు బాధపడేవారు బీజేపీ శ్రేణులలో కూడా తగినంతమంది ఉన్నారు. 2019లో తిరిగి టికెట్ ఇవ్వనప్పుడే ఆయన రాజకీయ జీవితం ముగిసిపోయింది. రాజకీయాలు నిర్దాక్షిణ్యమైనవని అందుకే అంటారు. ఒకే భావజాలం వారి మధ్య, గురుశిష్య బాంధవ్యం ఉన్నవారి మధ్య కూడా అధికారక్రీడ అనేక చమత్కారాలు చేస్తుంది.

బీజేపీ వ్యూహకర్తల మనసులో మరేదైనా ప్రయోజనం ఉన్నదా? అయోధ్య వ్యాజ్యాన్ని తేల్చివేస్తూ సుప్రీంకోర్టు, సివిల్ పరిష్కారంగా భూమిని

ప్రపంచానికి మన ప్రతినిధులుగా ప్రదర్శించే మహామానవులు కదా, భారతరత్నలు! వారు మన జాతి ఔన్నత్యానికి గుర్తులుగా ఉండాలి!

హిందువుల పక్షానికి అప్పగించింది. అదే సమయంలో, 1992 డిసెంబర్ నాటి బాబ్రీమసీదు కూల్చివేతను దారుణచర్య అని తప్పు పట్టింది. ఆ చర్యకు బాధ్యులైనవారిపై ఇంకా నేరవిచారణ జరుగుతున్నది. రామజన్మభూమి వ్యవహారంలో ఆ ఒక్క అభియోగాన్ని కూడా పూర్వపక్షం చేయడానికి, కూల్చివేత కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తికి భారతరత్న ఇచ్చి, తమ సర్వంసహా ఆధిపత్యాన్ని బీజేపీ ప్రకటించిందా? అది ఉద్దేశ్యం అయినా కాకపోయినా, ఆ ప్రయోజనం అయితే ఈ ప్రకటన ద్వారా సిద్ధించింది. రాజ్యాంగాలూ న్యాయస్థానాల కంటె అతీతమైన అధికారం దేశంలో ఉనికిలో ఉన్నదని స్పష్టమైంది.

ఈ దేశ సమాజంలో, ప్రజాజీవితంలో రత్నాలు ఎన్నో! గుర్తింపు మాత్రం కొందరికే దొరకవచ్చు! కానీ, తమ జీవితాచరణ ద్వారా జనజీవితాన్ని, చైతన్యాన్ని మెరుగుపరచడానికి, మొత్తంగా సమాజగమనాన్ని ముందుకు నడపడానికి తోడ్పడినవారే నిజమైన భారతరత్నాలు. సమష్టి, సహకార జీవితాన్ని, శాంతి సామరస్యాలను, ఉదాత్తమైన విలువలను స్మరింపజేసేవారు స్ఫూర్తిదాతలు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, వ్యక్తిత్వంలో, చిత్తశుద్ధిలో అందరికీ ఆమోదయోగ్యులుగా ఉండేవారు జాతి ఇచ్చే ఉన్నత గౌరవానికి అర్హులు. గౌరవప్రతిష్ఠల కొలువుకూటంలో బారులు తీరిన భారతరత్నాలను చూసినప్పుడు, కొందరు మాత్రమే వినమ్ర వందనాలకు అర్హులుగా కనిపించడం విచారం కలిగిస్తుంది. ప్రపంచానికి మన ప్రతినిధులుగా ప్రదర్శించే మహామానవులు కదా, భారతరత్నలు! వారు మన జాతి ఔన్నత్యానికి గుర్తులుగా ఉండాలి!

కుల గణన వ్యతిరేకులు ఆర్య మనువాదులే!

లెనిన్ మహాశయుడు అన్నట్టుగా ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలియనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు. పేద, మధ్యతరగతి, అభివృద్ధి చెందుతున్న దేశాల అటవీ ఖనిజ సంపదపై కన్నేసిన సామ్రాజ్యవాద దేశాలు ఆయా దేశ ఆదివాసీ తెగలను అంతం చేసే కుట్రలో ఉన్నాయి. ఉద్యమాలను అణచి వేయడానికి బలప్రయోగం ఒక్కటే సరిపోదని గ్రహించిన సామ్రాజ్యవాద అనుకూల మేధావులు ఇప్పుడు అణచివేతకు కుటిల పద్ధతుల్ని ఎంచుకుంటున్నారు. దేశంలో అద్దె మేధావులు, పత్రికలు, ఉన్నత సర్వీస్‌లో ఉన్న అధికారులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులతో సహా, అమ్మకానికి అంగట్లో ఉన్న ఎన్జీఓల దాకా... వీరంతా విదేశీ డాలర్ల కక్కుర్తిలో నిసలైన ఉద్యమాలను నీరుగార్చే కుట్రలో బాగస్వాములే. మండల్ కమండల్ ఉద్యమాలతో దేశం మొత్తం అట్టుడికిన పరిస్థితి ఎంతటి మేధో విధ్వంసాన్ని సృష్టించిందో చూశాం. ఆ సందర్భంలో బీసీలు అనబడే మూలవాసుల ఏకీకరణ ఒకసారి మొదలైతే అది అంతటితో ఆగదు కాబట్టే దాన్ని సిద్ధాంతాలకు అతీతంగా ఈ దేశంలోని ఆర్య తెగలు అడ్డుకునే ప్రయత్నం చేసాయి. ఇప్పుడు మళ్లీ అదే శక్తులు కులగణనను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

భారతదేశం అంటేనే కులాల జాతుల సమూహం. ఈ దేశంలో జాతులకు అస్తిత్వం ఉన్నట్టే కులాలకు అస్తిత్వం ఉన్నది. సాంస్కృతికంగా ఎలాంటి సారూప్యత లేని వర్గాలకు ఈ దేశం ఎప్పటికీ అర్థం కాదు. కుక్కలను, పక్షులను, క్రూర మృగాలను గణన చేసే చోట ఈ దేశ మూలవాసులను, వారి సాంస్కృతిక వైవిధ్యాలను లెక్కబెడితే అభ్యంతరం ఏమిటో ఈ మేధావులే సెలవివ్వాలి. ఈ దేశంలో పేదరికం కులానికి అతీతంగా లేదు. కొన్ని కులాల పేరు చెబితే వారి స్థితి ఏమిటో ఇట్టే తెలిసే పరిస్థితి మన చుట్టూ ఉన్నా మనకి అర్థం కాకపోవడం భావదారిద్ర్యమే! కులగణన వ్యతిరేకించేది కేవలం ఆర్య మనువాదులు మాత్రమే!

– దొమ్మాట వెంకటేష్
సామాజిక కార్యకర్త

గొంతెండుతున్న సీమ దాహం తీరేదెప్పుడు?

2019లో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి పోలవరంతో పాటు మిగిలిన 40 ప్రాజెక్టులు పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అయ్యి ఉండేది. రాయలసీమ రత్నాల సీమగా మారి సిరులు పండేవి. కాని నేడు రాయలసీమ మళ్లీ రాళ్ల సీమగా మారడంతో మునుపెన్నడూ లేని వలసలు పెరిగాయి. నిరుద్యోగులు సైతం ఉద్యోగాలు లేకపోవడంతో రైతు కూలీలతో పాటు వలసలకు వెళుతున్నారు.

గడిచిన 58 నెలల్లో రాయలసీమకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన మేలు చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటీ లేదు. 'జగన్ రాయలసీమ బిడ్డ, మాట తప్పడు, మడమ తిప్పడు, మాటిచ్చాడంటే చేస్తాడంతే' అనుకుంటూ రాయలసీమ ప్రజలు ఆయనను నెత్తిన పెట్టుకొని మరీ సీఎం సీటులో కూర్చోబెట్టారు. ఇక అప్పటి నుంచి మొదలైంది! సీమ ప్రజల 'మన బిడ్డ' క్యాన్సర్ గడ[illegible]రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. సరిగ్గా ఐదేళ్ళు తిరిగే సరికి రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి పోయింది. పరిశ్రమలు లేవు, నాణ్యమైన విద్య లేదు, యువతకు ఉద్యోగాలు లేవు. సంక్షేమం మాటున సంక్షోభం. అభివృద్ధి నిల్ కాని జగన్‌కు మాత్రం కమీషన్లు ఫుల్. న్యాయ రాజధాని అంటూ చిచ్చు పెట్టి ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారు.

నాడు కృష్ణాలోని మిగులు జలాలపై హక్కు కోరబోమని జగన్ రెడ్డి తండ్రి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ రాసి ఇచ్చి మన రాష్ట్రానికి బచావత్ కమిషన్ కల్పించిన హక్కుల్ని తాకట్టు పెట్టారు. నేడు కొడుకు తన చేతగానితనంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నింటినీ కేంద్రం చేతుల్లో పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులపై రూ.12,411 కోట్లు ఖర్చు చేస్తే, జగన్ రెడ్డి నాలుగేళ్లల్లో ఖర్చు చేసింది కేవలం రూ.2,011 కోట్లు మాత్రమే. అదే విధంగా గాలేరు-నగరికి గత ప్రభుత్వం రూ.2,323 కోట్లు ఖర్చు చేయగా, జగన్‌రెడ్డి ఖర్చు చేసింది రూ.795కోట్లు మాత్రమే. హంద్రీ–నీవాకు చంద్రన్న రూ.4,182 కోట్లు ఖర్చు చేయగా, జగన్ రెడ్డి ఖర్చు చేసింది రూ.515 కోట్లు మాత్రమే. ఇతర ప్రాజెక్టులది ఇదే తీరు. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ) కింద 23 ప్రాజెక్టుల కోసం రూ.33,862 కోట్లతో టెండర్లు పిలిచి ఉత్తుత్తి హడావుడి చేశారు.

కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయిస్తే రాయలసీమ నీటి వనరులకు తీవ్ర ప్రమాదంగా మారింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిసినా జగన్ మౌనంగా ఉండి రాయలసీమ ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను చంద్రబాబు ముందుకు కదిలించారు. కానీ జగన్ మాత్రం వాటిని పట్టించుకోలేదు, అటకెక్కించారు. కొన్ని ప్రాజెక్టుల పనులు చేసినా బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కర్నూలు జిల్లాలో ఆలూరు, ఆదోని నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు చంద్రబాబు ప్రభుత్వం వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 2019 జనవరిలో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. పనులు కూడా మొదలయ్యాయి. అయితే జగన్ సర్కారు రావడంతో పరిస్థితి మారిపోయింది. కాంట్రాక్టు సంస్థ రూ.90 కోట్లు ఖర్చు చేసింది. ప్రభుత్వం పైసా కూడా బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

అనంతపురం జిల్లా మనవడిగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తా అని జగన్ హామీ ఇచ్చారు. సత్యసాయి జిల్లాలో జగన్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకూ అతీగతీ లేదు. కొత్తగా ఒక్క ఎకరా కూడా సాగులోకి రాలేదు. టీడీపీ ప్రభుత్వంలో కుప్పం బ్రాంచి కెనాల్ పనులు రూ.475కోట్లతో 80 శాతం పూర్తయ్యాయి. జగన్ వచ్చాక పైసా కూడా ఇవ్వలేదు. దాంతో పనులు ఆగిపోయాయి. పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణను రూ.1,219.93 కోట్లతో చేపట్టనున్నట్టు ఆర్భాటం చేశారు. గతేడాది టెండర్లు ఖరారు చేసినా నిధులు ఇవ్వకపోవడంతో పనులు మొదలు కాలేదు. గత ప్రభుత్వంలో శ్రీకారం చుట్టిన ఆర్టీఎస్ కుడి కాలువ, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులు.. జగన్ రాగానే ఆగిపోయాయి.

హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్–1 కింద మిగిలిన పనులను రెండేళ్లలో పూర్తి చేస్తానన్న హామీని జగన్ విస్మరించారు. నంద్యాల జిల్లాలో బిల్లులు రాక పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అనంతపురం జిల్లా రైతాంగానికి జీవనాధారమైన హంద్రీనీవా ప్రాజెక్టు చేపట్టాలని మూడు దశాబ్దాల క్రితం ఎన్టీఆర్ హయాంలో నిర్ణయించారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ఫేజ్–1, ఫేజ్–2కు కలిపి రూ.13,635 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. నాలుగేళ్ల క్రితం వరకూ రూ.11,535 కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో దాదాపు రరూ.4,182 కోట్లు ఖర్చు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో కేవలం ప్రాజెక్టు నిర్వహణ ఖర్చులకే నిధులు విదిల్చారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి జగన్‌రెడ్డికి చేతులు రావడం లేదు.

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జలవనరుల ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడాన్ని చూసి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు తట్టుకోలేపోయారు. అందుకే గత ఏడాది ఆగస్టు నెలలో పెన్నా టు వంశధార వరకు తెలుగు తల్లి జలహారం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల్లో పని తీరును ప్రజలకు తెలియజేశారు. కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు యాత్ర సాగించారు. కీలక ప్రాజెక్టుల్లో నత్తనడకన సాగిన పనిని, జరిగిన అవినీతిని బయటపెట్టారు. రాష్ట్ర రూపాన్ని మార్చే నదుల అనుసంధానం ప్రక్రియకు జగన్ ప్రభుత్వం చేసిన నష్టాన్ని ప్రజలు తెలియజేశారు. అంతేకాకుండా మేధావులు, జలవనరుల నిపుణులు సైతం చెప్పలేని విధంగా జలవనరుల ప్రాజెక్టుల విధ్వంసం పేరుతో ప్రజంటేషన్ ఇచ్చి మరీ వివరించారు. ఈ కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక బలప్రదర్శనకు దిగారు. చిత్తూరు జిల్లా అంగళ్ల దగ్గర చంద్రబాబుపై రాళ్లు విసిరారు, టీడీపీ కార్యకర్తలను రక్తమోడినట్లు కొట్టి తిరిగి చంద్రబాబుపై అక్రమ కేసు నమోదు చేశారు. అయితే చివరికి న్యాయమే గెలిచింది.



చంద్రబాబుకు జలవనరుల మీద ఉన్న పట్టు, మక్కువ ఈ సంఘటనతో చెప్పవచ్చు. బహుశా అందుకేనేమో గత ఐదేళ్లల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రూ.68వేల కోట్లు ఖర్చు చేసి 62 ప్రాజెక్టులను చేపట్టి 23 ప్రాజెక్టులను పూర్తి చేసి, 32.02 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాలకు నూతన ఆయకట్టు అందించారు చంద్రబాబు నాయుడు. కాని జగన్ రూ.22,165.46 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసి కాంట్రాక్టర్లను మార్చి కమీషన్లు దండుకుంటున్నారు. ఆఖరికి కమీషన్ల కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టును సైతం ప్రశ్నార్థకం చేశారు. 15 నెలల పాటు పనులు చేయకపోవడంతో డయాఫ్రంవాల్ దెబ్బతిందని సాక్షాత్తు నీతి ఆయోగ్ నియమించిన ఐఐటీ హైదరాబాద్ స్పష్టం చేసింది. అదే 2019లో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి పోలవరంతో పాటు మిగిలిన 40 ప్రాజెక్టులు పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అయ్యి ఉండేది. రాయలసీమ రత్నాల సీమగా మారి సిరులు పండేవి. కాని నేడు రాయలసీమ మళ్లీ రాళ్ల సీమగా మారడంతో మునుపెన్నడూ లేని వలసలు పెరిగాయి. నిరుద్యోగులు సైతం ఉద్యోగాలు లేకపోవడంతో రైతు కూలీలతో పాటు వలసలకు వెళుతున్నారు. రాయలసీమను ఏటికేడు అభివృద్ధి పథంలో నడిపించాల్సిన జగన్ అధోగతి పాలు చేశారు. అందుకే జగన్ ఓడిపోయే మొట్టమొదటి సీటు రాయలసీమ నుంచే ప్రారంభం అవ్వక తప్పదు. ఆయనకు రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలందరూ సిద్ధం.

● బి.సి. జనార్దన్ రెడ్డి
బనగానపల్లె మాజీ శాసనసభ్యులు



బందరు పోర్టుకు ఇక వి ుగిలింది శిలాఫలకమే..



పేరుకు రాజధాని జిల్లా.. పైసా విదిల్చింది లేదు.. కనీస చెల్లింపులు లేవు.. రాజధాని జిల్లాలపై ఆది నుంచి సవతి ప్రేమ చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చిట్ట చివరి బడ్జెట్‌లోనూ అదే పంథా కొనసాగించింది. కీలకమైన అంశాల ప్రస్తావనే లేకుండా, అమరావతి అభివృద్ధి అంశమే రాకుండా ఈ బడ్జెట్ సమావేశాన్ని ముగించింది.

చిట్టా చివరన..

విదిల్చిందేం లేదు




- రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రెండు జిల్లాలకు రిక్తహస్తం
- కీలకమైన బందరు పోర్టు ప్రస్తావనే లేదు
- గన్నవరం విమానాశ్రయ నిర్వాసితుల ఊసే మరిచారు
- ఇక అమరావతి సంగతి సరేసరి..!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని ప్రధాన అంశాల ప్రస్తావన లేకుండానే ముగించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం హడావుడిగా మొదలుపెట్టిన బందరు పోర్టు ప్రస్తావన కానీ, కొన్నేళ్లుగా నలుగుతున్న గన్నవరం విమానాశ్రయ నిర్వాసితులకు పునరావాసాన్ని కల్పించే విషయంలో కానీ ఎలాంటి ఊసూ లేదు. ఓట్ ఆన్ బడ్జెట్ కావడంతో కేవలం సంక్షేమానికి సంబంధించిన కేటాయింపులపై మాత్రమే దృష్టిపెట్టి మిగిలిన అంశాలను ఎన్నికల అనంతరం వచ్చే ప్రభుత్వమే చూసుకుంటుందన్న తరహాలో ముగించేశారు.

- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బందరు పోర్టు పనులను హడావుడిగా ప్రారంభించారు. అయితే, గత బడ్జెట్‌లో కానీ, తాజా బడ్జెట్‌లో కానీ పైసా విదిల్చింది లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన 2020-21 బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. 2021-22, 2022-23 బడ్జెట్‌లో రూ.150 కోట్లు చొప్పున కేటాయించారు. కానీ, అందులో పైసా నిధులు ఖర్చు పెట్టలేదు. 2023-24 బడ్జెట్‌లో మళ్లీ రూ.150 కోట్లు కేటాయించారు. ఈ మొత్తం భూసేకరణకే సరిపోలేదు. ఈ నిధులతోనే ప్రస్తుతం పోర్టు పనులను చేస్తున్నారు.
- విజయవాడ విమానాశ్రయ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పించే విషయంలో ప్రభుత్వం అత్తెసరు కేటాయింపులు జరిపింది. 2022-23 బడ్జెట్‌లో కేవలం రూ.22.76 కోట్లను మాత్రమే కేటాయించింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అపహాస్యం పాలుచేసేలా ఈ కేటాయింపులు ఉన్నాయని అప్పట్లో టీడీపీ సహా అన్ని రాజకీయపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈసారి ఓటాన్ కావడంతో దీని ప్రస్తావన కూడా బడ్జెట్‌లో చేయలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో అమరావతికి అసలెప్పుడూ పైసా విదిల్చింది లేదు.

ఆఖరి బడ్జెట్ కూడా బోగస్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆఖరి బడ్జెట్ కూడా బోగస్. అభివృద్ధి పనులకు మోక్షం కలగలేదు. కొత్త పనుల మంజూరు దేవుడెరుగు. పాత అభివృద్ధి పనులైన పూర్తి చేయలేని దుస్థితి. బటన్ నొక్కి ఇచ్చేది అరకొర. వందలో 25 మందికి కూడా పథకాలు అందని పరిస్థితి. లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకొచ్చిన అప్పులు చూపించలేదు.

- బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే

వ్యాపారులకు భారమే..



వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ వ్యాపారులకు భారంగా ఉంది. కేవలం ఎన్నికల కోసమే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనివల్ల వ్యాపారులకు నష్టమే కానీ, లాభమేమీ లేదు.

- కొణిజేటి రమేశ్, ఏపీ ట్రేడర్స్ జేఏసీ అధ్యక్షుడు

నగరానికి చెందిన ప్రభావతి... ఓ ప్రముఖ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసుకున్న పొదుపును బ్యాంకు అకౌంట్లో ఉంచుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఆమెకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ముంబయి నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. కరెంట్ బిల్లు ఇప్పటి వరకు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని గట్టిగా మాట్లాడాడు. ఇదంతా ఆమె నిజమే అనుకున్నారు. ఒక లింక్‌ను పంపుతానని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్పాలని చెప్పాడు. ఆమె లింక్‌పై క్లిక్ చేయగానే ఒక యాప్ డౌన్‌లోడ్ అయింది. అతడు చెప్పినట్టుగానే ఓటీపీ వివరాలు ప్రభావతి ఇచ్చేశారు. అంతటితో తన పని అయిపోయిందనుకున్నారు. తర్వాత కొన్నిరోజులకు దఫదఫాలుగా ఆమె అకౌంట్ నుంచి రూ.7 లక్షలు మాయమయ్యాయి. దీంతో ఆమె లబోదిబోమంటూ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.



ఈ ఒక్క ఘటనే కాదు.. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు చాలానే వెలుగులోకి వస్తున్నాయి. టీం వ్యూవర్, ఫాస్ట్ షేర్ ట్రాన్స్‌ఫర్, షేర్‌మీ, ఫైల్ షేరింగ్, ఈజీ షేర్ వంటి యాప్‌లను ఆసరాగా చేసుకుని ఈ సైబర్ నేరాలు జరుగుతున్నాయి.

దొంగ లింకులు

లింక్ పంపి నగదు దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు

- మొబైల్ మనదే.. ఆపరేషన్ మాత్రం దొంగల చేతిలో..
- వివిధ యాప్‌ల ద్వారా నయా దోపిడీ
- నగరంలో పెరుగుతున్న కేసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : టీం వ్యూవర్, ఫాస్ట్ షేర్ ట్రాన్స్‌ఫర్, షేర్‌మీ, ఫైల్ షేరింగ్, ఈజీ షేర్.. ఇవన్నీ నెట్‌వర్క్‌కు సంబంధించిన యాప్స్. ఒక కంప్యూటర్ నుంచి మరో కంప్యూటర్‌లో ఉన్న ఫైళ్లను తీసుకోవడానికి ఉపయోగించే నెట్‌వర్క్. సాంకేతికంగా పనిని సులభతరం చేసుకోవడానికి అందుబాటులోకి వచ్చిన ఈ యాప్‌లను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్లేస్టోర్‌లోకి నేరాలకు సులభంగా ఉపయోగపడే యాప్‌లను వదులుతున్నారు. వాటికి లింక్‌లను రూపొందించి ఆండ్రాయిడ్ వినియోగదారులకు పంపుతున్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత ఫోన్ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. దఫదఫాలుగా బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును మాయం చేస్తున్నారు.

బిల్లులు చెల్లించాలని ఫోన్లు చేసి

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, యూపీఐ యాప్‌లు అందుబాటులోకి వచ్చాక బిల్లుల చెల్లింపు సులభంగా మారింది. విద్యుత్ బిల్లు, ఇంటి అద్దె, ఎల్ఐసీ ప్రీమియం, వాహనాల బీమా వంటి వాటిని ఈ యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత సైబర్ నేరగాళ్ల పంథా కొత్త పరుగులు తీస్తోంది. వినియోగదారులు వేసే అడుగులకు అనుగుణంగా నేరాల తీరును తిప్పుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి విద్యుత్ బిల్లు చెల్లించాలని, క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు ఫోన్లు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్‌కాల్స్‌పై అవగాహన ఉన్న వారు మాత్రం వాటిని వెంటనే కట్ చేస్తున్నారు. అవగాహన లేనివారు మాత్రం ఈ నేరగాళ్ల వలలో చిక్కుకుపోతున్నారు. ఫోన్లు చేశాక అధికారుల మాదిరిగా మాట్లాడుతున్నారు. నిజంగా బిల్లులు చెల్లించలేదన్న భావనలోకి వినియోగదారులు వెళ్లిపోతున్నారు. తాము ఒక లింక్ పంపుతామని దాన్ని ఓపెన్ చేసి, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్తే బిల్లు చెల్లింపు పూర్తవుతుందని చెబుతున్నారు. ఇలా టీం వ్యూవర్, ఓపెన్ లింక్ వంటి లింక్‌లను పంపుతున్నారు. వాటిని వినియోగదారులు ఓపెన్ చేయగానే, యాప్ డౌన్‌లోడ్ అవుతోంది. ఓటీపీని సైబర్ నేరగాళ్లకు చెప్పడంతో ఫోన్ వినియోగదారుల చేతుల్లో ఉన్నా ఆపరేషన్ మాత్రం నేరగాళ్లు చేస్తున్నారు. ఈవిధంగా ముంబయి నుంచి ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు ఓ బ్యాంకు మాజీ మేనేజర్ అకౌంట్లో నుంచి రూ.7 లక్షలను దఫదఫాలుగా లాక్కున్నారు.

గేమ్స్ ద్వారా..

ఫోన్లు చేయడం ద్వారా లింక్‌లు పంపి మోసాలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు గేమ్స్ ద్వారా అదే వ్యవహారాలను నడుపుతున్నారు. ప్లేస్టోర్‌లో లక్షల కొద్దీ గేమ్స్‌కు సంబంధించిన యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటర్ సార్ట్ పజిల్, బాల్ సార్ట్ పజిల్, బ్లాక్ పజిల్, గార్డెన్‌స్కేప్స్, ట్విస్టెడ్ ట్యాంగిల్, 2048 మెర్జ్, ట్యాప్ మాస్టర్ 3డీ వంటి గేమ్స్ యాప్‌లను ఆండ్రాయిడ్ వినియోగదారులు తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. కాలక్షేపం కోసం ఈ ఆటలను ఆడుతుంటారు. ఈ ఆటల్లో వివిధ స్టేజ్‌లు ఉంటాయి. ఒక స్టేజ్ పూర్తవ్వగానే రివార్డులకు సంబంధించిన ప్రకటనలు వస్తుంటాయి. రివార్డులుగా రూ.8 వేలు, రూ.4 వేలు ఇస్తున్నట్టు ప్రకటనల్లో కనిపిస్తుంది. దానికి కింది భాగంలో విత్‌డ్రా నౌ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేయగానే, ఒక లింక్ ఫోన్‌లో డౌన్‌లోడ్ అవుతుంది. దాన్ని ఓపెన్ చేయగానే ఒక యాప్‌ను కనిపిస్తుంది. ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆప్షన్ కనిపిస్తుంది. ఇలా రిజిస్టర్ అయ్యాక ఫోన్ ఈ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. సైబర్ నేరాల్లో ఈ మోసాలు ట్రెండింగ్ అవుతున్నాయని సైబర్ నేరాల దర్యాప్తు అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- 6లో..

కూలి పనులకు వెళ్తుండగా లారీ ఢీ

- విస్సన్నపేటలో దారుణం





మృతులు మల్లికార్జునరావు, విజయబాబు (ఫైల్)

అహో సుయోధనా..



అభిమానధనుడైన దుర్యోధనుడి అంతరంగాన్ని కళ్లకు కట్టేనట్టు చూపించారు శ్రీఇడగుమ్‌జీ మహాగణపతి యక్షగాన మండలి బృంద సభ్యులు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతున్న అంతర్జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం 'గదాయుద్ధ' యక్షగానం అద్భుతంగా సాగగా, కర్ణాటకకు చెందిన కళాకారుల అభినయం రసజ్ఞులను మైమరపించింది.

- రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఓ కుటుంబం పెళ్లిరోజు కావడంతో భవానీపురంలో ఉన్న ఓ రెస్టారెంట్‌కు వెళ్లింది. రెండు రకాల డిష్‌లను ఆర్డర్ ఇచ్చింది. ఫ్రై ఐటమ్స్ చూడడానికి ఎర్రగా కనిపించాయి. వాటిలో మసాలా కాకుండా రంగులు వేసినట్టు అనుమానించారు. దీనిపై వారు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.
- ఓ అధికారి కొద్దిరోజుల క్రితం నగరంలోని ఒక ప్రముఖ రెస్టారెంట్‌కు వెళ్లారు. పిల్లలు వారికి నచ్చిన డిష్‌లను ఆర్డర్ చేశారు. ఈ డిష్‌లు కొంత అపరిశుభ్రంగా ఉన్నట్టు పిల్లలు గుర్తించి తండ్రికి చెప్పారు. ఆయన వెయిటర్ వెంట వెళ్లగా, వంటశాలంతా అపరిశుభ్రంగా కనిపించింది. ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై మూతలు లేవు. దీంతో ఆయన అక్కడి నుంచి పిల్లలను తీసుకుని బయటకు వచ్చేశారు.
- అయ్యప్పదీక్షలో ఉన్న నలుగురు వ్యక్తులు ఏలూరులాకుల వద్ద తోపుడు బండిపై ఉదయం 6 గంటలకు ఇడ్లీ తీసుకున్నారు. అందులో వేసిన చట్నీ చల్లగా ఉంది. ఫ్రిజ్‌లో నుంచి తీశారని వారు గుర్తించారు. ఇడ్లీ వేడిగా ఉన్నా చట్నీ మాత్రం చాలా పుల్లగా అనిపించింది. ముందురోజు మిగిలిపోయిన చట్నీని ఫ్రిజ్‌లో పెట్టి మర్నాడు టిఫిన్‌లో వేస్తున్నారని తేలింది. వారు గట్టిగా గొడవ చేసే సరికి ఆరోజు తయారు చేసిన చట్నీ వేశారు.

..ఆహార పదార్థాలకు, వెరైటీ డిష్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న విజయవాడలో ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తోపుడుబండ్లపై విక్రయించే ఆహారం దగ్గర నుంచి హోటళ్లలో సరఫరా చేసే ఆహారం వరకు వినియోగదారుల్లో అనేక అనుమానాలు, సందేహాలు పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ నిజమేనని ఇటీవల విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తేలింది. తాజా ఆహారమే అని చెప్పి.. సర్వర్లు టేబుళ్ల మీదకు తీసుకొస్తున్న డిష్‌ల్లో తేడాలు ఉంటున్నాయి. తాజాదనం లోపించి కల్తీ కనిపిస్తోంది. ఏ హోటల్‌లో అసలు సిసలైన ఆహారం లభిస్తుందో తెలుసుకోలేని పరిస్థితి నగరంలో దాపురించింది.

వంటబట్టని నూనె



- ఒకటికి నాలుగుసార్లు మరిగించిన నూనె వాడకం
- 25 శాతం మించకూడని టీపీసీ కంటెంట్ 75 శాతానికి..
- ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా విచ్చలవిడితనం
- వంటశాలల్లో అపరిశుభ్ర వాతావరణం
- మాంసాహారానికి రంగులు.. విజిలెన్స్ తనిఖీల్లో నిజాలు

నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్లలో కల్తీ నూనె

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బిర్యానీ, చికెన్ కర్రీ, మటన్ కర్రీ, చేప ఫ్రై, చికెన్ మంచూరియా, ఎగ్ మంచూరియా... ఇవన్నీ నాన్ వెజిటేరియన్ డిష్‌లు. వారాంతంలో నగరవాసులు ఏదో ఒక రెస్టారెంట్‌కు కుటుంబ సమేతంగా వెళ్లి పార్టీలు చేసుకుంటూ ఆర్డర్ ఇచ్చే వంటకాలు. పుట్టిన రోజులు, పెళ్లి రోజుల సమయంలో స్నేహితులకు విందులు ఇస్తున్నారు. ఏ సందర్భంలో రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్లినా నాన్‌వెజ్ డిష్‌లను ఆర్డర్ చేస్తున్నారు. వాటి తయారీలో ఉపయోగించే వంటనూనెలో అనేక వ్యత్యాసాలు ఉంటున్నాయని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. పలు రెస్టారెంట్లను పరిశీలిస్తే ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్న నూనెలో పోలార్ కంటెంట్లు 25 శాతానికి మించి ఉంటున్నాయని తేలింది. వంటనూనెలో అనేక రకాల అణువులు ఉంటాయి. ఒక లీటరు నూనెను రెండు, మూడుసార్లు కంటే ఎక్కువగా మరిగించకూడదు. దీనికి మించి నూనెను మరిగిస్తే అందులో ఉండే టోటల్ పోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) ఫ్రీ రాడికల్స్‌గా మారతాయని ఫుడ్‌సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. అధికారులు టీపీసీ మీటర్‌తో నూనెను పరిశీలించినప్పుడు నూనెలో 25 శాతం మించి ఉండకూడదు. పలు హోటళ్లలో ఈ టీపీసీ 50 నుంచి 75 శాతం చూపించింది. ఈ నూనె అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఆహార పదార్థాల తయారీలో ఇలాంటి నూనెలు ఉపయోగించడం వల్లే కేన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. కొన్నిచోట్ల నూనె బాగా మరగబెట్టాక అడుగున ఉన్న మడ్డిను తీసి పారేస్తున్నారు. తిరిగి అదే నూనెలో కొత్త నూనెను కలుపుతున్నారు. ఫుడ్‌కోర్టుల దగ్గర నుంచి రెస్టారెంట్లు, హోటళ్ల వరకు ఇదే తంతు కొనసాగుతోంది. కిచెన్లలో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. మాంసాహారాల్లో రంగులు విపరీతంగా పూస్తున్నారని గుర్తించారు.

గుర్తొస్తేనే దాడులు

హోటళ్లు, రెస్టారెంట్లలో నిబంధనలు పాటించకపోవడం వెనుక ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఉదాసీనతే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతోనే రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారని ఆహారప్రియులు మండిపడుతున్నారు.

హడావుడిగా..

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- 279 టీచర్ పోస్టుల భర్తీకి మినీ డీఎస్సీ నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ హడావుడిగా నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులను మోసం చేయడానికే అనే విమర్శలు వస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదల చేసినా పోస్టుల భర్తీ ఇప్పట్లో జరిగే అవకాశం ఉండదని డీఈడీ, బీఈడీ చదివిన నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 103, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 111, టీజీటీ పోస్టులు 65 మొత్తంగా 279 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ప్రతిపాదనలు వెళ్లకుండానే..

ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 730 మందికి పైగా మిగులుబాటుగా ఉన్నట్లు గతంలో లెక్కలు చూపారు. ఎస్‌జీటీ పోస్టుల భర్తీ చేయాల్సిన అవసరం లేదని నివేదికను ప్రభుత్వానికి పంపారు. కానీ, బుధవారం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ పోస్టులు 103 భర్తీ చేస్తామని ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 4న జరిగిన సమావేశ ప్రతిపాదనల ప్రకారం 107 పోస్టు లను భర్తీ చేయాలని కోరారు. తాజా నోటిఫికేషన్‌లో ఈ సంఖ్యను 111గా చూపారు. వీటితో పాటు ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) పోస్టులను మరో 65 అదనంగా చూపారు. ఈ పోస్టులు అసలు జిల్లాలో ఖాళీగా ఉన్నాయా, లేదా అనే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం జిల్లాలోని సుమారు 70వేల మంది డీఈడీ, బీఈడీ అభ్యర్థులను మాయ చేయడమేననే వాదన వినిపిస్తోంది. ఎస్‌జీటీ పోస్టులకు డీఎడ్ చదివినవారు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఈడీ చదివినవారే పరీక్ష రాయాలనే నిబంధన పెట్టారని అంటున్నారు.

ఉద్యమ ఉద్యుక్తులై..

మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా మెగా డీఎస్సీని విడుదల చేయకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» కలెక్టర్ ఢిల్లీరావు

- 6లో..



ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయని, అదేవిధంగా జనరల్, వొకేషనల్ గ్రూపులకు సంబంధించి థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 99 కేంద్రాల్లో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్టు తెలిపారు. 40082 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 35494 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. పరీక్షలకు హాజరుకానున్నట్టు వివరించారు. పరీక్షల నిర్వహణకు 99 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది కస్టోడియన్ అధికారులను నియమించడం జరిగిందని, 18 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. బందోబస్తు, భద్రతా చర్యలు, సీసీ కెమేరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని, హాల్‌టికెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చూడాలని సూచించారు. వేసవిని దృష్టిలో వుంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డాక్టర్ ఆర్.బాలాజీ నాయక్, ఏపీఎస్ ఆర్టీసీ ప్రతినిధి ఎంవై దానం, ఏఎస్పీవో ఎం.సత్యనారాయణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితాలో బదిలీలు

» 671 దరఖాస్తుల స్వీకరణ.. : కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : ఓటర్ల జాబితాలో బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఫారం-8 కింద ఇప్పటివరకు 6257 దరఖాస్తులు స్వీకరించగా, ఇందులో 5583 దరఖాస్తులు పేర్ల సవరణకు సంబంధించినవని, మిగిలిన 671 దరఖాస్తుల్లో 482 ప్రస్తుతం ఓటు వున్న నియోజకవర్గంలోనే అంతర్గత చిరునామా మార్పులకు సంబంధించినవని, మిగిలిన 180 ఇతర నియోజకవర్గాలకు బదిలీ కోరిన దరఖాస్తులు ఉన్నాయని, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 45 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి బదిలీలకు అనుమతించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల నమోదు, జాబితాల సవరణలపై బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకొంటున్నాయని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పార్టీల ప్రతినిధులకు వివరించారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలను పరిశీలించి వాటిలో వాస్తవాలను పరిశీలించి ఎలాంటి పొరపాట్లు దొర్లినా వాటిని సవరించేలా సంబంధిత అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కేడీసీసీబీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

వ్యవసాయ, అనుబంధ రంగాలకు

విరివిగా రుణాలివ్వండి

» కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందజేసేందుకు బ్యాంకు అధికారులు ముందుకు రావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టర్ చాంబరులో జిల్లా కేంద్రసహకార బ్యాంకు, జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి, చెరకు, పత్తి, వేరుశెనగ, మత్స్యసంపద ఉత్పత్తులకు సంబంధించి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పాదకతను పెంచేందుకు పంటరుణాలు అందజేయాలన్నారు. ఎకరం భూమిలో వరి పండించడానికి రూ.42వేల ఖర్చు అవుతోందని అందుకు అనుగుణంగా వరిసాగుకు పంటరుణాన్ని ఎకరానికి రూ.50వేలకు పెంచాలని సూచించారు. వరితోపాటు చెరకు పంటకు రుణం మొత్తాన్ని పెంచేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కౌలు రైతులకు పంటరుణాలు అందించే విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. చేపల చెరువులకు రుణపరిమితిని పెంచేందుకు అవసరమైన నివేదికలను మత్స్యశాఖ అధికారులు తయారుచేసి బ్యాంకు అధికారులకు ఇవ్వాలన్నారు. సమావేశంలో కేడీసీసీబీ సీఈవో ఎ శ్యామ్‌మనోహర్, జీఎం బీఎల్ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ జేడీ ఎన్ పద్మావతి, ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

విస్సన్నపేట, ఫిబ్రవరి 7: విస్సన్నపేట పట్టణం నూజివీడు రోడ్డులో రాణి సెల బ్రేషన్స్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీ కొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కొండపర్వకు చెందిన కోలా మల్లికార్జున్ (25), మానికల విజయ్‌బాబు (23)లు స్నేహితులు. వీరు పొలాలకు వేసే ఫెన్సింగ్ పనులకు వెళుతుంటారు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి మోటార్ బైక్‌పై విస్సన్నపేట నుంచి స్వగ్రామం కొండపర్వకు వెళుతుండగా గుడివాడ నుంచి చేపల లోడుతో ఢిల్లీ వెళుతున్న లారీ వారి బైక్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై జి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాల్ మృతుల కుటుంబాలను పరామర్శించారు.



ప్రమాదానికి కారణమైన లారీ

మృత్యువులోను వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన యువకులు మృతి చెందడంతో ఆకుటుంబాల్లో విషాదచాయలు అలముకున్నాయి. ఎంతో స్నేహంగా మెలిగే వారిద్దరు అవివాహితులు మల్లికార్జునరావు తండ్రి చిరు వ్యాపారి కాగా విజయబాబు తండ్రి లారీ డ్రైవర్. రెండు కుటుంబాల్లోను మగ సంతానం ఒక్కరే కావడం, కుటుంబాలను ఆదుకుంటారనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో వారిని దూరం చేయడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

గన్నవరంలో ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

గన్నవరం: ఏలూరు వైపు నుంచి విజయవాడ ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. చిన అవుటపల్లి సమీపంలోని వేబ్రిడ్జి దగ్గర బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొనడంతో జాతీయ రహదారిపై పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరిలో ఒకరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. మరొకరికి ఎడమ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. ఇద్దరు వెల్డింగ్ పని మీద వెళ్లి వస్తున్నట్టు వారి వద్ద వెల్డింగ్ మిషన్ రాడ్లు ఉన్నాయి. ప్రమాదానికి ట్రాక్టర్ డ్రైవర్ కారణమని చెబుతున్నారు. సంఘటన స్థలం వద్ద ట్రాక్టర్ లేదు. సంఘటన స్థలానికి ఆత్కూరు పోలీసులు వచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీసీల సత్తా చాటుదాం

» పెత్తందారి జగన్‌ను తరిమికొడదాం

» మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 : బీసీలు ఏకతాటిపై నిలబడి అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుదామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర పార్టీశ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మచిలీపట్నం బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, బీసీలు గళం ఎత్తితే తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌కు దడపుడుతోందన్నారు. దీంతో బీసీ నాయకులను అరెస్టులు చేస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. రాష్ట్రంలో 962 జయహో బీసీ సదస్సులు నిర్వహిద్దామనుకున్నామని, ఇప్పటికి 800 పూర్తయ్యాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా ఉంటారన్నారు. చంద్రబాబును ఏ జైలులో పెట్టించారో అదే జైలులోని బ్లాకులో జగన్‌రెడ్డికి చిప్పకూడు తినే యోగం పడుతుందన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని చంద్రబాబు తీసుకువస్తారన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని చంద్రబాబును ఇష్టారాజ్యంగా విమర్శిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీలు వేధింపులకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు గోకుల శివ, బీసీ సూర్యబలిజ రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న రవీంద్ర

భూ హక్కు చట్టం రద్దు చేయకపోతే

జగన్‌రెడ్డికి పుట్టగతులుండవు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 : వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేసేంతవరకు న్యాయవాదులకు మద్దతుగా టీడీపీ తరపున ఉద్యమిస్తామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమ్మెకు బుధవారం రవీంద్ర మద్దతు తెలిపారు. న్యాయవాదుల నిరసన ప్రదర్శనలో కొల్లు రవీంద్ర ప్లకార్డు పట్టుకుని సంఘీభావం తెలిపారు. నూతన చట్టం చీకటి చట్టమని, సివిల్‌కోర్టు పరిధిని తగ్గిస్తూ ప్రజల భూ యాజమాన్యాన్ని నిర్ణయించే హక్కు ప్రభుత్వంచే నియమించిన అధికారికి కట్టబెట్టడం అన్యాయమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే భూ హక్కు చట్టాన్ని రద్దుచేస్తామన్నారు. పుట్టిన తేదీ ధృవపత్రాలపైనా సీఎం జగన్‌రెడ్డి ఫోటో వేసుకోవడం దురదృష్టకరమన్నారు. మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు మాట్లాడుతూ, 16వ తేదీ వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి కొట్టె రఘురాం, జీవీఎల్ నరసింహారావు, లంకే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మారే సంస్కృతి వసంతది

» నియోజకవర్గ టీడీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మైలవరం, ఫిబ్రవరి 7: తరచూ పార్టీలు మారే సంస్కృతి వసంత కుటుంబానిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జువ్వా రామకృష్ణ ఆరోపించారు. వసంత టీడీపీలోకి వస్తారనే విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అమరావతి రాజధాని వెళ్లిపోతే రాజీనామా చేస్తానన్న వ్యక్తి ఏం చేశాడని ప్రశ్నించారు. తాడేపల్లి, కొండపల్లి, జక్కంపూడి కొండలు మింగేశాడన్నందుకు 100 మంది వైసీపీ అల్లరి మూకలను తెచ్చి భయభ్రాంతులకు గురిచేసి టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టాడన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వజ్రాల కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వసంత టీడీపీ నేతలపై 3 నుంచి 10 వరకు కేసులు పెట్టించి ఏ కేసులు పెట్టించలేదని మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఇంత వరకు పరిశీలన చేలేదన్నారు. టీడీపీలో ఆయన డబ్బుకు ఎవ్వరూ లొంగరన్నారు. అటువంటి వ్యక్తిని మా బుజాలపై ఎక్కి స్వారీ చేయిస్తామంటే ఎలా భరిస్తామన్నారు. సమావేశంలో ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), కోమటి సుధాకరరావు, వజ్రాల కుమార్ రెడ్డి, ఉయ్యూరు వెంకట నరసింహారావు, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

» బైక్‌పై వచ్చి ఆగంతకుడి దాడి

» పరిస్థితి విషమం, విజయవాడ తరలింపు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7: పట్టణంలో విల్క్ పార్లర్ నిర్వహిస్తున్న వివాహితపై సీతారాంపురంలో బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు హత్యాయత్నం చేయటం సంచలనం కలిగించింది.



చికిత్స పొందుతున్న గోపిరెడ్డి సత్యశ్రీ

శివాలయం వీధిలో ప్రైవేట్ కంపెనీ పాల బూత్ నిర్వహిస్తున్న గోపిరెడ్డి సత్యశ్రీ (35) రాత్రి గం 9.ల సమయంలో బూత్‌కు తాళం వేసి మోపెడ్‌పై ఇంటికి వెళ్తుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఆగంతకుడు ఆమెపై పదునైన ఆయుధంతో దాడి చేసి పరారయ్యాడు. ఆమె కేకలు విని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విజయ వాడకు 108లో పంపారు. తొలుత స్థానికులు ఆమె మెడలో గొలుసు దొంగతనంగా బావించారు. ప్రథమచికిత్స చేసిన ఆసుపత్రి వర్గాలు ఆమె మెడపై రెండు చోట్ల, పీక వద్ద 3 చోట్ల పదునైన ఆయుధంతో దాడి చేసినట్టు ఉందని చెప్పటంతో హత్యాయత్నంగా భావిస్తున్నారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆమె భర్త విజయవాడలో ఉంటున్నాడని, ఇక్కడ కుమార్తెతో కలిసి పాల వ్యాపారం చేస్తున్నట్టు స్థానికులు చెప్పా రు. సీసీ పుటేజి ద్వారా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాబు నివాసం వద్ద.. బిస్కెట్లు పంచిన కాగిత

» పెడన సీటు తనకేనని ఆనందం.. పలువురు ఇన్‌చార్జులతో టీడీపీ అధినేత భేటీ

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ఇక్కడ తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నివాసం వద్ద బిస్కెట్లు పంచారు. అధినేత పిలుపుతో ఆయన పెద్ద సంఖ్యలో తన అనుచరులతో ఇక్కడకు తరలివచ్చారు. ఆ సీటును పొత్తులో భాగంగా జనసేన కోరుతోందనే ప్రచారంతో ఆయన అనుచర గణం ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక కాగిత ఆ సీటును జనసేనకు ఇవ్వడం లేదని, బాగా పనిచేసుకోవాలని తనకు చెప్పారని అనుచరులకు తెలియజేశారు. దీంతో వారంతా పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. వారిలో కొందరు దగ్గర్లో ఉన్న బడ్డీ కొట్టు వద్దకు వెళ్లి బిస్కెట్ ప్యాకెట్లు కొనుక్కొచ్చారు. ఆయన అక్కడ ఉన్నవారందరికీ పంచారు. ఈ పరిణామం తర్వాత మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిశారు. ఆయన పెడన సీటును ఆశిస్తున్నారు. కాగా.. కొన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులతో చంద్రబాబు బుధవారం తన నివాసంలో సమావేశమయ్యారు. వారి నియోజకవర్గాల్లో కొన్ని సమస్యలను ప్రస్తావించి పరిష్కరించుకోవాలని సూచించినట్టు సమాచారం. ఆయన్ను కలిసిన వారిలో మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఢిల్లీ వెళ్లే ముందు ఆయన అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, కళావెంకట్రావు తదితరులతో చర్చించారు. బీజేపీ పెద్దలతో జరిపే చర్చలకు సంబంధించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలి

» రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ వినతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాల్సిందిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేశ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన రవాణాశాఖ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆప్కాస్ ఏర్పాటుచేసిన తర్వాత ఆర్టీసీలో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులను అందులోకి బదిలీ చేస్తారని భావించగా.. అలా జరగలేదని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులంతా తమను ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాల్సిందిగా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆర్టీసీని బతికించేందుకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా పని చేశారని, వారికష్టాన్ని గుర్తించి ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సంస్థలో ప్రస్తుతం డ్రైవర్ల అవసరం తీవ్రంగా ఉన్నదని చెప్పారు. డ్రైవర్ల కొరత కారణంగా బయటి వారిని తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. తక్షణం నాలుగు వేలమంది డ్రైవర్ల పోస్టులను భర్తీచేస్తే సమస్య నుంచి బయట పడతామని తెలిపారు. మైలేజీ దాటిపోయిన బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు అనుమతులు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు.

పతనం దిశగా సుబాబుల్!

» రోజురోజుకూ పడిపోతున్న ధరలు

» కొనుగోళ్లకు జంకుతున్న వ్యాపారులు

» దిక్కుతోచని స్థితిలో రైతులు



కంచికచర్ల, ఫిబ్రవరి 7 : సుబాబుల్ కర్ర మార్కెట్ పతనమవుతోంది. ధర క్రమేణా దిగజారుతోంది. పక్షం రోజుల్లోనే టన్నుకు రూ. వెయ్యికి పైగా ధర పడిపోయింది. నామమాత్రంగా తప్పితే గతంలో మాదిరిగా కంపెనీలు కర్ర తీసుకోవటం లేదు. పేపరు కంపెనీలు మార్కెట్లో సంక్షోభం సృష్టించినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదని రైతులు మండిపడుతున్నారు. జనవరి మూడో వారం వరకు పేపరు కంపెనీలు సుబాబుల్ కర్రను చురుకుగా కొన్నాయి. ఆథరైజ్డ్ యార్డుల ద్వారా అమ్మిన రైతులకు నిరకంగా టన్నుకు రూ. 5,300 వంతున అందాయి. ఆర్‌సీలపై కొనే వ్యాపారులు టన్నుకు రూ. ఐదువేల వరకు ఇచ్చారు. నాలుగో వారంలో ధర రూ. ఐదువందలు తగ్గింది. యార్డుల ద్వారా రూ. 4,800 అందగా, వ్యాపారులు రూ. 4,500 వంతున ఇచ్చారు. పక్షం రోజులు కూడా గడవక ముందే మరోసారి ధర తగ్గింది. రెండు రోజుల నుంచి యార్డుల ద్వారా అమ్మిన రైతులకు రూ. 4,500 అందుతుండగా, వ్యాపారులు మాత్రం రూ. నాలుగు వేలకు మించి ఇవ్వటం లేదు. అయితే ఈ ధరకు చురుకుగా కొనుగోళ్లు జరగటం లేదు. ఈ నెల ఒకటి నుంచి ఏపీపీఎం (రాజమండ్రి) కొనుగోళ్లను సగానికి సగం తగ్గించింది. విల్లులో యంత్రాలు, ఇతర విడిపరికరాలను ఆయిలింగ్, సర్వీసు చేస్తున్నందున ఉత్పత్తి తగ్గటంతో గతంలో మాదిరిగా కర్ర కొనటంలేదని ఆథరైజ్డ్ యార్డుల ప్రతినిధులు చెపుతున్నారు. ఐటీసీ (భద్రాచలం) కూడా కొద్ది రోజులు కర్ర కొనుగోళ్లను నిలిపివేసిందని అంటున్నారు. దీనికితోడు నాణ్యత పేరుతో సన్న కర్ర తీసుకోవటం లేదు. తోటల్లోనే సన్న కర్రను పక్కన పడేస్తున్నారు. పది టన్నులకు రెండు టన్నుల వంతున సన్న కర్ర వస్తున్నదని చెపుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఆర్‌సీలపై కర్ర కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. ఈ రెండు కంపెనీలు కూడా ఆర్‌సీలు కల్గిన వ్యాపారుల నుంచి కర్ర తీసుకోవటం లేదు. కర్ర కొనేందుకు వ్యాపారులు జంకుతు దాదాపుగా కొనుగోళ్లను నిలిపివేశారు. దీనికితోడు పలువురు వ్యాపారులు టన్ను ఐదు వేల వంతున ముందుగా రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. కొంతమంది చేలల్లో కర్ర నరుకుతుండగా, ఇంకొంత మంది నరుకుడు మొదలు పెట్టలేదు. ఈ నేపథ్యంలో ధర దారుణంగా పడిపోవటంతో వ్యాపారులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు. లక్షల్లో నష్టపోవాల్సి రావటంతో లబోదిబోమంటున్నారు. కాగా ఒకవైపు నాయకులు, మరోవైపు అధికారులు ఎన్నికల వాతావరణంలో నిమగ్నమై ఉన్నారు. ఈ తరుణంలో పేపరు కంపెనీలు ధర తగ్గించాయి. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించినప్పటికీ పాలకులు లేదా అధికారుల్లో ఏమాత్రం స్పందన లేదు. మార్కెట్లో కావాలని సంక్షోభం సృష్టిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోక పోవటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వాసం పొందేందుకు

అడ్డదారులు!

» గాంధీ బ్యాంకు డైరెక్టర్లకు బెదిరింపులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చూసేందుకు కొందరు పెద్దలు అడ్డదారులు తొక్కుతున్నారని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఫిబ్రవరి 12న అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. మొత్తం 12 మంది సభ్యుల్లో ఏడుగురు అవిశ్వాస తీర్మానంపై సంతకం చేశారు. మరో సభ్యుడి మద్దతు లభిస్తే చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన కొందరు పెద్దమనుషులు ఇరుపక్షాల నడుమ రాజీ చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన డైరెక్టర్లకు బెదిరింపులు మొదలయ్యాయి. చైర్మన్ మనుషులమంటూ కొందరు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారని డైరెక్టర్లు కె.నాగేశ్వరరావు, టి.సుబ్బారావు ఆరోపించారు. చైర్మన్ తీరు తొలి నుంచీ వివాదాస్పదంగానే ఉంటోందని, అడ్డదారిలో చైర్మన్ పదవిలో కూర్చుని, దాన్ని కాపాడుకునేందుకు బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుత చైర్మన్ బాబాయి చిట్టియ్య చైర్మన్‌గా తన తర్వాత కోగంటి వెంకటరామయ్యను పదవిలో కూర్చోబెట్టాలని భావించారని, కానీ బాబాయిను తప్పుదారి పట్టించి ఈయన చైర్మన్ పదవి దక్కించుకున్నారని వారు విమర్శించారు. బ్యాంకుతో సంబంధం లేని రిటైర్డ్ సహకార ఉద్యోగులు బ్యాంకు కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని చైర్మన్ అక్రమాలకు సహకరిస్తున్నారని వీటికి చెక్ పెట్టేందుకే తాము అవిశ్వాసం ప్రతిపాదించామన్నారు.

గతంలో బ్యాంకు సర్వసభ్య సమావేశంలో సభ్యుడు ఒకరు తనను ప్రశ్నించారని ఏకంగా మైకును అతనిపైకి విసిరారని, చైర్మన్‌పై క్రిమినల్ కేసులు కూడా న్యాయస్థానాల్లో నడుస్తున్నాయని అలాంటి వ్యక్తి చైర్మన్ పదవిలో ఉండటానికి అనర్హుడని వారు వ్యాఖ్యానించారు.



ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

బీజేపీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ఓడిద్దాం


» 16న దేశవ్యాప్త నిరసనలో పాల్గొనండి

» మెడికల్ రిప్స్‌కు సీఐటీయూ నేతల పిలుపు

» ప్రారంభమైన మెడికల్ రిప్స్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఓడించాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గవర్నరుపేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనియన్ జాతీయ అధ్యక్షులు రమేష్ సుందర్ పతాకావిష్కరణ చేశారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ పూర్ణానంద్ ఆహ్వానసంఘం తరపున సమావేశాలకు స్వాగతం పలికారు. సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కరుమల యస్ సమావేశాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్‌కోడ్‌లు తెచ్చిందని తెలిపారు. ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు అప్పజెబుతున్నదని వివరించారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారికి ఇబ్బందులు పెడుతున్నదని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. ఉపాధి కోల్పోయి నిరుద్యోగం పెరిగిందన్నారు. కార్పొరేట్లకు మాత్రం మోదీ ప్రభుత్వం అన్నివిధాలా మేలు చేస్తోందని చెప్పారు. దేశ ప్రజల సమస్యలు పక్కతోవ పట్టించడానికి మతాన్ని వినియోగిస్తున్నదని తెలిపారు. ఈ వాస్తవాన్ని గమనించి ప్రజానుకూల విధానాల కోసం పోరాడాలని చెప్పారు. ఫార్మా యాజమాన్యాలు ప్రజారోగ్యంపై లాభాలు సంపాదిస్తున్నాయని, కానీ మెడికల్ రిప్స్ సమస్యలు పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రభుత్వ విధానాలు కూడా దీనికి కారణమన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌ను పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని మెడికల్ రిప్స్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ అఖిల భారత నాయకులు జెఎస్ మజుందార్, శంతన్‌కుమార్, ఏవీ నాగేశ్వరరావు, కృష్ణయ్య, ఆర్.అజయ్‌కుమార్, జి.కిషోర్‌కుమార్, వెంకటేశన్, ఎల్.రాజు, మాధవరావు, ఎం.వి.సుధాకర్, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కమల, ఎంసిహెచ్ సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌జిల్లా డీఈవోగా యూవీ సుబ్బారావు



విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా యూవీ సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారావు 1989లో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది శ్రీకాకుళంలో ఏపీ మోడల్ స్కూల్స్‌కు వెళ్లారు. అనంతరం ఎస్పీడీ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. 2020లో మచిలీపట్నం ఉపవిద్యాశాఖాధికారిగా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బదిలీపై వచ్చారు.

మెగా డీఎస్సీ ఇవ్వకుంటే..

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

» ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక

గవర్నరుపేట, ఫిబ్రవరి 7 : 23 వేల టీచర్ పోస్టులు ఇవ్వకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ నేతలు హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో మెగా డీఎస్సీని విడుదల చేయాలని బుధవారం వినూత్నంగా అర్ధనగ్న ప్రదర్శన జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి అధికారంలోకి రాకముందు ప్రజా సంకల్ప యాత్రలో 50 వేల పోస్టులకు మెగా డీఎస్సీని విడుదల చేస్తానని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.46

లయోలలో రెసొనెన్స్ 2024 ప్రారంభం

భారతీనగర్, ఫిబ్రవరి 7: ఆంధ్రా లయోల కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞాన రంగంపై అవగాహన పెంపొందించేందుకు రెసొనెన్స్ 2024 కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.వి .కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ శాస్త్రవేతలు ఇస్రో సంస్థ నేతృత్వంలో చంద్రుడు, అంగారక గ్రహాలపై పరిశోధనలు చేసి ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో ఒక మైలురాయిని చేరిందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ ప్రదర్శనలు, పోస్టర్ ప్రజెంటేషన్‌లు, వ్యాస రచన తదితర పోటీలను నిర్వహించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.జాన్సన్, ఫిజిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసశాస్త్రి, ఐఏపీటీ ఏపీ చాప్టర్ సెక్రటరీ డాక్టర్ జి.సహాయభాస్కరన్, వైస్ ప్రిన్సిపాల్ మొవ్వా శ్రీనివాసరెడ్డి, ఫిజిక్స్ విద్యార్థులు, వివిధ కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు నగర బహిష్కరణ పొడిగింపు

పాయకాపురం, ఫిబ్రవరి 7 : నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్‌కు నగర బహిష్కరణ గడువును నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా పొడిగించారు. వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన మహ్మద్ కరీం(32) వివిధ నేరాలకు సంబంధించి నిందితుడిగా ఉన్నాడు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అతని నగర బహిష్కరణ గడువును మరో ఆరునెలలు పొడిగిస్తూ సీపీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'తూర్పు' లో సమస్యలు కోకొల్లలు

- అన్ని డివిజన్లలో మురుగునీటి సమస్య
- పదిరోజులుగా అపరిశుభ్రంగా వస్తున్న తాగునీరు
- గతుకుల రోడ్లతో ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- స్పందించని అధికారులు

తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవు తున్నారు. ప్రధానంగా యూజీడీ సమస్య. పైపులైన్లు పాతవి కావడంతో పగుళ్లు వచ్చి మురుగు, మల, మూత్రాలు రోడ్డు మీదే ప్రవహిస్తున్నాయి. గతుకుల రోడ్లతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



విజయనగర్ కాలనీలో మట్టిరోడ్డు, అక్కినేని పూర్ణచంద్రరావు పార్క్‌లో నిరుపయోగంగా ఉన్న పిల్లల ఆట సామగ్రి, 12వ డివిజన్ ధనేకుల రోడ్డులో కోసుకుపోయిన రోడ్డు

పటమట, ఫిబ్రవరి 7 : 9వ డివిజన్ బందర్ రోడ్డునుంచి పటమట లంక ప్రధాన రహదారి బీటీ రోడ్డుకు కౌన్సిల్‌లో తీర్మానం పెట్టినా ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. యూజీడీ సమస్యతో మురుగునీరు రోడ్ల మీద ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 16వ డివిజన్ విజయనగర్ కాలనీ నుంచి రెల్లీస్ కాలనీ వైపు వెళ్లే దారిలో హెచ్‌టీ లైన్‌లో మట్టిరోడ్డును 250 మీటర్లు సిమెంట్ రోడ్డు వేయమని కౌన్సిల్‌లో ఎన్నిసార్లు ప్రతిపాదించినా నిధులు మంజూరు చేయలేదు. మారుతీ కో-ఆపరేటివ్ కాలనీలో అక్కినేని పూర్ణచంద్రరావు పార్క్ పునఃనిర్మాణం కోసం రూ.35లక్షలు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. కారణం ఏమిటని సదరు కాంట్రాక్టర్‌ను అడిగితే పైనుంచి మామీద ఒత్తిళ్లు వస్తున్నాయని చెప్పడం గమనార్హం. 11వ డివిజన్‌లో ఆటోనగర్ నుంచి హైస్కూల్ రోడ్డు మధ్యలో ఉన్న పీఅండ్‌టీ కాలనీలో వర్షం పడితే మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. వివేకానంద కాలనీలో రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ఇంతవరకు పేదలకు అందుబాటులోకి రాలేదు. 12వ డివిజన్‌లో ధనేకుల రోడ్డు ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వివేకానంద రోడ్డులో యూజీడీ పైపులైన్ల కోసం రోడ్డు తవ్వి మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి వదిలేశారు, గొట్టిపాటి బ్రహ్మయ్యవీధి, పుట్టరోడ్డు, వెలగపూడి సత్యనారాయణ రోడ్డు, నేతాజీ రోడ్డు చివర డ్రెయినేజీ పొంగి మలమూత్రాలు రోడ్డు మీదకు వస్తున్నాయి. 13వ డివిజన్‌లో మురుగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గంగిరెద్దుల దిబ్బ ట్రీట్‌మెంట్ రిజర్వాయర్ ద్వారా మంచినీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం అపరిశుభ్రమైన తాగునీరు సరఫరా అవుతోంది. కోనేరు వారి వీధి, కిసాన్ రోడ్డు, తోటవారి బజార్‌లో మురుగునీరు రోడ్లమీద ప్రవహిస్తోంది. 14వ డివిజన్ పుట్టరోడ్డు, అంబేడ్కర్‌నగర్‌లో తాగునీరు మురికిగా వస్తోంది. శివాలయం రోడ్డు, విజయ పాల బూత్, కెనరాబ్యాంక్ వీధుల్లో రోడ్లమీద మురుగు నీరు యథేచ్ఛగా పారుతుంది.



వివేకానంద కాలనీలో నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్

నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్

వివేకానంద కాలనీలో ఎంపీ ల్యాండ్స్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉంది. ఈ హాల్‌లో సిమెంట్ బస్తాలు, రంగు డబ్బాలు పెట్టడంతో హాల్ మొత్తం మట్టికొట్టుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కమ్యూనిటీ హాల్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి.

-బెజవాడ నజీర్, యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

డ్రెయినేజీ పొంగుతోంది

శివాలయం వీధి, కెనరా బ్యాంక్ పక్క వీధి, విజయ పాల బూత్ పక్క వీధిలో డ్రెయినేజీ పొంగి మురుగు నీరు బయటకు వస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలి.

-చెరుకూరి సాంబయ్య, 14వ డివిజన్

డివిజన్‌లో కుంటుపడిన అభివృద్ధి

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నా డివిజన్‌లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. నాకు సమాచారం లేకుండానే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు.

దేవినేని అపర్ణ, 10వ డివిజన్ కార్పొరేటర్

మురుగునీటి సమస్యతో పాట్లు

మురుగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సరఫరాను అంతరాయం లేకుండా వెంటనే పునరుద్ధరించాలి.

ముమ్మనేని ప్రసాద్,13వ డివిజన్ కార్పొరేటర్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 7 : ప్రజలందరికి మంచి ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయంలో రూ. 9.95 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన నియోజకవర్గంలోని ఐదుగురికి చెక్కులను అందజేశారు.

పశ్చిమలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 7: పశ్చిమలో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్.మాధవ వస్త్రలతలో ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు-పవన్‌కల్యాణ్‌ల ఆశయాలను రాష్ట్ర భవిష్యత్తు కోసం వారు పేర్కొన్న మేనిఫెస్టో అంశాలను వ్యాపారస్తులకు వివరించారు. అన్ని రకాలుగా వేధిస్తున్న జగన్‌రెడ్డికి వ్యాపారస్తులు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. శివాజీ, దినేష్, యశ్వంత్, దాసరి వెంకటరవికుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న మాధవ

యువతి స్నానం చేస్తుండగా

వీడియో తీసిన రౌడీషీటర్ అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 7 : యువతి బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా దొంగచాటుగా వీడియో తీసేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌పై బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అయోధ్యనగర్ ప్రాంతానికి చెందిన యువతి(22) మంగళవారం స్నానానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లగా కొంత సేపటికి కిటికీలో నుంచి ఫోన్ కనపడటంతో యువతి కేకలు వేస్తూ ఇంట్లోకి వెళ్లిపోయింది. అదే సమయంలో చేతిలో సెల్‌ఫోన్‌తో పరుగెడుతున్న పక్కింట్లో ఉంటున్న రౌడీషీటర్ కందుల విఘ్నేశ్వరరావు కనిపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

ప్రజలకు గుదిబండలా వైసీపీ విధానాలు: బొండా ఉమా



మాట్లాడుతున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 7: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు గుదిబండలా మారాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో 31వ డివిజన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫీగా జరిగిపోయే ఇసుకను ఆపి నూతన విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. అన్న క్యాంటీన్‌లను ఎత్తివేసి పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు చిరు వ్యాపారులకు మధ్యాహ్నం భోజనం లేకుండా సీఎం జగన్ చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలపై దెబ్బ కొట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని రాబోయే ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, సందిరెడ్డి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

19 ఏళ్లలోపు వారితో నులిపురుగుల మాత్రలు మింగించాలి

● కమిషనర్ స్వప్నిల్ దినకర్



మాట్లాడుతున్న కమిషనర్

చిట్టినగర్, ఫిబ్రవరి 7: చిన్నారులను నులి పురుగుల నుంచి కాపాడుకోవడానికి ఒకటి నుంచి 19 ఏళ్లు కలిగిన ప్రతి ఒక్కరితో నులిపురుగుల మాత్రలు మింగించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. బుధవారం కమిషనర్ స్వప్నిల్ దినకర్ తన చాంబర్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం ఫిబ్రవరి 9న పాఠశాల యాజమాన్యం తప్పక విద్యార్థులకు నులిపురుగులపై అవగాహన కల్పించి వారితో మాత్రలు మింగించాలని సూచించారు. అదనపు కమిషనర్ కె.శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి.రత్నావళి, ఎంఈవోలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



రానున్నది జనసేన- టీడీపీ ప్రభుత్వమే

● కేటీ రోడ్డులో ఐజా ర్యాలీ

చిట్టినగర్. ఫిబ్రవరి 7: రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుపొంది, జనసేన, టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు కావడం తథ్యమని జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాసుద్దీన్ (ఐజా) అన్నారు. బుధవారం ఐజా రథయాత్ర పేరిట పాలఫ్యాక్టరీ నుంచి పంజా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్తా ఆంధ్రాలో విజయవాడ పశ్చిమ మాత్రమే మైనార్టీలకు కంచుకోట వంటిదని, అందుకే పశ్చిమ సీటును మైనార్టీలకు ఇవ్వాలన్నారు. పశ్చిమలో జనసేన పార్టీకి ఉన్న ఏకైక మైనార్టీ నాయకుడిని తానేనని ఐజా అన్నారు. జనసేన తరపున తనకు పశ్చిమ టిక్కెట్ కేటాయించాలని కోరారు. జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళా ఉత్సవ్‌లో హెయిర్ స్టైల్ పోటీలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 7: జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం మొగల్ హాలులో జరుగుతున్న మహిళా ఉత్సవ్‌లో బుధవారం మహిళలకు హెయిర్ స్టైల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ రిసోర్స్ పర్సన్స్ ఎస్.సునీత, ఒ.భవానీదేవిలు న్యాయ నిర్ణేత లుగా వ్యవహరించారు. మొత్తం 14 మందిలో మొదటి బహుమతి జి.భావన, ద్వితీయ బహుమతి పి.లక్ష్మి ప్రసన్న పొందారు. జనశిక్షణా సంస్థాన్ డైరె క్టర్ ఏ. పూర్ణిమ, సిబ్బంది, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఫొటోగ్రాఫర్‌పై దాడి

వన్‌టౌన్, ఫిబ్రవరి 7: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఒక ఫొటోగ్రాఫర్‌పై దాడికి తెగబడ్డాడు.కృష్ణలంక పోలీసుస్టేషన్ పరిధిలోని సిటీ బస్సు టెర్మినల్ వద్ద ఓ నలుగురు వ్యక్తులు బుధవారం వేకువజామున ఒక బడ్డీ కొట్టువద్ద మద్యం తాగి ద్విచక్రవాహనాలపై కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ నడికట్ల అరవిందరెడ్డి వారిని సమీపించి వారిలో ఒకరు అనురూప్‌కు డబ్బులిచ్చి సిగరెట్ ఇవ్వమని అడిగాడు దీంతో ఆ వ్యక్తి కోపోద్రిక్తుడయి తాను సిగరెట్లు అమ్ముకునేవాడిలా కనిపిస్తున్నానా అంటూ గొడవకు దిగాడు. మాటా మాటా పెరిగి ఆవేశంతో అనురూప్ రెడ్డి తన వద్ద ఉన్న కట్టర్‌తో అరవిందరెడ్డిపై దాడి చేశాడు. గాయపడిన అరవిందరెడ్డి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న సాయిశ్రీకి అభినందనలు



లబ్బీపేట, ఫిబ్రవరి7: జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థిని డి.సాయిశ్రీని నలంద కళాశాల చైర్మన్ ఎ.విజయబాబు, ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధలు బుధవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ అనురాధ మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సాయిశ్రీ ఎన్‌సీసీ 4వ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ తరపున రిపబ్లిక్ డే వేడుకల్లో కల్చరల్ విభాగంలో ప్రాతినిధ్యం వహించి గ్రూప్ సింగింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. కర్తవ్య పాత్ ర్యాలీలో పాల్గొనడంతో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములతో పాటు ఇతర ప్రముఖులను కలిసే అవకాశం కలిగిందని,ఇది కళాశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా సాయిశ్రీని 4వ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ బలిందర్ సింగ్, ఎన్‌సీసీ ఏఎన్‌వో ఎస్‌కె రఫియా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

బ్యూటిషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

లబ్బీపేట, ఫిబ్రవరి 7: మెప్మా ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే బ్యూటిషియన్ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమం బుధవారం నగరంలోని అనూస్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న, ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘ సభ్యులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనూస్ సీఈవో అనురాధ, కృష్ణా జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకట నారాయణ, మెప్మా ఏవో రామాంజనేయులు, మెప్మా ఎస్‌ఎంఎంలు ఆదినారాయణ, ఎస్‌ఎస్‌ఆర్ శ్రీనివాస్, రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 8 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

మార్చిలో గామి ఆగమనం



విష్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతున్న అడ్వంచర్ డ్రామా 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'గామి' చిత్రాన్ని మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విష్వక్‌సేన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యాధర్ 'గామి' సినిమా కోసం చాలా పరిశోధన చేశాడు. సినిమా పూర్తి చేయడానికి దాదాపు నాలుగున్నరేళ్లు పట్టింది. వారాణసిలో షూటింగ్ చేస్తున్నప్పుడు చాలామంది నన్ను చూసి నిజమైన అఘోరా అనుకున్నారు. నాకు ధర్మం చేశారు. ఓ ముసలామె ఆప్యాయంగా భోజనం పెట్టారు. ఈ సినిమా కోసం చాలా కష్టాలు పడ్డాం. ట్రైలర్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. సినిమా అందరినీ అలరిస్తుంది' అన్నారు. విద్యాధర్ మాట్లాడుతూ 'అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే 'గామి' కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. విష్వక్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఏదడిగితే అది చేశారు. గడ్డకట్టించే చలిలో సైతం నటించాడు. ఈ సినిమా కోసం కుంభమేళాని చిత్రీకరించాం' అని చెప్పారు. కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ '2018లో ఈ సినిమాను మొదలుపెట్టాం. చాలా ఎగ్జయిటింగ్ కంటెంట్ ఉన్న సినిమా ఇదని తెలిపారు. ఈ చిత్రంలో చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. సంగీతం: నరేశ్ కుమారన్.



విధ్వంసాల జాతర

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఈనెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం రవితేజ్ యాక్షన్ హంగామా కనిపించింది. సరికొత్త మేకోవర్‌లో ఆయన కనిపించారు. 'వచ్చాడంటే మోతరా, విధ్వంసాల జాతర' అంటూ ఆయన పలికిన డైలాగ్‌లు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉన్నాయి. ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, అజయ్ ఘోష్, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషించారు. సంగీతం: దేవ్ జాంద్

మానవత్వాన్ని పంచే మొయినుద్దీన్ భాయ్



'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో...మానవత్వాన్ని అందరితో పంచుకో' అంటున్నారు రజనీకాంత్. 'లాల్ సలామ్' చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ పలికిన డైలాగ్ ఇది. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణం, రాజకీయాలు, మతవిద్వేషాల నేపథ్యంలో సాగే కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రజనీకాంత్ చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఐశ్వర్య దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్, విక్రాంత్, జీవిత రాజశేఖర్, క్రికెటర్ కపిల్ దేవ్ కీలకపాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు.

ఫ్యామిలీస్టార్ ప్రేమగీతం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఆయనకు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం 'నందనందనా' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీ సుందర్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్. ఎడిటర్: మార్తాండ్ కే వెంకటేశ్



రెండింతల వినోదం

సిద్దు జొన్నలగడ్డకు స్టార్ స్టేటస్‌ను తెచ్చిన చిత్రం 'డీజే టిల్లు'. 'అట్లుంటది మనతోని' అంటూ ఆ సినిమాలో ఆయన పంచిన వినోదం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి టిల్లూ బాయ్ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లూ స్క్వేర్' రూపొందుతోంది. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం సిద్దు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. కారులో హీరో హీరోయిన్ల రొమాన్స్, రాధికతో ప్రణయం గురించి టిల్లూ గుర్తు చేసుకొనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సిద్దు తనదైన స్టైల్లో మరోసారి డైలాగ్‌లతో మ్యాజిక్ చేశాడు. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిప్రకాశ్ ఉమ్మడి సింగు. ఎడిటర్: నవీన్ నూలి

నన్నే హీరోయిన్‌గా అనుకున్నారు

సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడారు.




- ఈ కథ రాసుకున్నప్పుడే నన్ను హీరోయిన్‌గా అనుకున్నానని ఆనంద్ చెప్పారు. స్టోరీ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. 'అసలు ఇలాంటి కథను ఎలా ఊహించగలిగారో' అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. అందుకే నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం అడిగాను. ఆనంద్ పాత్ర గురించి వివరంగా చెప్పాక నేను చేయగలననే నమ్మకం ఏర్పడింది.
- పూర్తిస్థాయి వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకులకు మంచి సందేశం, ఉత్కంఠభరితమైన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. అద్భుతం అనిపించే అతీంద్రియ శక్తుల నేపథ్యం ఉంటుంది. సినిమా నిర్మాణం విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీపడలేదు.
- 'స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రాల్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపించాను. ఈ చిత్రంలో వాటికి భిన్నంగా 'భూమి' అనే గిరిజన యువతి పాత్రలో కనిపిస్తాను. ఊళ్లో తనొక్కతే చదువుకున్న అమ్మాయి. అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా బలమైన పాత్ర. యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయి.
- మాది కూర్గ్. మా జీవితంలో ప్రకృతి ఒక భాగం. చెట్లు, నదులు, కొండలు, జంతువులను ఆరాధించే సంస్కృతి మాది. భూమి పాత్రను అర్థం చేసుకోవడానికి ఆ అనుభవాలు ఉపయోగపడ్డాయి. సందీప్ కిషన్ అద్భుతమైన సహనటుడు. ప్రతి ఒక్కరినీ గౌరవిస్తారు. వీఐ ఆనంద్‌తో వర్క్ చేయడం చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించింది.

ఏం జరిగింది?



విజయ్ శంకర్, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'అంతే.. అలా జరిగిపోయింది'. శ్రీరామ్ అమృతపురి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, సముద్రాల మహేశ్‌గౌడ్ నిర్మించారు. బుధవారం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. యువతను ఆకట్టుకునే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం, ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి జయసూర్య బొప్పెం సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్.



ఆర్‌ఆర్‌ఆర్ ఓ అద్భుతం

రాజమౌళిపై కామెరూన్ ప్రశంసలు



హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోమారు రాజమౌళిని అభినందనలతో ముంచెత్తారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ఓ అద్భుతం అని ప్రశంసించారు. సాటర్న్ అవార్డ్స్ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కామెరూన్ బదులిస్తూ "ఆర్‌ఆర్‌ఆర్ చాలా అద్భుతమైన సినిమా అనిపించింది. ఆ అనుభూతినే రాజమౌళితో పంచుకున్నాను. ప్రపంచం మొత్తం ఆ సినిమాను ఇష్టపడింది. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటడం మంచి పరిణామమని' పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రబృందం కామెరూన్‌కు ధన్యవాదాలు తెలిపింది. గతేడాది జరిగిన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కామెరూన్ కలిశారు. ఆ సందర్భంలో కామెరూన్ 'ఆర్‌ఆర్‌ఆర్' అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ చిత్రం రూపొందిస్తున్నారు.

కౌన్సెలింగ్

పిల్లాడిలో ఆ అల్లరెందుకు?

డాక్టర్! మా అబ్బాయికి ఏడేళ్లు. కుదురుగా కూర్చోకుండా ఎప్పుడూ అల్లరి చేస్తూ ఉంటాడు. పిల్లలు అల్లరి చేయటం సహజమేలే! అని మొదట్లో సర్దుకుపోయాం. కానీ చూడబోతే వాడికేదో ఆరోగ్య సమస్య ఉన్నట్టు అనిపిస్తోంది. ఇలా హద్దుల్లేకుండా అల్లరి చేసే పిల్లల సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి?

- ఓ సోదరి, విజయవాడ



మీరు చెప్తున్న లక్షణాలను బట్టి చూస్తుంటే మీ బాబు 'అటెన్షన్ డెఫిసిట్ డిజార్డర్'తో బాధ పడుతున్నట్టు అనిపిస్తోంది. కుదురుగా కూర్చోకోవటం, గట్టిగా అరుస్తూ పరిగెత్తుతూ ఉండటం, ఏ పని మీదా ఏకాగ్రత పెట్టలేకపోవటం...ఈ రుగ్మత లక్షణాలు. దీన్ని సరిదిద్దే చికిత్సలున్నా తల్లిగా మీరు బాబుతో మెలిగేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే బాబు పరిస్థితి త్వరగా మెరుగవుతుంది.

- డైలీ రొటీన్ తయారు చేసి దాన్ని అనుసరించేలా బాబుకు తర్ఫీదునివ్వండి.
- ఆరోగ్యకరమైన అలవాట్లు, పనులు నేర్పండి. ఉదాహరణకు మొక్కలు నాటించటం, తన గది తాను శుభ్రంగా పెట్టుకోవటం మొదలైనవి.
- వ్యాయామం, నిద్ర ఈ పిల్లలకు తగినంత అవసరం. బాగా నిద్ర పట్టేలా చేయాలంటే శరీరం అలసిపోయేలా వ్యాయామం చేయించాలి. బాగా నిద్ర పడితే చికాకు, విసుగు తగ్గుతాయి.
- జంక్, తీపి పదార్థాలను తగ్గించి తాజా ఆకుకూరలు, కూరగాయలు, ఇంట్లో వండిన పదార్థాలనే బాబుకు అలవాటు చేయండి.
- తోటి పిల్లలతో స్నేహంగా మెలగటంలో మెలకువలు, కలిసి ఆడుకోవటం, పంచుకోవటం మొదలైన విషయాలను నేర్పండి.

డాక్టర్ కిషోర్,
సైకియాట్రిస్ట్, హైదరాబాద్.

మొహం ఉబ్బిందా?

కొందరి మొహం చూడగానే లావు ఎక్కారని తెలిసిపోతూ ఉంటుంది. ఎప్పుడైనా అలాగ అనిపిస్తే ఏం చేయాలో పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

క్యాలరీలు లెక్కించండి...
ప్రతి వ్యక్తికి అవసరమైన క్యాలరీల విలువ వేరుగా ఉంటుంది. అయితే ఎప్పుడైనా క్యాలరీలను తగ్గిస్తే అదనపు కొవ్వు కూడా తగ్గుతుంది. అందువల్ల లావు ఎక్కినట్లు అనిపిస్తే వెంటనే క్యాలరీలు లెక్కించుకోండి.

మందులూ కారణమే!
కొన్ని రకాల మందులు వాడితే మొహం ఉబ్బిపోతుంది. అందువల్ల మొహం ఉబ్బినట్లు అనిపిస్తే- మందులు కూడా కారణం కావచ్చు.



ఫైబర్ లేమి
జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయటంలో ఫైబర్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఆహారంలో తగినంత ఫైబర్‌ను తీసుకోవాలి. ఒక వేళ తగినంత ఫైబర్ లేకపోయినా- మొహం ఉబ్బే అవకాశముంది.

ఉప్పుతో జాగ్రత్త
శరీరంలో ఉప్పు పెరిగిపోతే నీరు ఎక్కువగా బయటకు పోదు. నీరు ఎక్కువగా చేరితే మొహం ఉబ్బుతుంది. అందువల్ల ఎప్పుడైన మొహం ఉబ్బినట్లు అనిపిస్తే- ఆహారంలో ఉప్పును తగ్గించాలి.

ఎక్కువ నీరు తాగండి..
తక్కువ నీరు తాగటం మొదలెడితే శరీరంలో రకరకాల మార్పులు ఏర్పడతాయి. మన శరీరం నీటిని నిల్వ చేసుకోవటం మొదలుపెడుతుంది. దీని వల్ల మొహం ఉబ్బుతుంది.

నిద్ర తప్పనిసరి..
ప్రతి రోజు ఏడు గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. లేకపోతే శరీరానికి తగినంత విశ్రాంతి దొరకదు. దీని ప్రభావం శరీరంలోని అవయవాలపై పడుతుంది. దీని వల్ల కూడా మొహం ఉబ్బే అవకాశముంది. అందువల్ల రోజుకు ఏడు గంటల నిద్ర తప్పనిసరి అని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు.

ఆల్కహాల్ ప్రభావం
ఆల్కహాల్ తాగితే - దాని ప్రభావం వల్ల మొహం ఉబ్బుతుంది. అందువల్ల వీలైనంత వరకు ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం మంచిది.

అభిరుచి

'ఆధునిక సమాజంలో పనుల ఒత్తిళ్లతో మనం ఆహారం తినే తీరుతెన్నుల్లో అనేక మార్పులు వచ్చాయి. ఈ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందరికీ ఆరోగ్యకరమైన, రుచికరమైన వంటలను అందించటానికి ప్రయత్నిస్తున్నా' అంటారు వంటల పుస్తకాల రచయిత కరేన్ ఆనంద్. దేశంలోని వంటలపై సుమారు ఇరవై పుస్తకాలు రాసిన ఆమె... తాజాగా 'మసాలా మేమ్‌సాబ్' పుస్తకాన్ని విడుదల చేశారు. జైపూర్‌లో జరిగిన 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్' (జేఎల్‌ఎఫ్)కు ప్రత్యేక అతిథిగా వచ్చిన ఆమెను 'నవ్య' పలుకరించింది.



మసాలా మేమ్‌సాబ్!

మన దేశంలో వంటలను మనం ఎలా చూడవచ్చు?
మన దగ్గర ఉన్నన్ని వంటలు మరే ఇతర ప్రాంతంలోనూ దొరకవు. ప్రతి ప్రాంతానికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. అత్యంత సులభమైన వంటల నుంచి అత్యంత క్లిష్టమైన వంటల దాకా రకరకాల వంటలు మన వాళ్లు చేస్తూ ఉంటారు. అయితే ఇక్కడ మనకొక వైరుధ్యం కూడా కనిపిస్తుంది. కొంకణి, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో కేవలం రెండు, మూడు పదార్థాలతో వంటలు చేసేస్తారు. అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, బంగాళదుంపలతో రుచికరమైన కూర వండుతారు. కొన్ని ప్రాంతాల్లో కూర చేయాలంటే కనీసం 12 నుంచి 15 రకాల దినుసులు వాడతారు. అందుకే మన భారతీయ వంటలు సంక్లిష్టంగానూ ఉంటాయి.



యూరప్ వంటలతో మనవాటిని పోల్చవచ్చా?
లేదు. ఎందుకంటే వారి వంటలు వన్ డైమన్షన్‌లో ఉంటాయి. అంటే ఒక ప్రధానమైన విషయంపైనే మొత్తం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు చేపతో చేసే వంట అనుకుందాం. అది చేప రుచే ఉంటుంది. మసాలా దినుసులు, గ్రేవీ ఉండవు. ఎందుకంటే వారు పోషకాల కోసం కొన్ని పదార్థాలపై ఆధారపడతారు. ఉదాహరణకు వైన్‌తో పాటు చీజ్ తింటారు. ఒకవేళ చేప సరైంది కాకపోతే మొత్తం వంట చెడిపోతుంది. మన దగ్గర అలా కాదు. ఒక కూరలో రకరకాల రుచులు ఉండాలి. అప్పుడే మనకు నచ్చుతుంది. అందుకే మనం మసాలాలు ఎక్కువ వాడతాం. దీనివల్ల ఎక్కువ సందర్భాలలో కాయగూరల రుచి కన్నా మసాలా రుచే ఎక్కువగా తెలుస్తుంటుంది.

మీ ఉద్దేశంలో మంచి వంటకు కావల్సిన పదార్థాలేంటి?
అన్నింటి కన్నా ముఖ్యం సమయం. ఎక్కువ సమయాన్ని వెచ్చించగలిగితే మంచి రుచి వస్తుంది. కానీ ప్రస్తుతం ఎవ్వరికీ అంత సమయం ఉండటంలేదు. ముఖ్యంగా ఒక కుటుంబంలో భార్య, భర్త... ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే, వారిద్దరికీ వంట చేయటానికి అతి తక్కువ సమయం ఉంటోంది. అందువల్ల వంటకన్నా వారు ఇతర అంశాలపై దృష్టి పెడతారు. అవసరమైతే బయట నుంచి ఆర్డర్ చేసుకొని తింటారు. అంతేకాకుండా వంటలు రుచిగా ఉండాలంటే... ఆహార పదార్థాల నాణ్యత బాగుండాలి. లేదంటే వంట బాగుండదు. గతంలో అందరూ సేంద్రియ పంటలే పండించేవారు. అందువల్ల కూరగాయలు, ఆకుకూరలు, రకరకాల ధాన్యాలు రుచిగా ఉండేవి. ఇప్పుడు ఎక్కువ ఎరువులు వేయటంవల్ల రుచి తగ్గిపోయింది.

> చాలా వంటలు ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా వస్తాయి. వాటిని ఎక్కడైనా రికార్డు చేసి పెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. మీకో ఉదాహరణ చెబుతాను. మా అమ్మమ్మ కొన్ని వంటలు అద్భుతంగా చేసేది. కానీ అవి ఎలా చేయాలో ఎవరికీ చెప్పేది కాదు. మా అమ్మకు కూడా అవి ఎలా చేయాలో తెలియదు. నేను పెద్దయిన తర్వాత ఆ వంటలు సేకరించటానికి ప్రయత్నించా.

ఈ మధ్యకాలంలో వంటను కెరీర్‌గా తీసుకొనేవారి సంఖ్య పెరిగింది కదా..!
కెరీర్‌గా మాత్రమే తీసుకొంటున్నారు. కానీ ఇంట్లో ఎంతమంది వంట చేస్తున్నారు? ఇంకో విషయం కూడా చెబుతాను. వంట చేయటం కెరీర్‌గా తీసుకొనేవారు మహిళల కన్నా పురుషులే ఎక్కువ. ఎందుకంటే... చెఫ్‌లుగా పనిచేయాలంటే అనేక రకాల సమస్యలు ఎదురవుతాయి. ఉదాహరణకు అర్ధరాత్రి పెళ్లి ఉందనుకుందాం... ఆ పెళ్లి విందుకు వంట చేయాలంటే మహిళలు అర్ధరాత్రి దాకా ఉండలేరు కదా. పురుషులకు ఇలాంటి సమస్యలు ఉండవు కాబట్టి ఎక్కువమంది చెఫ్‌లు వారే కనిపిస్తారు.

భారతీయ ఆహారం చాలా సంక్లిష్టమైందని అన్నారు కదా. ఒక కిచెన్‌ను ఏర్పాటు చేసుకోవటం ఎంత కష్టమైన పని అని మీరు అనుకుంటున్నారు?
ఒక మసాలా డబ్బా.. కొన్ని గిన్నెలు ఉంటే కిచెన్ అవుతుంది. అయితే వంట ఎలా చేయాలో కూడా తెలియాలి కదా. ఈ మధ్యకాలంలో ఎక్కువమంది వంట పుస్తకాలు చదువుతున్నారు. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తున్నారు. కానీ వంట చేయటానికి ఇష్టపడరు. అంతేకాకుండా చాలా వంటలు ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా వస్తాయి. వాటిని ఎక్కడైనా రికార్డు చేసి పెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. మీకో ఉదాహరణ చెబుతాను. మా అమ్మమ్మ కొన్ని వంటలు అద్భుతంగా చేసేది. కానీ అవి ఎలా చేయాలో ఎవరికీ చెప్పేది కాదు. మా అమ్మకు కూడా అవి ఎలా చేయాలో తెలియదు. నేను పెద్దయిన తర్వాత ఆ వంటలు సేకరించటానికి ప్రయత్నించా. మా అమ్మమ్మ దగ్గర పనిచేసే ఒకామెను పట్టుకొని, ఆవిడ దగ్గర నుంచి వివరాలు తెలుసుకున్నా. కానీ మా అమ్మమ్మ వంట రుచి రావాలంటే ఎలా? ఒక్కో వంటను పదేసిసార్లు చేశా. అలా చేయగా చేయగా కొన్ని ప్రత్యేకమైన వంటల గురించి తెలిసింది. కానీ ఇంత సమయం ఎవరికి ఉంటుంది? అందువల్ల వంట చేసే ప్రతివారూ తమకు నచ్చిన వంటలను ఎలా చేయాలో ఒక పుస్తకంలో రాసి పెట్టుకుంటే భవిష్యత్ తరాల వారికి ఎంతో ఉపకరిస్తుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

వెండితెరపై తనను తాను చూసుకోవాలన్నది చిన్ననాటి కోరిక. కానీ నటి అయ్యాక అంతటితోనే ఆగిపోలేదు. పెద్ద కల కన్నది. అదే ఆమెను విజయవంతమైన పారిశ్రామికవేత్తను చేసింది. అప్పుడెప్పుడో తెలుగులోనూ ఓ మెరుపు మెరిసిన నటి పారుల్ గులాటీ డబుల్ ధమాకా ఇది...

శ్రీ శక్తి

డబుల్ ధమాకా



"ఒకరికి వారసురాలిగా చెప్పుకోవడం కాదు... నాదైన వారసత్వాన్ని నిర్మించుకోవాలనే తపన నాది. ఇదే నేను కన్న అతిపెద్ద కల. ప్రస్తుతం ఆ కలను ఛేదించుకొంటూ వెళుతున్నాను. ఆ బాటలో ప్రయాణించాల్సింది చాలా ఉంది. అలాగని ఇప్పటివరకు సాధించింది తక్కువేంకాదు. నాలాంటి ఒక మధ్యతరగతి అమ్మాయి... ఎవరూ తెలియని వినోద పరిశ్రమలో అడుగుపెట్టడం... అవకాశాలు దక్కించుకోవడం అంటే సామాన్య విషయం కాదు. ఇది నేను ఇష్టపడి పడిన కష్టానికి దక్కిన ఫలితం. హరియాణా రోహ్‌తక్‌లో ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం మాది. అంతా రొటీన్ ఉద్యోగాలు చేసేవారే నా చుట్టూ. నెలవారీ ఖర్చులుపోనూ అదనంగా ఏ వస్తువు కొనుక్కోవాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఎందుకో నాకు ఆ జీవితం నచ్చలేదు. డబ్బు తక్కువ వస్తుందని కాదు... గుంపులో గోవిందంలా బతకడం ఇష్టంలేక. అందుకే ఒకరోజు ఇంట్లోవాళ్లకు చెప్పేశాను... 'నేను నటి కావాలని అనుకుంటున్నా' అని. అప్పటికి ఇంకా నా పాఠశాల విద్యాభ్యాసం పూర్తికాలేదు. నా మాటలు విని అమ్మానాన్న అవాక్కయ్యారు. వద్దంటే వద్దన్నారు. వాళ్లను ఒప్పించడం నాకు పెద్ద సవాలుగా మారింది. ఎంతచెప్పినా వాళ్ల మనసు మార్చుకోవడంలేదు. నేను పట్టు వదల్లేదు. దాంతో చేసేది లేక... చివరకు వాళ్లు ఓకే అన్నారు.

ఇంటి నుంచి ముంబయికి...
నటన మీద మక్కువ నాలో ఎప్పుడు కలిగిందో తెలియదు. కానీ చిన్నప్పటి నుంచి టీవీల్లో సినిమాలు, షోలు చూస్తూ బాగా ఆస్వాదించేదాన్ని. పన్నెండో తరగతిలో ఉండగా 'ఇక నటనే నా కెరీర్' అని బలంగా నిర్ణయించుకున్నాను. ఎలాగో అమ్మానాన్నలను ఒప్పించాను కదా... వెంటనే ముంబయికి వెళ్లిపోయాను. 'ముంబయి యూనివర్సిటీ'లో డిగ్రీ చదువుకొంటూనే నటనలో శిక్షణ తీసుకున్నాను. కొన్నాళ్లు మోడలింగ్ చేశా. అదే సమయంలో 'యే ప్యార్ న హోగా కామ్' సీరియల్‌లో అవకాశం లభించింది. ఆ ఏడాదే మరో టీవీ షో 'కితనీ మొహబత్ హై' కోసం పిలుపు వచ్చింది. తరువాత మరో రెండు షోలు చేశాను.

మెరుగులు కోసం లండన్‌కు...
మోడలింగ్, నటన, చదువు... క్షణం తీరిక దొరికేది కాదు. ఒక్కోసారి రాత్రిళ్లు నిద్ర కరువయ్యేది. అయినా ఏనాడూ కష్టమనిపించలేదు. ఎందుకంటే నటిగా ఎదగాలన్నది నా చిన్ననాటి కోరిక కదా. నాలోని ప్రతిభకు మరిన్ని మెరుగులు అద్దుకోవాలన్న లక్ష్యంతో డిగ్రీ అవ్వగానే ఏడాది విరామం తీసుకుని, లండన్‌కు వెళ్లాను. అక్కడి 'రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్' (ఆర్ఏడీఏ)లో యాక్టింగ్ కోర్సు చేశాను. తిరిగి వచ్చాక సినిమాల్లో నటించాలనేది నా కోరిక. ఆ ప్రయత్నాల్లో భాగంగా నా మాతృ భాష పంజాబీ చిత్రాల్లో అవకాశం వచ్చింది. మూడు చిత్రాల్లో హీరోయిన్‌గా చేశాను. అప్పుడే తెలుగు పరిశ్రమ నుంచి ఆహ్వానం అందింది... 'నీ జత లేక' చిత్రం కోసం! అందులో మంచి పాత్ర దక్కింది. అయితే ఆశించిన స్థాయిలో కెరీర్ దూసుకుపోలేదు. ఏం చేయాలి? ఆలోచనలో పడ్డా.

మళ్లీ బుల్లితెరకు...
మూడేళ్లలో నేను చేసింది నాలుగే సినిమాలు. అవి పెద్ద బ్రేక్ ఇవ్వలేదు. గమ్యం ఎటువైపు అని ఆలోచిస్తుంటే... ఓ టెలివిజన్ నుంచి ఫోన్ వచ్చింది. అలా 2017లో 'పీఓడబ్ల్యూ- బందీ యుద్ధ్ కే'తో మళ్లీ టీవీ రంగంలోకి అడుగుపెట్టాను. అదిమొదలు ఇక వెనక్కి తిరిగి చూసుకుంది లేదు. టీవీ షోలతో పాటు వెబ్‌సిరీస్‌లు వెతుక్కుంటూ వచ్చాయి. 'హక్ సే, గర్ల్స్ హాస్టల్, హే ప్రభూ, ఇల్లీగల్, యువర్ ఆనర్, మేడిన్ హెవెన్-2' తదితర వెబ్‌సిరీస్‌లు చేశాను.

వ్యాపార రంగంలోకి...
వెబ్‌సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగానే ఉన్నాను. మంచిగా సంపాదిస్తున్నాను. కానీ అంతటితోనే ఆగిపోవాలని నేను అనుకోలేదు. నా పాపులారిటీని, నాకున్న పరిచయాలను ఉపయోగించుకొని మంచి బిజినెస్ ఒకటి ప్రారంభిస్తే? ఈ ఆలోచన వచ్చింది మొదలు... ఇక ఆలస్యం చేయలేదు. వ్యాపారం చేయాలనే నిర్ణయానికి వచ్చేశాను. మరి ఏ బిజినెస్ అయితే బాగుంటుంది? దానికోసం మార్కెట్‌ను అధ్యయనం చేశాను. హెయిర్ ఎక్స్‌టెన్షన్స్‌కు సంబంధించినదైతే లాభదాయకం అనిపించింది. ఎందుకంటే ఒక్క స్టైలింగ్ కోసమే కాదు... హెయిర్ లాస్, థిన్నింగ్, డ్యామేజ్ హెయిర్‌తో చాలామంది ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమస్యలు కొందరిలో ఆత్మన్యూనతకు కూడా దారి తీస్తాయి. ముఖ్యంగా కొందరు మహిళలకు ఇది పెద్ద సమస్యగా పరిణమించింది. అలాంటి వారిలో ఆత్మవిశ్వాసం కలిగించేందుకు హెయిర్ ఎక్స్‌టెన్షన్స్ ఉపయోగపడతాయి. ఈ ఆలోచనతోనే 2017లో 'నిష్ హెయిర్‌ఇన్' ప్రారంభించాను.

మూడు నెలలు పట్టింది...
ప్రస్తుతం మా కంపెనీ నుంచి విగ్గులు, సవరాలు, హెయిర్ టాపర్స్, ఎక్స్‌టెన్షన్స్, హెయిర్ పెర్‌ఫ్యూమ్ వంటివి ఉత్పత్తి చేస్తున్నాం. మా ఇంట్లోని ఒక చిన్న గదిలో ప్రారంభమైన కంపెనీ ఇప్పుడు పెద్ద భవంతిలోకి మారింది. మొదట్లో నేను, మా అమ్మ కలసి ఒక్కో వెంట్రుక జతచేస్తూ విగ్గులు తయారు చేసేవాళ్లం. మూడు పీస్‌లు అమ్మడానికి మాకు మూడు నెలలు పట్టింది. ఇంటింటికీ వెళ్లి అమ్మేవాళ్లం. కొనేవాళ్లు లేక ఆరువేల రూపాయల ఉత్పత్తిని మూడు వేలకే అమ్మిన సందర్భాలు కూడా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంతో క్రమంగా ఆదరణ, అమ్మకాలు పెరిగాయి. ప్రస్తుతం మా దగ్గర 35 మంది మహిళలు పని చేస్తున్నారు. ముంబయిలో ఒక స్టూడియో కూడా నెలకొల్పాను. కొన్నేళ్ల కిందట నెలకు ఎనభై లక్షలు ఉన్న మా ఆదాయం ఇప్పుడు మూడు రెట్లు పెరిగింది. వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు నాకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంటుంది."

రోగనిరోధక శక్తి పెంచుకోవాలంటే?

వేసవికాలం వస్తోంది. చాలా మంది త్వరగా నీరసపడిపోతూ ఉంటారు. కొందరికి ఎక్కువ దాహం వేస్తూ ఉంటుంది. ఇలాంటి లక్షణాలకు ఉసిరి వైద్యం అద్భుతంగా పనిచేస్తోందంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

ఎలా తయారుచేసుకోవాలి?
రెండు ఉసిరికాయలను తీసుకోవాలి. వాటిని ముక్కలుగా చేసి తేనె, మిరియాలపొడిలో 12 గంటలు నానబెట్టాలి. ఇలా నానబెట్టిన మిశ్రమాన్ని ఉదయాన్నే లేచిన వెంటనే తినాలి. ఇలా నాలుగు వారాలు తింటే- ఏటువంటి జబ్బులు దరి చేరవు.

ఎందుకు పనిచేస్తుంది?
- ఉసిరిలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. శరీరానికి అస్వస్థత ఏర్పడినప్పుడు- ఆ అనారోగ్యం నుంచి బయటపడటానికి ఈ విటమిన్ ఉపకరిస్తుంది.
- మిరియాల పొడిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరం అస్వస్థతకు గురికాకుండా కాపాడుతూ ఉంటాయి.
- తేనెకు అనేక ఆరోగ్య సమస్యలను పరిష్కరించే గుణముంది. శ్వాసకోశ సంబంధమైన వ్యాధులను పరిష్కరించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.
- ఉసిరిని తేనెలో నానబెట్టడం వల్ల వాటి లాభాలు మరింత పెరుగుతాయి.

ఎప్పుడు తినాలి?
ఉదయాన్నే లేచిన వెంటనే తినాలి. లేదా రాత్రి నిద్రపోయే ముందు తినాలి. మధుమేహం ఉన్న వారు రెండు రోజులు తిని- సుగర్ విలువల్లో వస్తున్న మార్పులను గమనించాలి. మార్పు రాకపోతే తినాలి. లేకపోతే తినే పరిమాణాన్ని తగ్గించాలి.



కన్న కలల మీద ఆశలు వదిలేసుకునే పరిస్థితి అందరి జీవితాల్లో ఏదో ఒక సందర్భంలో ఎదురవుతుంది. అయితే ఎంచుకున్న లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోకుండా ముందుకు కొనసాగగలిగే ధైర్యం, పట్టుదలలు ఏ కొందరికో ఉంటాయి. బెల్లీ డ్యాన్సర్‌గా ఎదిగిన నూపుర్ కౌశిక్ షా కథ ఇందుకొక ఉదాహరణ.

వినూత్నం

బెల్లీ డ్యాన్స్ బ్రహ్మాండంగా...

వృత్తిపరంగా బెల్లీ డ్యాన్స్ అర్టిస్ట్ అయిన నూపుర్ తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా ఏరియల్ ఆర్ట్, బెల్లీ డ్యాన్స్ బేసిక్స్ నేర్పించడం మొదలుపెట్టి క్రమేపీ ఆ కళల్లో నిపుణురాలిగా మారిపోయింది. ప్రస్తుతం నూపుర్ ప్రొఫెషనల్ బెల్లీ డ్యాన్స్ ఆర్టిస్ట్‌గా, ఏరియల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హెడ్ సెక్రటరీల్లో ఒకరిగా బాధ్యతలు నిర్వహిస్తోంది. నూపుర్ బెల్లీ డ్యాన్స్ గురించి మాట్లాడుతూ..."ఎవరైనా బెల్లీ డ్యాన్స్ నేర్చుకోవచ్చు. ఈ కళకు రంగు, ఆకారం, వయసు, జెండర్‌లతో పని లేదు. డ్యాన్స్ చేయలేని వాళ్లు కూడా ఈ కళను నేర్చుకోవచ్చు. నేను మొదట్లో ఫిట్‌నెస్ ట్రైనర్, న్యూట్రిషనిస్ట్‌గా మారాలనుకున్నాను. అథ్లెట్‌ని కాబట్టి నాకు జిమ్నాస్టిక్స్ వచ్చు. బెల్లీ డాన్సింగ్ ఇంట్రెస్టింగ్‌గా కనిపించడంతో, నేను దాన్నొక అభిరుచిగా మలుచుకున్నాను" అంటూ చెప్తోంది నూపుర్. ఆవిడ అభిరుచి కాస్తా కొద్ది కాలంలోనే ప్యాషన్‌గా మారింది. పైగా తాను నివసించే అహ్మదాబాద్‌లో బెల్లీ డ్యాన్స్ స్కూల్స్ లేకపోవడంతో, పూణేకు వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం తీసుకోవడం వెనకున్న కారణం గురించి వివరిస్తూ... "బెల్లీ డ్యాన్స్ చేసేటప్పుడు, శరీరంతో అనుసంధానమై, శరీరంలోని ప్రతి కండరం మీదా నియంత్రణ సాధించిన అనుభూతికి లోనవుతూ ఉంటాను. అలాంటి కళను నలుగురికీ పరిచయం చేయాలనే తపన నాలో ఉంది. కాబట్టే పూణేకు వెళ్లిపోవాలని నేను తీసుకున్నది పెద్ద నిర్ణయమే అయినా, నా అభిరుచిని మరింత ముందుకు తీసుకువెళ్లడం కోసం ఆ నిర్ణయానికి కట్టుబడక తప్పదం



లేదు" అని చెప్పుకొచ్చింది నూపుర్.

ప్రమాదం అడ్డంకి కాలేదు
ఏరియల్ డ్యాన్స్ అనేది ఆధునిక నృత్యంలో భాగం. తాడును ఆధారంగా చేసుకొని, గాలిలో చేసే విన్యాసాలివి. ఇందులో పరిణతి సాధించాలనే తపనతో ముంబయికి వెళ్లాలని నిర్ణయించుకున్న నూపుర్ ఓ పక్క పూణేలో విద్యార్థులకు బెల్లీ డ్యాన్స్ నేర్పిస్తూనే మరో పక్క వారంలో మూడు సార్లు ముంబయికి వెళ్లి రావడం మొదలుపెట్టింది. "అలా ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపడం తేలిక కాదు. అలా ఆరు నెలలు రెండు నగరాల మధ్యా పరుగులు పెట్టడం మొదలుపెట్టిన తర్వాత, నా శరీరం సహకరించడం మానేసింది. దాంతో ఆరు నెలల పాటు బ్రేక్ తీసుకుని, ముంబయిలో జరిగిన ఏరియల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. నా ఆర్ట్‌ఫామ్‌ను మెచ్చిన జడ్జిలు తొలి మూడు స్థానాల్లో నాకు చోటు కల్పించారు. అది మర్చిపోలేని అనుభవం. అయితే ఆ తర్వాత కొంత కాలానికే ఊహించని ప్రమాదం జరిగింది. ఒక ప్రదర్శనలో నేను ఎత్తు నుంచి పడిపోయి గాయపడ్డాను. నా కాలర్‌బోన్ విరిగిపోయింది. దాంతో ఇక ముందు నేను ఏరియల్ డ్యాన్స్ చేయలేనని డాక్టర్లు చెప్పేశారు. కానీ రెండేళ్ల రిహ్యాబిలిటేషన్ తర్వాత, తిరిగి నాకెంతో ఇష్టమైన ఏరియల్ డ్యాన్స్ సాధన చేయడం మొదలుపెట్టాను. అలాగే జి టివిలో డ్యాన్స్ విత్ మిలో కూడా పాల్గొన్నాను. నాకు ఈ కళంటే ఇష్టం. దీన్నుంచి తప్పుకోవాలని నేనెప్పుడూ అనుకోను. ఏరియల్ డ్యాన్స్ పరంగా నాకు రెండో ఆలోచన అంటూ ఉండదు. నాకు ప్లాన్ ఎ, ప్లాన్ బి కూడా ఇదే!" అంటూ చెప్పుకొచ్చింది నూపుర్. అంతిమంగా నూపుర్ తాను ఆశించిన గుర్తింపును దక్కించుకోగలిగింది. ప్రస్తుతం ఆవిడ ఎన్నో టివి షోల ద్వారా ప్రపంచవ్యాప్త విద్యార్థులకు బెల్లీ డ్యాన్స్, ఏరియల్ డ్యాన్స్ నేర్పిస్తోంది.





థియేటర్‌లో జగన్ బొమ్మపై చెప్పులు విసిరిన దృశ్యం

హాలులో జగన్ యాడ్ చూడగానే చెప్పులు విసిరిన యువత

» తిరుపతిలో ఘటన.. వీడియో వైరల్

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై యువత ఎంత ఆగ్రహంగా ఉందో తెలియజేసే సంఘటన ఇది. ఓ సినిమా థియేటర్‌లో విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించిన యాడ్‌లో ఆయనకనిపించగానే.. యువత తెరపైకి చెప్పులు, బూట్లు విసిరి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఈ సంఘటన తిరుపతిలో బుధవారం చోటుచేసుకుంది. ప్రముఖ హీరో పవన్ కల్యాణ్ నటించిన 'కెమెరామన్ గంగతో రాంబాబు' సినిమా రీ రిలీజ్ అయిన సంగతి తెలిసిందే.

నగరంలోని ప్రముఖ థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శన బుధవారం నుంచే మొదలైంది. ఓ థియేటర్‌లో మధ్యాహ్నం మ్యాట్నీ షో సందర్భంగా ఇంటర్వెల్ సమయంలో రాష్ట్రప్రభుత్వ యాడ్ ప్రదర్శితమైంది. ఈ యాడ్‌లో జగన్ కనిపించగానే తెర ముందున్న యువకులు, పిల్లలు పెద్దగా కేకలువేస్తూ... చెప్పులు, షూలూ తెరమీదకు విసిరారు. ఈ దృశ్యాలను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన కొందరు ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇప్పుడా వీడియో తెగ వైరల్ అవుతోంది. దీన్ని చూసిన నెటిజన్లు సీఎం జగన్ తెరపైన కనిపిస్తేనే పరిస్థితి ఇలా ఉంటే నేరుగా జనాల్లోకి వస్తే అప్పుడెలా ఉంటుందో...? అని వ్యాఖ్యానిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

ఏపీకి మోదీ వెన్నుపోటు

» భావి తరాల కోసమే మా పోరాటం: చలసాని

» ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఢిల్లీలో ధర్నా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఏపీకి కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం, నయ వంచన చేసింది. ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం, ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం ఢిల్లీ గడ్డపై పోరాడుతున్నాం. ఈ పోరాటం ఏ ఒక్కరి కోసమో కాదు. ఏపీ భావి తరాల కోసం, యువత కోసం చేస్తున్నాం' అని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏపీభవన్‌లో ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోదీ ప్రభుత్వానికి ఇవి ఆఖరి రోజులని, కొత్త ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్లమెంట్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, అమరావతి రాజధాని కోసం రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు కేంద్రం ముందు చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, ప్రొఫెసర్ సదాశివ రెడ్డి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్లు జె.అయోధ్యరాము, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ బతుకులు!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు చేతులు కట్టుకుని నిల్చున్నట్లుగా మరో ఫొటో కూడా సృష్టించారు.

అడుగు పెట్టకముందే...

చంద్రబాబు ఢిల్లీలో అడుగు పెట్టకముందే ఈ ఫేక్ ప్రచారం మొదలైంది. క్లుప్తంగా సమాచారాన్ని అందించే 'వే2న్యూస్' లోగోను దీనికి వాడుకున్నారు. "చర్చలకోసం ఢిల్లీవెళ్లిన చంద్రబాబు.. అమిత్‌షా కాళ్లు మొక్కడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీకి 4 పార్లమెంటు, 22 అసెంబ్లీ స్థానాలు ఇచ్చేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు సమాచారం" అంటూ ఒక తప్పుడు కథ అల్లేశారు. అసలు విషయం ఏమిటంటే.. బుధవారం రాత్రి పొద్దుపోయే దాకా చంద్రబాబు-అమిత్‌షా భేటీ మొదలే కాలేదు. పొత్తు సంగతీ తేలలేదు. కానీ... ఏకంగా సీట్లు, అభ్యర్థులను కూడా పేటీఎం బ్యాచ్ ప్రకటించేసింది. ఇది ఫేక్ అని, తాము ప్రచురించిన కథనం కాదని 'వే2న్యూస్' సంస్థ అధికారికంగా స్పష్టం చేసింది. "ఇది మా వార్త కాదు. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు మా లోగోను వాడుకొంటూ దుష్ప్రచారం చేస్తున్నాయి" అని ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలోనూ ఇదే మాదిరిగా ఈ సంస్థ లోగోతో టీడీపీ వ్యతిరేక వార్తలు పుట్టించి ప్రచారంలో పెట్టారు. అప్పుడు కూడా 'వే2న్యూస్' స్పందించి వివరణ ఇచ్చింది.

లేనిది ఉన్నట్లు...

'అమిత్‌షా కాళ్లు మొక్కుతున్న చంద్రబాబు'... ఒక ఫేక్ ఫొటో, ఒక ఫేక్ వార్త. రెండు ఫొటోలను కలిపి విక్సింగ్ చేసేశారు. 2018లో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు యోగాసనాలు వేశారు. ఇందులో భాగంగా నడుమును వంచి యోగా చేశారు. ఇక... అమిత్‌షా బీజేపీ అగ్ర నేత మురళీ మనోహర్ జోషికి నమస్కరిస్తున్న (కొద్దిగా వంగి, ఒక చేత్తో మోకాలిని తాకడం) ఫొటోను నెట్‌లో పట్టుకున్నారు. అక్కడి చంద్రబాబు, ఇక్కడి షాను కలిపేసి... తప్పుడు ఫొటో సృష్టించారు. ఇక... మోదీ-బాబు ఫొటో కూడా ఇలాంటిదే. అప్పుడెప్పుడో మెట్రో రైలులో మోదీ యువతతో ముచ్చటిస్తున్న దృశ్యమది. అక్కడ... చంద్రబాబు చేతులు కట్టుకుని నిల్చున్న ఫొటోను యాడ్ చేశారు. ఉత్తర భారత దేశంలో ఏ మెట్రో రైలులోనూ గత నాలుగున్నరేళ్లలో మోదీతోపాటు చంద్రబాబు ప్రయాణం చేయలేదు.

టీడీపీ నేతల ఆగ్రహం...

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి, కేసుల నుంచి కాపాడుకునేందుకు ఢిల్లీ పెద్దల ముందు సాగిల పడుతున్నదెవరో ప్రజలందరికీ తెలుసు. వైసీపీ విపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా బీజేపీకి 'బేషరతు' మద్దతు పలుకుతోంది. కానీ... చంద్రబాబుకు అమిత్‌షా నుంచి పిలుపు అందగానే పేటీఎం బ్యాచ్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. "ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇమేజ్ దెబ్బ తీయడానికి ఇలాంటి లేకి పనులు చేస్తున్నారు. వైసీపీ సామాజిక మాధ్యమ విభాగం ఇటువంటి ఫొటోలు తయారు చేస్తే ఆ పార్టీ శ్రేణులు వాటిని ప్రచారంలో పెడుతున్నాయి. వీటి మీద మేం ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోరు. వైసీపీ నాయకత్వం ప్రోత్సాహంతోనే ఇవన్నీ జరుగుతున్నాయి. మరీ దిగజారి వ్యవహరిస్తున్నారు' అని టీడీపీ ముఖ్యుడొకరు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్డీయేను బలపరచండి!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. సుమారు గంటపాటు చర్చించుకున్నారు. దేశ వ్యాప్తంగా ఎన్డీయేను బలోపేతం చేస్తున్నామని, దేశాన్ని బలోపేతం చేయాలంటే అన్ని ప్రాంతాల్లో తమ కూటమి అవసరమని అమిత్ షా పేర్కొన్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో కూడా పలు పార్టీలు బీజేపీ వైపు చూస్తున్నాయని, ఈసారి 400 సీట్లకు పైగా విజయం సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నామని ఆయన చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ - తెలుగుదేశం పొత్తు కుదిరితే బీజేపీ గెలిచే అవకాశాలున్న సీట్ల గురించి కూడా అమిత్ షా ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్రంలో జగన్ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తమకు సమాచారం అందిందని కూడా చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో గతంలో ఎన్డీయేను బలోపేతం చేసినట్లుగానే... ఇప్పుడూ సహకరించాలని చంద్రబాబును అమిత్‌షా కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: బాబు

అమిత్‌షాతో భేటీకి ముందు చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీకి దేశప్రయోజనాలు ముఖ్యమైతే... తెలుగుదేశానికి రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకునే తాము నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో వెనక్కు పోయిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కొద్ది నెలల క్రితం అమిత్ షా తనతో మాట్లాడారని, ఇప్పుడు మళ్లీ కబురు పంపారని చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ తదితరులు చంద్రబాబుతో చర్చలు జరిపారు. వైసీపీ ఎంపీలు లావు కృష్ణదేవరాయలు, రఘురామకృష్ణం రాజు కూడా చంద్రబాబుతో చర్చించారు. చంద్రబాబు ఢిల్లీ వచ్చిన సంగతి తెలుసుకుని రాష్ట్రంలో టిక్కెట్లు ఆశిస్తున్న పలువురు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వచ్చి ఆయనను కలుసుకునేందుకు ప్రయత్నించారు.

బెరైటీస్ టెండర్.. పాయె!

» బిడ్లు దాఖలు చేయని కంపెనీలు

» ఎన్నికల ముందు వద్దని గగ్గోలు

» ప్రభుత్వం మారితే డిపాజిట్లు నష్టపోతామని ఆందోళన

» మళ్లీ జగన్ సర్కారే వస్తుందని ఓ ఉన్నతాధికారి భరోసా

» అయినా నమ్మకం కలగని కంపెనీలు

» విఫలమైన అధికారుల బుజ్జగింపులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బెరైటీస్ టెండర్లలో సర్కారుకు కాంట్రాక్టు కంపెనీలు షాక్ ఇచ్చాయి. బుజ్జగింపులు పని చేయలేదు. ఒక కంపెనీ రూ.29.50 లక్షలు పెట్టి టెండర్ డాక్యుమెంట్ కొనుగోలు చేసినా.. చివరి నిమిషంలో బిడ్ మాత్రం దాఖలు చేయలేదు. బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) అధికారులు తీక్షణంగా ఎదురు చూసినా ఒక్క కంపెనీ కూడా టెండర్ వేయలేదు. దీంతో అధికారులు హతాశులయ్యారు. నిజానికి ఇలా జరగబోతుందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఎన్నికల సమయంలో టెండర్లు నిర్వహిస్తే తమకు ఇబ్బందులు వస్తాయని జనవరి 31న జరిగిన ప్రీబిడ్ మీటింగ్‌లోనే కాంట్రాక్టర్లు గగ్గోలు పెట్టారు. అకారణంగా నష్టపోవడానికి సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. ఎన్నికల తర్వాత టెండర్లు నిర్వహించాలని మరి కొన్ని కంపెనీలు సూచించాయి. పరిస్థితిని గమనించిన అధికారులు కొన్ని కంపెనీలు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులకు ఫోన్‌లుచేసి బిడ్డింగ్‌లో పాల్గొనాలని బుజ్జగించాయి. కానీ.. ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ టెండర్‌లో పాల్గొనేందుకు డాక్యుమెంట్ ఫీజు (18 శాతం జీఎస్టీతో కలిపి) రూ.29.50 లక్షలు. బిడ్ సెక్యూరిటీ కింద కాంట్రాక్టర్ రూ.90 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాలి. ఇదికాకుండా కోటి టన్నులను కేవలం ఐదేళ్ల వ్యవధిలోనే మైనింగ్ యార్డ్ నుంచి తరలించి అమ్మేయాలని టెండర్‌లో నిబంధనలు విధించారు. వీటిపై కాంట్రాక్టర్లు తొలి నుంచీ అభ్యంతరం చెబుతున్నారు. ఎన్నికల ముందు టెండర్ నిర్వహిస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం మారితే దీన్ని కొనసాగిస్తారన్న గ్యారంటీ లేదని కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం వచ్చి తమ డిపాజిట్‌లను ఫ్రీజ్ (నిలుపుదల) చేస్తే ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతింటామని ఆందోళనగా ఉన్నాయి. మళ్లీ జగన్ సర్కారే వస్తుందని గనుల శాఖ ఉన్నతాధికారి భరోసా ఇచ్చిన కంపెనీల్లో నమ్మకం కలగలేదు. ఇంత జరిగినా ముందడుగే వేయాలని సర్కారు భావిస్తే రెండోసారి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది.

నా కొ.., నీ అంతు చూస్తా

» జయరాం అన్ననే విమర్శిస్తావా?.. ఆ రోజే నిన్ను నరికేస్తే బాగుండేది

» వైసీపీ దళిత జడ్పీటీసీపై మంత్రి సోదరుడి చిందులు



నారాయణ స్వామి



జడ్పీటీసీ దొరబాబు

ఆలూరు, ఫిబ్రవరి 7: 'రేయ్ ల.. కొ..! జయరాం అన్న గురించి మాట్లాడేంత వాడివయ్యావా.. నా కొ..! రెండు నెలలు ఆగు నీ అంతు చూస్తా. ఆ రోజే నిన్ను నరికించి ఉంటే బాగుండేది'.. ఓ దళిత జడ్పీటీసీ సభ్యుడిపై మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడి బూతుపురాణం ఇది. మంత్రిని విమర్శించారనే కోపంతో ఫోన్ చేసి బండ బూతులు తిడుతూ చిందులు తొక్కారు. రెండు రోజుల క్రితం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండల కేంద్రంలో వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి ఆధ్వర్యంలో ఓ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఆస్పరి జడ్పీటీసీ దొరబాబు మాట్లాడుతూ.. గతంలో పాలకులు కార్యకర్తలను విస్మరించారని, అలాంటి ధోరణి ఇప్పుడు ఉండకూడదంటూ మంత్రి జయరాంను ఉద్దేశించి అన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి.. దొరబాబుకు ఫోన్ చేసి బెదిరించారు. ప్రస్తుతం ఈ ఆడియో టేప్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య ఆరా తీశారు. దొరబాబుతో మాట్లాడారు. నారాయణస్వామి, దొరబాబు మధ్య సంభాషణ ఇదీ..

నారాయణస్వామి: ఏ దొరబాబు.. నిన్న స్టేజిలో అన్న గురించి ఏమి కూత కూశావు?

దొరబాబు: నేనే మాట్లాడాను.. చెప్పు.

స్వామి: నీవేం మాట్లాడావో నీకు తెలియదా?

దొరబాబు: రికార్డు తెచ్చుకొని చూడు.

స్వామి: మంత్రి గురించి మాట్లాడేంత వాడివయ్యావా నా కొ..!

దొరబాబు: మర్యాదగా మాట్లాడితే బావుంటుంది. దళిత వర్గానికి చెందిన జడ్పీటీసీని ఇలా మాట్లాడతావా?

స్వామి: మాట్లాడుతారా.. నా కొ..! ఆరోజే నిన్ను బీజీగేరి పాండుతో నరికించి ఉంటే బాగుండేది.

దొరబాబు: నరికించు చూద్దాం.. మాది కూడా 23 జిల్లాలకు మంత్రిగా చేసిన కుటుంబం.

నారాయణస్వామి: కొ.. ఇంకోసారి మాట్లాడావా.. ఉంటుంది చూడు..

దొరబాబు: ఏం చేస్తావు? నీ సొమ్ము, నీ ఆస్తి తినలేదు. చంపుతావా..? చంపు.. నేనేమీ గాజులు తొడుక్కోలేదు.. మాకూ ఉన్నారు అన్నదమ్ములు.

నారాయణస్వామి: రెండు నెలలు ఆగు.. నీ అంతు చూస్తా..

దొరబాబు: చూద్దాం.. వైసీపీ టికెట్ వచ్చిన వాళ్ల మీద చూపించు నీ ప్రతాపం. దళితుడైన నాపైన చూపిస్తావా..? అదే బీసీలను తిట్టు చూద్దాం.. నీ నుంచే ఆలూరు తాలుకా సర్వనాశనమైంది.

నారాయణస్వామి : లే.. కొ.. ఇంకోసారి జయరాం అన్న గురించి కాని, మా కుటుంబం గురించి కాని మాట్లాడితే బాగుండదు.

సీఎంవోకు మంత్రులు, సిటింగ్‌ల క్యూ

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొందరు రాష్ట్ర మంత్రులు, వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేలు తాడేపల్లి సీఎం కార్యాలయానికి క్యూకట్టారు. ఏడో జాబితాపై సీఎం జగన్ కసరత్తు కొనసాగుతుండడం, విడుదల చేసిన ఆరు జాబితాల్లోనూ కొందరి పేర్లను మారుస్తారన్న వార్తలు వ్యాపించడం నేపథ్యంలో టికెట్లపై స్పష్టత కోసం పలువురు తరలివస్తున్నారు. బుధవారం వచ్చినవారిలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన వేణు, అనంతపురం, బొబ్బిలి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, శంబంగి చిన అప్పలనాయుడు, శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, ఇషాక్ ఉన్నారు. వీరంతా సీఎంవో కీలక అధికారి ధనుంజయరెడ్డితో చర్చించారు. దళిత డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కూడా.. రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మితో సీఎంవోకు వచ్చారు.



బైబై జగన్ ప్లకార్డులతో అసెంబ్లీకి పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు

10 మంది టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం నాటి సీనే బుధవారం కూడా రిపీట్ అయింది. పది మంది టీడీపీ ఎమ్మెల్యేలను స్పీకర్ తమ్మినేని సీతారాం సస్పెండ్ చేశారు. ఉదయం సభ ప్రారంభం కాగానే రైతు సమస్యలపై టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. దీంతో టీడీపీ సభ్యులు సభలో నిరసనకు దిగారు. పోడియంపైకి వెళ్లి ఆందోళన చేపట్టారు. 'బైబై జగన్' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ.. కాగితాలను చించి విసిరేశారు. పోలవరం ప్రాజెక్టును కట్టలేని అసమర్థ ప్రభుత్వం.. కౌలు రైతులను, క్రాప్ ఇన్సూరెన్స్‌లను మర్చిపోయి.. క్రాప్ హాలిడే ఇస్తున్న ప్రభుత్వం.. ధాన్యం కొనుగోళ్లు, ఆక్వా రైతులను మోసం చేసిన జగన్‌రెడ్డి అప్పుల అప్పారావు.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. టీడీపీ సభ్యుల నిరసన, నినాదాల మధ్యే మూడు బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. అప్పటికీ టీడీపీ సభ్యులు తమ నిరసనను కొనసాగిస్తుండటంతో వారిపై చర్యలు తీసుకోవాలని సభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రతిపాదించారు. పది మంది ఎమ్మెల్యేలను సభ నుంచి ఒకరోజు సస్పెండ్ చేసినట్లు స్పీకర్ ప్రకటించారు. మార్షల్స్ వచ్చి వారిని బలవంతంగా సభ నుంచి బయటకు తీసుకువెళ్లారు. రైతులను ఆదుకోని ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ శాసనమండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం సభ ప్రారంభంకాగానే రైతాంగ సమస్యలపై చర్చించాలంటూ టీడీపీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, రాంభూపాల్‌రెడ్డి, బీటీ నాయుడు తదితరులు వాయిదా తీర్మానం ఇచ్చారు. దీన్ని తిరస్కరిస్తున్నట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. దీంతో టీడీపీ సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. కాగా, మండలిలో ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రవేశపెట్టారు. ఇంకోవైపు.. ఏపీ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాటర్న్ పే స్ట్రక్చర్ చట్టం 1994కి సవరణ బిల్లును ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఎన్ఎంఆర్/డెయిలీ వేజ్ వర్కర్లు తమను రెగ్యులరైజ్ చేయమని గాని, రెగ్యులరైజేషన్‌కి ముందు కాలానికి కూడా పెన్షన్ ఇవ్వమనిగాని కింది కోర్టులకు వెళ్లడానికి అవకాశం లేకుండా ఈ సవరణ ప్రతిపాదించింది.

రైతు ఆత్మహత్యలకు జగనే కారకుడు

» అన్నదాత అప్పులకూ బాధ్యుడే... అసెంబ్లీ వద్ద టీడీపీ సభ్యుల నిరసన

అమరావతి(ఆంధ్రజ్యోతి), తుళ్లూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో కరువుకాటకాలపై జగన్ సర్కార్ నిర్లక్ష్య వైఖరిని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తూర్పారపట్టారు. మూడో రోజు బుధవారం టీడీపీ సభ్యులు ఆకుపచ్చని కండువాలు ధరించి, అమరావతి అసెంబ్లీ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'కరువు కాటకాల్లో రైతన్న - కరెన్సీ కట్టల లెక్కల్లో జలగన్న' అనే బ్యానర్‌ని ప్రదర్శించారు. 'నాడు సోమవారం పోలవరం - నేడు ప్రశ్నార్థకం, ఒట్టిపోయిన డ్రిప్ ఇరిగేషన్, కౌలు రైతులకు రుణాలేవీ?' అనే ప్లకార్డులను టీడీఎల్పీ ఉపనేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి, రామానాయుడు, ఇతర సభ్యులు అసెంబ్లీ హాలు వరకూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, రైతు వ్యతిరేకి జగన్. రైతుల ఆత్మహత్యలకు కారకుడు, రైతుల అప్పులకు బాధ్యుడు జగన్. ధాన్యానికి మద్దతు ధర కల్పించని సీఎం.. ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ దూరం చేశాడు. సాగునీటి ప్రాజెక్టుల షట్టర్లకు గ్రీజు పూయని సీఎం.. పంట బీమా రైతులందరికీ లేకుండా చేశాడు' అని ఎద్దేవా చేశారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆత్మస్తుతి, పరనింద తప్ప ప్రజలకు, రాష్ట్రానికి కొత్తగా ఒరిగిందేమీ లేదని టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవిరావు విమర్శించారు.

ఎన్నికల కరపత్రంలా బడ్జెట్: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎన్నికల కరపత్రంలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. ఈ బడ్జెట్‌లో అన్నీ తప్పుడు లెక్కలే ఉన్నాయని, నమ్మదగిన సమాచారం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దేనికి 'సిద్ధం' సార్?

» హోదాను మళ్లీ మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడానికా?

» ఇంకో 8 లక్షల కోట్ల అప్పు చేయడానికా?

» లిక్కర్, మైనింగ్ మాఫియా కోసమా?

» బాపట్ల సభలో సీఎం జగన్‌పై షర్మిల ఫైర్





బాపట్లలో జరిగిన సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల; హాజరైన జనం

బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'మళ్లీ 8 లక్షల కోట్లు అప్పులు చేయడానికా.. బీజేపీతో అక్రమ దోస్తీ కోసమా...ప్రత్యేక హోదాను మరొక్కసారి మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడానికా.. మద్యపాన నిషేధం అని ఇంకోసారి మోసానికా.. 25 లక్షల మంది పేదలకు ఇళ్లు కడతానని చెప్పి వంచించడానికా.. ఇసుక, లిక్కర్, మైనింగ్ మాఫియా కోసమా.. దేనికి సిద్ధం జగన్ సార్..' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. వీటన్నిటికీ మీరు సిద్ధమైతే.. ప్రజలు కూడా విమ్మల్ని ఇంటికి పంపించడానికి ఇప్పటికే సిద్ధపడ్డారని స్పష్టం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం బాపట్ల బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం జాబ్ కేలెండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్ ఈ ఐదేళ్లలో ఎన్ని కేలెండర్లు విడుదల చేశారని ప్రశ్నించారు. '19 లక్షల మంది విద్యార్థులను నిరుద్యోగులుగా తయారు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది. ఒక్క గ్రూప్-1 ఉద్యోగమైనా భర్తీ చేశారా? ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక హోదా తేలేదు. కానీ స్పెషల్ స్టేటస్ మందు మాత్రం తెచ్చారు. ఏదో బూమ్ బూమ్ అంట.. ఎక్కడ చూసినా సర్కారీ మద్యమే ఏరులై పారుతోంది. ఆ కొనే మందుకు కూడా కార్డ్ పేమెంట్ లేదు. అంతా క్యాష్ పేమెంటే. అధికారంలోకి రాక ముందు హోదా కోసం నిరాహార దీక్షలు చేసిన జగన్.. అందరం మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని కూడా ప్రకటించారు. ఈ ఐదేళ్లలో ఎంత మంది రాజీనామాలు చేశారు? హోదా కోసం ఒక్కసారైనా మోదీని నిలదీశారా' అని ప్రశ్నించారు. జగన్ 8 లక్షల కోట్లు అప్పులు చేసినప్పటికీ ప్రస్తుతం రాష్ట్రం పరిస్థితి బీడీ బిచ్చం, కల్లు ఉద్దెర అన్న చందాన తయారయిందని ఎద్దేవా చేశారు. ఇన్ని లక్షల కోట్లు అప్పులు చేసినప్పటికీ రాజధాని కట్టడానికి, పోలవరం నిర్మించడానికి దేనికీ డబ్బుల్లేవన్నారు. ఐదేళ్లలో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేయడం తప్ప ఏం పీకారని మండిపడ్డారు. 'రాజశేఖరరెడ్డిది ఎన్ని కష్టనష్టాలొచ్చినా.. ఇచ్చిన మాట మీద నిలబడే వ్యక్తిత్వం. జగన్ మాత్రం ప్రతి అంశంలో మడమ తిప్పారు. పోలవరం, రాజధాని, మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా ఇలా ప్రతి ఒక్క విషయంలో మాట తప్పిన ఘనత జగన్‌ది. రాజశేఖర రెడ్డి ప్రజల మధ్యన ఉండేవారని, కానీ జగన్ పెద్ద పెద్ద కోటల్లో ఉంటూ పరదాలు కట్టుకుని తిరుగుతున్నారు' అని ధ్వజమెత్తారు.

జగన్, చంద్రబాబుకు షర్మిల లేఖ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక హోదా, విభజన హామీలపై శాసన సభ, మండలిలో ప్రత్యేక చర్చ జరపండి. ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలని ఉభయ సభల్లో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపండి' అని షర్మిల విజ్ఞప్తి చేశారు. ఆమేరకు బుధవారం సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబుకు విడివిడిగా లేఖలు రాశారు.

భద్రత ఇవ్వలేదంటే నా చెడు కోరుకున్నట్లే!

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షాల నేతలకు రక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. పీసీసీ అధ్యక్షురాలి హోదాలో నేను రాష్ట్రమంతా పర్యటిస్తుంటే ప్రభుత్వం భద్రత కల్పించలేదు. అంటే నా చెడు కోరుకుంటున్నారనే అర్థం' అని షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చాక ఆమె మాట్లాడారు. మహిళ అనీ చూడకుండా భద్రత కల్పించడం లేదని.. అడిగినా ఇవ్వడం లేదంటే ఈప్రజాస్వామ్యం మీద ఉన్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న వారికి భద్రత ఉంటే సరిపోతుందా అని నిలదీశారు. అయినా బాపట్లలో ఆమెకు నామమాత్రంగానే భద్రత కల్పించారు. పార్టీ తరఫున వచ్చిన ప్రైవేటు వలంటీర్లు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ఆమెకు రక్షణగా నిలబడ్డారు.

ప్రస్తుత పథకాలన్నీ కొనసాగిస్తాం

» జగన్ అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు

» బీమా చెక్కుల పంపిణీలో పవన్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'జనసేన-టీడీపీ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని సీఎం జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఒక్క పథకం కూడా ఆగదు. జనసేన-టీడీపీ ప్రభుత్వంలోనూ ప్రస్తుత పథకాలన్నీ కొనసాగుతాయి. అవసరమైతే పది రూపాయలు అదనంగా ఇస్తాం తప్ప, ఇప్పుడున్న ఏ పథకాన్నీ నిలిపేసేది లేదు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రమాదాల్లో చనిపోయిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుల కుటుంబాలకు పార్టీ నుంచి బీమా సాయాన్ని బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ప్రజలు కష్టాల్లో ఉంటే నా వ్యక్తిగత సంపాదన పంచే మనస్తత్వం ఉన్నవాడిని. ప్రజలు కట్టిన పన్నులు, ప్రజాధనం ఇంకెంత ఉదారంగా అందిస్తామో అర్థం చేసుకోవాలి' అన్నారు. స్వయం శక్తితో దేశానికే ఆదర్శంగా నిలిచిన డ్వాక్రా మహిళల రుణాలను రద్దు చేసి ప్రోత్సహించే విషయం తమ దృష్టిలో ఉందన్నారు. వారి రుణాల మాఫీ అంశాన్ని అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. 'నేను సినిమాలు చేసి కష్టార్జితాన్ని పార్టీ కోసం వెచ్చిస్తున్నాను. కష్టంలో ఉన్న జనసేన కుటుంబ సభ్యులకు అండగా నిలవడం బాధ్యతగా భావిస్తాను. క్రియాశీల సభ్యుల పిల్లలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి, వారి చదువులపై దృష్టి పెట్టాలని ఆలోచన చేస్తున్నాం. మార్చి చివరి నాటికి క్రియాశీల సభ్యుల బీమా గడువు తీరిపోతుంది. అన్ని బీమాలను వెంటనే రెన్యువల్ చేయాల్సి ఉంది. ఆ సమయానికి జనసైనికులు ఎన్నికల హడావుడిలో ఉంటారు. అందుకే బీమా రెన్యువల్‌ను మూడు నెలలకు పొడిగించాం. దానికి సంబంధించిన సొమ్మును నా వ్యక్తిగత సంపాదన నుంచే రూ.3.5 కోట్లు చెల్లించాను' అని పవన్ అన్నారు. పార్టీలో 6.3 లక్షల మంది క్రియాశీల సభ్యులున్నారని, 226 మంది మరణించారని, వారి కుటుంబ సభ్యులకు రూ.10.3 కోట్లు బీమా సాయం అందించామని పీఏసీ చైర్మన్ మనోహర్ వివరించారు. బుధవారం 20 కుటుంబాలకు రూ.కోటి బీమా సాయం అందించినట్లు తెలిపారు.

'ఉద్యోగుల'పై ఉత్తుత్తి కబుర్లు

(మొదటి పేజీ తరువాయి)

బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. "సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. వారి కోసం మరింత లాభదాయకమైన, స్థిరమైన ప్రత్యామ్నాయంగా హామీ పింఛను పథకాన్ని (జీపీఎస్) అమలుచేసేలా మా ప్రభుత్వం ముందడుగు వేసింది" అని చెప్పడం ఉద్యోగ వర్గాలను ఆగ్రహావేశాలకు గురిచేస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలలే గడువు ఉండగా ప్రభుత్వం నుంచి ఇటువంటి ప్రకటన రావడంపై వారంతా మండిపడుతున్నారు. జగన్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమం గురించి ఎడాపెడా ఏకరువు పెట్టింది. 11వ వేతన సంఘం సిఫారసులను పూర్తిగా అమలు చేశామని ఆ ప్రసంగంలో సెలవిచ్చారు. కానీ, 11వ పీఆర్సీకి సంబంధించి ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలు, డీఏ ఎరియర్స్ తదితర చెల్లింపుల ఊసే కానరాలేదు. చెల్లింపులు ఎప్పుడు చేస్తారనే ప్రస్తావనా లేదు. కానీ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడినట్లు బిల్డప్ ఇచ్చారు. గత నాలుగున్నరేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదు. రెండు నెలల్లో ఎన్నికలు జరగనుండడంతో హడావుడిగా అరకొరగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి జగన్ ప్రభుత్వం చేతులు దులుపుకొంది. జగన్ పాలనలో ఉద్యోగులకు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీన వేతనాలు పడతాయో కూడా తెలియనిపరిస్థితి నెలకొంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామన్నారు. ఇప్పటికీ వారికి న్యాయం జరగలేదు.

ఇచ్చింది 23%.. చెప్పేది 27%

» ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం విమర్శ

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇచ్చినట్టు బడ్జెట్ ప్రసంగంలో చెప్పడం సిగ్గు చేటని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.పార్థసారథి విమర్శించారు. ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ఇస్తామని ప్రకటించి, ఆ తర్వాత గత ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం కంటే కూడా మరో రెండు శాతం తగ్గించి 23 శాతం చేశారని ఆయన ఒక ప్రకటనలో ఆక్షేపించారు. తర్వాత అయినా 23 శాతానికి తగ్గించామని చెప్పలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో సీపీఎస్ ఉద్యోగుల పోరాటం ఫలితంగా గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్‌ను సాధించుకున్నామని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఓపీఎస్‌కు ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

ఓట్ల అక్రమాలకు అధికారుల సహకారం

» సీఈవోకి ఎంఏ షరీఫ్ ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఓట్ల అక్రమాలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, మంగళగిరి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జీవీ రాంప్రసాద్, భీమడోలు మండల బూత్ లెవల్ ఆఫీసర్లపై ఈమేరకు షరీఫ్ ఫిర్యాదు చేశారు. ప్రభాకర్‌రెడ్డి వైసీపీ ఎమ్మెల్యేల సూచనల మేరకు ఎంపీడీవోల పోస్టింగులు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రెవెన్యూ లోటు 24,758 కోట్లేనంట

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికే రెవెన్యూ లోటు రూ.49,996 కోట్లకు చేరింది. మార్చి నాటికి ఇది మరింత పెరుగుతుంది. అందులో కనీసం సగం లోటును కూడా తాజా బడ్జెట్లో వేయలేదు. రెవెన్యూ లోటు కేవలం 24,758 కోట్లుగా చూపించారు.

ఏపీ బడ్జెట్ 2024-25

నేను అరగంట మంత్రిని బుగ్గన గంట మంత్రి: అమర్నాథ్

శాసనమండలిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రవేశపెట్టారు. ఉదయం 11గంటలకు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించి 11.37కే పూర్తిచేశారు. 'ఇంత తొందరగా ఎలా బడ్జెట్‌ను చదివేశారు' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... 'కుర్రాళ్లం కదా స్పీడు ఎక్కువ. నేను అరగంట మంత్రిని. ఆయన (బుగ్గనను ఉద్దేశించి) గంట మంత్రి' అని వ్యాఖ్యానించారు.



కోరం లేక పరుగులు.. శాసనసభలో ఆసక్తికర పరిణామం


శాసనసభలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఉదయం 9గంటలకు సభ ప్రారంభించడానికి బెల్ మోగించారు. ఆ సమయానికి సభలో అధికార పక్షం ఎమ్మెల్యేల కుర్చీలన్నీ దాదాపుగా ఖాళీగా ఉన్నాయి. సభ నిర్వహణకు అవసరమైన కోరం లేనందున సభ వాయిదా వేయాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలు వెళ్లిపోయారు. సభలో ఉన్న ఎమ్మెల్యేలను లెక్కించగా 14మంది ఉన్నారు. సభ ప్రారంభించడానికి 18మంది అవసరం. దీంతో చీఫ్ విప్ ప్రసాదరాజు హడావుడిగా బయట ఉన్న ఎమ్మెల్యేలను లోపలకు పంపించారు. తర్వాత అసెంబ్లీ అధికారులు హెడ్‌కౌంట్ నిర్వహించగా 18 మందికి పైగా ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో 9.03 గంటలకు స్పీకరు వచ్చి సభను ప్రారంభించారు.

అప్పు చేసి చిప్పకూడు!



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం ఢమాల్! అప్పులపై అంతగా ఆధారపడిపోయిన సర్కారు ఇది. సరైన, సమర్థ పాలనలో ఏటా ఆదాయం పెరుగుతూ రావాలి. అభివృద్ధి జరగాలి. అప్పులు తగ్గాలి. కానీ, రాష్ట్రంలో అంతా రివర్స్. ఆదాయం అంచనాల్లో మాత్రమే పెరుగుతుంది. అప్పులు మాత్రం అంచనాలు దాటేస్తాయి. అభివృద్ధి ఎక్కడా కనిపించదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్‌లోనూ ఆదాయం పెంచి చూపించారు. ఎందుకంటే... అప్పులు తగ్గించి చూపాలి కాబట్టి! ఈ రెండూ చేస్తేనే రెవెన్యూ లోటు తగ్గించి చూపించగలరు. రెవెన్యూ లోటు తగ్గించి చూపిస్తేనే... భారీగా అప్పులు తెచ్చుకోగలరు. ఇదీ... జగన్ ఆర్థిక ప్రణాళిక! వైసీపీ సర్కారు ధ్యేయం ఒక్కటే! తప్పులు చేసైనా అప్పులు తేవడం! రాష్ట్రాన్ని రివర్స్ గేర్‌లో నడపడం!



అంచనాలకే ఆదాయం....

అద్దంలో చందమామను చూసి మురిసినట్లుగా... జగన్ సర్కారు హయాంలో ఆదాయం పెరుగుదలను కేవలం బడ్జెట్ అంచనాల్లోచూసి మురిసిపోవడమే! ఈసారి రూ.2,05,352 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. గత ఆర్థికసంవత్సరంలో రూ.1,57,768కోట్ల ఆదాయం రాగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు రూ.1,19,125 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అంటే... సగటున నెలకు 13,236కోట్లు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.39,708కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అంటే మొత్తం ఆదాయం రూ.1,58,833 కోట్లు. ఇది సవరించిన అంచనాల కంటే రూ.37,869 కోట్లు తక్కువ. బడ్జెట్ అంచనాల ప్రకారం చూస్తే రూ.47,869 కోట్లు తక్కువ. ఇదీ ప్రస్తుత పరిస్థితి. మరి... కొత్తగా ఏం సాధించారని, ఏ రూపంలో సాధిస్తారని ఏకంగా రూ.2,05,352కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్లు? ఇది... రూ.40వేల కోట్లదాకా తప్పుల అప్పులు తెస్తామని పరోక్షంగా చెప్పడమే! ఈ బడ్జెట్లో దాదాపు రూ.40,000కోట్ల లేని రాని ఆదాయాన్ని చూపించారు. తర్వాత ఆ రూ.40,000 కోట్లను అప్పు రూపంలో తీసుకొస్తారు. ఐదేళ్లుగా వైసీపీ సర్కారు అనుసరిస్తున్న ప్లాన్ ఇదే!

అప్పులు పెరిగాయి.. కానీ వడ్డీ తగ్గిందంట!

అప్పులే కాదు... వడ్డీ లెక్కలూ తప్పులే! వారం వారం అప్పులు తెస్తూ పోతుంటే... వడ్డీల భారం తగ్గుతుందా? పెరుగుతుందా? కచ్చితంగా పెరుగుతుంది. కానీ... జగన్ సర్కారు దీనిపైనా రివర్స్ లెక్కలే వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీల కింద రూ.28,673 కోట్లు చెల్లిస్తున్నట్లు రాశారు. కానీ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం వడ్డీ చెల్లింపులు 28,017 కోట్లే ఉంటాయట!

అప్పుల గంతలు...

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.81,037 కోట్ల అప్పులు మాత్రమే తెస్తామని బడ్జెట్ పత్రాల్లో పేర్కొన్నారు. కానీ... ఇది వాస్తవ విరుద్ధం. ఈ ఆర్థిక సంవత్సరంలోనే అప్పులు రూ.69,000 కోట్లు అని సవరించిన అంచనాలు వేశారు. కానీ, ఇప్పటికే ప్రభుత్వం రూ.1,06,000 కోట్లకు పైగా అప్పులు చేసింది. రూ.69,000 కోట్ల అప్పుల లెక్క కేవలం ఆర్‌బీఐ నుంచి ప్రతి మంగళవారం తెచ్చే అప్పు మాత్రమే. అవి కాకుండా, కేంద్రం ఇచ్చే రుణాలు, ఈఏపీ రుణాలు, నాబార్డు లోన్లు, పబ్లిక్ అకౌంట్ నెట్ నుంచి వాడుకునే డబ్బులు, కార్పొరేషన్ల నుంచి తెచ్చే దొంగచాటు అప్పులు వీటన్నింటి వివరాలు బడ్జెట్లో చెప్పలేదు. అలాగే, 2024-25లో కేవలం 'మంగళవారం' అప్పులనేరూ.81,037 కోట్లుగా చూపించారు. ఆదాయం అంచనాలను ఎక్కువ చేసి చూపించిన రూ.40వేల కోట్లనూ వివిధ మార్గాల్లో అప్పుల ద్వారానే తెస్తారు. అంటే... మొత్తం అప్పుల అంచనా 1,21,370 కోట్ల రూపాయలు!

■ అభివృద్ధి వ్యయంపై అవే కోతలు

రాష్ట్ర అభివృద్ధికి పనికొచ్చే ఖర్చు... క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్! ఈ ఏడాదికి సవరించిన అంచనాల్లో దీనిని రూ.27,308 కోట్లుగా చూపించారు. కానీ, ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు చేసిన ఖర్చు రూ.19,202 కోట్లు మాత్రమే. ఈ లెక్క కూడా నమ్మశక్యంగా లేదు. ఏటా ఫిబ్రవరి నుంచి మార్చికల్లా సరికి కాగ్ నివేదికల్లో ప్రభుత్వం పెట్టుబడులపై చేసిన ఖర్చు తగ్గిపోతూ కనిపిస్తోంది. అలాగే, తాజా బడ్జెట్‌లో అభివృద్ధి వ్యయం పద్దులో రూ.30,530కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు. ఇదీ ఆచరణ సాధ్యంకాని మాయ లెక్కే!

■ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ లేనట్టే

రెవెన్యూ వ్యయం రూ.2,30,110 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనాకంటే ఇది రూ.1873 కోట్లు మాత్రమే అధికం. ఈ జంబో బడ్జెట్‌లో ఇది నామమాత్రం. దీని అర్థం ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిలు, పదకొండో పీఆర్సీ బకాయిలు, ఇతర పెండింగ్ బకాయిలు లేనట్టే. ఉద్యోగులకు 12వ పీఆర్సీ ఇవ్వాల్సిన సమయం దాటిపోయింది. కమిషన్ వేసిన 6 నెలలకు కార్యాలయం కోసం ఒక గది కేటాయించారు. దీనిపై ఎలాంటి తదుపరి చర్యలు లేవు. పోనీ ఐఆర్ అయినా ఇస్తారా అంటే దానికీ చాన్స్ లేదు. ఎందుకంటే రెవెన్యూ వ్యయాన్ని ప్రభుత్వం పెంచలేదు. వ్యయంలో పెరుగుదల లేదంటే ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు ఇచ్చే ఉద్దేశం లేదని అర్థమవుతోంది.

తూచ్.. ఒక్క పట్టా ఇవ్వలేదు

సభలో తడబడ్డ మంత్రి బుగ్గన

గత ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో 4.63 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా, తమ ప్రభుత్వం 2019 సంవత్సరం నుంచి రూ.1.53 లక్షల కోట్ల విలువ గల 30.65 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందని అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రకటించారు. సభలోనే ఉన్న ముఖ్యమంత్రి జగన్ సూచనతో మంత్రి తిరిగి సర్దుకున్నారు. గత ప్రభుత్వంలో ఒక్క ఇళ్ల పట్టా కూడా ఇవ్వలేదని మంత్రి సవరించి చదివారు. తడబడినా మంత్రి నిజమే చెప్పారంటూ సభలో పలువురు నవ్వుకోవడం కనిపించింది. కాగా, శాసనమండలిలో భారీ పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ బడ్జెట్ ప్రవేశపెట్టారు. 35 నిమిషాలకే ప్రసంగం పూర్తిచేసి తిరిగి అసెంబ్లీకి మంత్రి చేరుకున్నారు.

అమరావతిలో అపురూప శిల్పాలా.!

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగ పుస్తకం తొలి పేజీలోనే 'మా తెలుగు తల్లికి' గీతాన్ని ప్రచురించారు. ఈ ఐదేళ్లలో ఈ గీతం ఎక్కడా, ఎప్పుడూ వినిపించలేదు. ఎన్నికల ముందు మాత్రం ఒక్కసారిగా బడ్జెట్ పుస్తకంలో ముద్రించారు. 'తెలుగు మీడియం వద్దు.. ఆంగ్లమే కావాలి' అంటూనే 'తెలుగు తల్లి' పాట పాడటం విశేషం. ఇక... 'అమరావతినగర అపురూప శిల్పాలు' ఎక్కడున్నాయో, ఏమో! అధికారంలోకి రాగానే... జగన్ ప్రజా రాజధానిని అమరావతిని అటకెక్కించారు. అధికారంలోకి 'ప్రజా వేదిక'ను కూల్చేసి, శిథిలాలను అలా కుప్పగా పోశారు. త్యాగయ్య గొంతులో నాదాలు తారాడగా... వైసీపీ నేతల నోట్లో మాత్రం బూతులే! ఇలా... మా తెలుగు తల్లికి గీతంలో ఉన్న ప్రతి పంక్తికీ వైసీపీ పాలన విరుద్ధమే!

బుగ్గన బడ్జెట్ 'క్లాసు'

లెక్చరర్‌ను తలపించిన ఆర్థిక మంత్రి

చదవడం.. సభ్యులకు తిరిగి వినిపించడం

సూచనలకోసం సీఎం వైపు చూపులు.. సుదీర్ఘ వివరణలతో 2 గంటలకుపైగా స్పీచ్

శాసన మండలిలో 35 నిమిషాలకే ముగించిన అమర్నాథ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'హలో... వింటున్నారా! నేను చెప్పింది అర్థమవుతోందా! మళ్లీ చెబుతా వినండి'... ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బడ్జెట్ ప్రసంగం సాగిన తీరిది! బుధవారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఉదయం 11.04 నిమిషాలకు మాట్లాడటం ప్రారంభించి, 1:05 నిమిషాల దాకా అంటే, సుమారు 2:01 గంటలు సాగదీశారు. సంప్రదాయ బడ్జెట్ ప్రసంగానికి భిన్నంగా ఒక లెక్చరర్ తన విద్యార్థులకు పాఠాలు చెప్పినట్లు అసెంబ్లీలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒక పేరా చదివి, దాన్ని మళ్లీ రిపీట్ చేస్తూ పోయారు. 44 పేజీల బడ్జెట్ ప్రసంగ పాఠంలో... దాదాపు 26 పేరాలను మళ్లీ చదవడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం విసిగిపోయారు. వైసీపీకి ఉన్న బొమ్మల పిచ్చి బడ్జెట్ పుస్తకంలోనూ కనిపించింది. ఎప్పుడూ లేని విధంగా సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన బొమ్మలు అందులో ప్రచురించారు.

'చిత్రాలు' చూపించారు...

బడ్జెట్ సమర్పణలో 'చిత్ర' విచిత్రాలు చేశారు. పథకాల లబ్ధిదారులు జగన్‌ను ప్రశంసిస్తున్న దృశ్యాలను అసెంబ్లీలో ప్రదర్శించారు. ప్రసంగం ఆసాంతం సీఎం సూచనలు స్వీకరించడం, సవరించడం విశేషం. ప్రతిపక్షనేత సభలో లేకున్నా... కుప్పం ప్రస్తావన వచ్చినప్పుడల్లా కావాలని ప్రతిపక్ష నేత ఉండి ఉంటే బాగుండేది... కుప్పంలో అది చేశాం, ఇది చేశామంటూ బుగ్గన ప్రసంగించారు. విద్యా విషయాలపై చదివేటప్పుడు విద్యాశాఖ మంత్రి ఉన్నారా? అని వాకబు చేయడం, నాడు-నేడు గురించి పదే పదే చెప్పి కొందరు సభ్యుల చేత చప్పట్లు కొట్టించుకోవడం కనిపించింది. సభలో సీఎం ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలు పిచ్చాపాటి మాట్లాడుకోవడం కనిపించింది. బడ్జెట్ గురించి పెద్దగా పట్టించుకోలేదు. అయితే పదేపదే బుగ్గన అలెర్ట్ చేయడం, సీఎం సభలో ఉండటంతో ప్రసంగం పూర్తి అయ్యేదాకా ఓపికగా కూర్చున్నారు.

పథకాలపై పదేపదే అబద్ధాలు..

కొన్ని పథకాల గురించి బడ్జెట్ ప్రసంగంలో అవాస్తవాలను నొక్కి మరీ గొప్పగా చెప్పుకొన్నారు. విదేశీ విద్యకు సంబంధించి ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 1858 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చిందని బడ్జెట్ పుస్తకంలో ప్రచురించారు. అయితే వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే... ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్నెల్లకోసారి చొప్పున మూడు సార్లుగా ఇప్పటికి విదేశీ విద్య మంజూరుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సంబంధించి మొత్తం కలిపినా 200 మందికి మించి లబ్ధిదారులు లేరు. నైపుణ్యాభివృద్ధి గురించి మాట్లాడుతూ తాము సరళంగా ఈ పథకం చేపట్టామని, గత ప్రభుత్వం హైప్రొఫైల్‌లో చేసి కేసుల్లో చిక్కుకున్నారని వ్యాఖ్యానించారు. తాము పేదరికంపై యుద్ధం చేస్తే, చంద్రబాబు ప్రభుత్వంలో దోమలపై దండయాత్ర చేశారంటూ ఎద్దేవా చేశారు. పెన్షన్ కానుక అమలులోని లోపాలను కప్పిపెట్టారు. చెరువుల అనుసంధాన ప్రాజెక్టును ప్రారంభించినట్లు చెప్తూ... పత్తికొండ శాసనసభ్యురాలు ఎక్కడ అంటూ ప్రస్తావించారు. నెల్లూరు జిల్లా ప్రాజెక్టుల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఆయా ఎమ్మెల్యేల గురించి ఆరా తీశారు. పైలట్ విధానంలో కొనసాగిన భూసర్వే చేపట్టిన గ్రామాల్లో రైతులు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎటూ ఈ సారి రాదు, వచ్చే ప్రభుత్వంలోనైనా సర్వే సక్రమంగా జరుగుతుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. అలాంటి భూసర్వే గురించి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కువ సమయం కేటాయించడంపై విమర్శలు వచ్చాయి. ఉద్యోగుల సంక్షేమం గురించి కూడా ప్రసంగంలో అవాస్తవాలు చోటుచేసుకోవడంతో ఉద్యోగులు నవ్వుకుంటున్నారు. ప్రతి అంశాన్ని టీడీపీతో పోల్చడం, దానిని నొక్కి చదవడం, సీఎం ప్రతిస్పందన కోసం బుగ్గన ఎదురుచూడటం... బడ్జెట్ ప్రసంగం ఆసాంతం ఇదే ధోరణి సాగింది. కొన్ని అంశాల్లో బడ్జెట్ ప్రసంగంలో తప్పులు దొర్లినట్లు సీఎం గుర్తించి చెప్పడం, అవి సరిచేసి ఆర్థికమంత్రి చదవడం జరిగింది.

బడ్జెట్ సమగ్ర స్వరూపం

వివరం	2022-23	2023-24 (బ.అం)	2023-24 (స.అం)	2024-25 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,57,768	2,06,224	1,96,703	2,05,352
ఎ)పన్ను ఆదాయం	78,089	1,02,651	95,757	1,09,538
బి) పన్నేతర ఆదాయం	5,417	15,400	10,500	14,400
సి) కేంద్ర పన్నుల్లో వాటా	38,113	41,338	44,642	49,287
డి) గ్రాంట్లు	36,149	46,835	45,804	32,127
2) మూలధన వసూళ్లు	68,085	73,055	78,573	81,037
3) మొత్తం వసూళ్లు	2,25,853	2,79,279	2,75,276	2,86,389
4) రెవెన్యూ వ్యయం	2,01,255	2,28,541	2,28,237	2,30,110
5) మూలధన వ్యయం	7,244	31,061	27,308	30,530
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	17,343	19,677	19,738	25,749
7) మొత్తం వ్యయం	2,25,842	2,79,279	2,75,276	2,86,389
8) రెవెన్యూ లోటు	-43,487	(-)22,316	(-)31,534	(-)24,758

బ.అం.- బడ్జెట్ అంచనా స.అం.- సవరించిన అంచనా (అంకెలు రూ. కోట్లలో)

సుపరిపాలన ఇచ్చాం

ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రసంగం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వినూత్న పరిపాలనా ఆవిష్కరణలు, సుపరిపాలిత ఆంధ్రా, పాలనా వికేంద్రీకరణ, గడప వద్దకే ప్రభుత్వం తదితర కార్యక్రమాలతో ఐదేళ్లకాలంలో రాష్ట్రానికి సుపరిపాలన అందించామని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం వెలగపూడి అసెంబ్లీ సమావేశంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు బుగ్గన ప్రవేశపెట్టారు. బుగ్గన తన బడ్జెట్ పాఠాన్ని సుపరిపాలిత ఆంధ్ర, సమర్థ ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమ ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, భూభద్ర ఆంధ్ర అంటూ ఏడు అంశాలుగా విభజించారు. "పాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలు, పోలీసు వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించాం. స్థానికసంస్థలను బలోపేతంచేశాం. స్థానిక సంస్థలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికే ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశాం. అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అందరికీ నాణ్యమైన విద్య అందిస్తున్నాం. 43.61 లక్షల మంది మహిళా మహారాణులకు ఈ పథకం కింద రూ.26,067 కోట్లు అందించాం. ఫలితంగా ప్రాథమిక విద్యాస్థాయిలో బడిలో చేరే విద్యార్థుల నికర నమోదు నిష్పత్తి 2019లో 87.80 శాతం ఉండగా, 2023 నాటికి 98.73 శాతానికి పెరిగింది. నాణ్యమైన వైద్యాన్ని అందించేదిశగా 53,126 మంది ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని నియమించాం. 2019 నుంచి వైఎస్ఆర్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద 1.60 లక్షల కౌలుదారులకు, 93 వేల అటవీ భూముల సాగుదారులతో సహా మొత్తం 53.54 లక్షల మంది రైతు ఖాతాలకు రూ.33,300 కోట్లు జమచేశాం. ఉచిత పంట బీమా కింద 54.55 లక్షల రైతుల ఖాతాలకు రూ.7802 కోట్ల బీమా మొత్తాన్ని అందించాం. సామాజిక సంక్షేమానికి పెద్దపీట వేశామని, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమం కోసం నవరత్నాల పథకాల కింద భారీ మొత్తంలో ఖర్చు చేశాం" అని బుగ్గన వివరించారు.

పొంతన లేని 'పెద్దల' ప్రస్తావన

బడ్జెట్‌లో బుగ్గన గొప్పలపై సర్వత్రా విమర్శ

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎంత మంది ఉంటే అంతమందినీ ఉద్ధరించామన్నట్టు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగం సాగింది. అయితే, సమాజంలోని ఏ వర్గమూ జగన్ ప్రభుతం పట్ల సంతృప్తిలో లేదనేది వాస్తవం. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాల ద్వారా రాష్ట్రంలో లక్షన్నర మందికి శిక్షణ, 95,000 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందని బుగ్గన అన్నారు. ఆయన ప్రసంగంలో ఇదొక్కడే వాస్తవమని, స్కిల్ ప్రగతి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చలవ అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంతకీ తన బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన ఏమన్నారు.. అసలు వాస్తవం ఏమిటనేది చూస్తే..

అబ్రహాం లింకన్ చెప్పినట్టు ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రభుత్వమని నిరూపించాం.

ప్రజల కోసం మీరేదో చేశామనే భ్రమలో ఉన్నారు. వాస్తవమేంటంటే ఈ ఐదేళ్లలో ప్రజలు వీధిన పడడం కోసం చెత్త పన్ను వేశారు, తొమ్మిది సార్లు రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచారు, ఒక్కసారి కూడా రోడ్లు వేయలేదు. కొత్త వాహనాలు కూడా గుంతల రోడ్ల దెబ్బకు ఏడాదిలోనే షెడ్డుకి వెళ్లిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పొరుగురాష్ట్రాల కంటే మనకే ఎక్కువ.

అంబేడ్కర్ ఆశయాల ప్రకారం సోదరభావాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చాం.

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్న మాట ఇది. మీకు అంత సోదరభావమే ఉంటే సీఎం జగన్ తన సోదరి షర్మిల పట్ల దానిని చూపించడం లేదు ఎందుకని?

వెనుకబడిన వర్గాల వారికి రక్షణగా నిలిచాం.

కరోనా సమయంలో మాస్కులు, గ్లౌజులు అడిగినందుకు డాక్టరు సుధాకర్‌కు చిత్రహింసలు పెట్టి చంపేయడం, మీ ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్‌ను చంపి ఇంటికే డోర్ డెలివరీ చేయడం, వైసీపీ ఏతల ఒత్తిళ్లతో తప్పుడు కేసులు పెట్టి, పోలీసులతో కొట్టించి దళిత యువకుడిని ఆత్మహత్యకు ఉసిగొల్పడం, ఇవన్నీ మీ సుపరిపాలనకు తార్కాణాలు.

కౌటిల్యుడి ఆర్థిక సూత్రాలు ప్రతిబింబించేలా..

పారిశ్రామిక రంగాన్ని పాతాళంలోకి తొక్కేసి, ప్రభుత్వ ఆస్తులు, భవనాలు తాకట్టు పెట్టి కేవలం అప్పులు, దొంగ అప్పులతోనే పరిపాలన చేయమని కౌటిల్యుడు ఎప్పుడు చెప్పాడు సార్?!

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాల ద్వారా రాష్ట్రంలో లక్షన్నర మందికి శిక్షణ, 95,000 మందికి ఉద్యోగాలు కల్పించాం.

నిజమే సార్, చంద్రబాబు చలవ

కొసమెరుపు: బడ్జెట్ ప్రసంగం పుస్తకం చివరి పేజీలో స్వామి వివేకానంద సూక్తిని రాశారు. 'మన ప్రస్తుత స్థితికి మనమే బాధ్యులం. కానీ, భవిష్యత్‌ను నిర్ణయించే శక్తి మన చేతుల్లోనే ఉంది. దానికోసం ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలి' అన్న ఆ సూక్తిని బుగ్గన చదివి వినిపించారు. ఈ పలుకుల ద్వారా ఆయన రాష్ట్రంలోని ఓటర్లకు ఏదో సందేశం ఇస్తున్నట్టుగా అనిపిస్తోంది.

కొత్త పద్ధతుల్లో అభివృద్ధి..

పరిశ్రమలను వెళ్లగొట్టడం, పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేయడం, కనిపించిన భూమి ప్రభుత్వానిదైతే తాకట్టు పెట్టడం, ప్రైవేటుదైతే కబ్జా చేయడం, అమరావతిని అడ్రస్ లేకుండా చేయడం, ఐటీ రంగాన్ని పారదోలడం.. వీటిని అభివృద్ధి అని అనుకుంటారా సార్?!

పోలీసు వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాం..

మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీఇచ్చిన వీక్లీఆఫ్ కోసం పోలీసులు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. తిరుపతి జిల్లాలో ఒక పోలీస్ స్టేషన్‌లోకి ఒక రౌడీషీటర్ వెళ్లి ఎస్సైమీద దాడి చేశాడు. అనంతపురం టౌన్‌లో వైసీపీ కార్పొరేటర్ 'సెబ్' పోలీస్‌స్టేషన్ కి వెళ్లి ఎస్సై సీట్లో కూర్చున్నాడు. మీ పాలనలో పోలీసులు ఇంత హాయిగా బతుకున్నారు సార్?!

రైతన్నకు జేజేలు..

లక్షలోపు పంటరుణాలపై సున్నావడ్డీ రీయింబర్స్‌మెంట్, గత ఏడాది పంటలబీమా పరిహారం, కరువు, మిచౌంగ్ తుఫాను ఇన్‌పుట్ సబ్సిడీ, జనవరి నెలలో రైతు భరోసా - పీఎం కిసాన్, కౌలు రైతులకు పెట్టుబడి, మూడు విడతల వడ్డీ రాయితీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఖరీఫ్‌లో 27 లక్షల ఎకరాల్లో, రబీలో 30 లక్షల ఎకరాల్లో పంట వేయలేదు. ఇలా రాస్తూ పోతే బడ్జెట్ స్పీచ్ అంత పెద్ద పుస్తకం తయారవుతుంది.


ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాం

ఐదేళ్లలో కరెంటు చార్జీలు 9 సార్లు పెంచి, రూ.64,000 కోట్లు వసూలు చేశారు. బిల్లులు చూసి భయపడే పరిస్థితి తెచ్చారు. ఇంక వెలుగులెక్కడున్నాయి?



ఆరోగ్యానికి అంతంతే!

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరంతో పోల్చితే కేవలం 11 శాతం మాత్రమే పెంచారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.17,916 కోట్లు కేటాయింపులు చేశారు. దీనిలో తొలి 4నెలలకు రూ.5972 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఆరోగ్యశాఖ పథకాలు, ఖర్చులు ఆధారంగా చూస్తే దాదాపు రూ.20 వేల కోట్లు అవసరమని నిపుణులు అంచనా. ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రసంగంలో నాడు-నేడు కింద రూ.16,852 కోట్లు ఖర్చు చేసినట్లు చూపించారు. కానీ, బోధనాసుపత్రుల్లో ఇప్పటివరకు నాడు-నేడు ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన 17 మెడికల్ కాలేజీల్లో ఇప్పటికే 10 కాలేజీలు ప్రారంభించినట్టు మంత్రి బుగ్గన గొప్పలు చెప్పారు. వాస్తవానికి 5 మెడికల్ కాలేజీల్లో మాత్రమే అడ్మిషన్లు జరిగాయి.



పర్యాటకానికి విదిలింపు

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పర్యాటక రంగం గురించి పెద్ద ఎత్తున ఉపన్యాసం దంచికొట్టినా ఆ రంగం అభివృద్ధికి, పర్యాటకులను ఆకర్షించే ప్రణాళికలకు మాత్రం ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయలేదు. రాష్ట్రం పురాతన చారిత్రక ప్రదేశాలతో అపారమైన పర్యాటక సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పిన మంత్రి బుగ్గన వాటిని అభివృద్ధి చేసేందుకు నిధులు మాత్రం కంటితుడుపుగా కేటాయించారు. ఓటాన్ అకౌంట్‌లో 4 నెలలకు గాను కేవలం రూ.38 కోట్లు విదిలించారు.



విద్యపై అంకెలగారడీ

రూ.33,898 కోట్లు కేటాయింపు

విద్యారంగంపై బడ్జెట్ కేటాయింపులు గందరగోళంగా మారాయి. 2023-24బడ్జెట్‌లో కేటాయింపులు మొత్తం ఖర్చు చేయలేక సవరణ అంచనాల్లో కేటాయింపులు తగ్గించుకున్న ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి చూపించింది. 2023-24లో విద్యారంగానికి రూ.32,198 కోట్లు కేటాయించింది. కానీ, ఖర్చులో మాత్రం విఫలమైంది. దీంతో అదే సంవత్సరానికి సవరణ అంచనాల్లో ఆ కేటాయింపులను రూ.31,363 కోట్లుగా చూపించింది. ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ కేటాయింపులు చూపించేందుకు తాజా బడ్జెట్‌లో విద్యారంగానికి 33,898 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఏడాది కేటాయింపుల్లోనే వెనక్కి తగ్గిన ప్రభుత్వం మళ్లీ ఎలా పెంచిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి.



'సాగు'కు స్పష్టత కరవు

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం అరకొర నిధులే కేటాయించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏ పథకానికి ఎంత ఖర్చు చేయనున్నారో స్పష్టం చేయలేదు. 2023-24లో రైతు సంక్షేమ పథకాలకు రూ.11,589 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రానున్న మూడు నెలల్లో ఆయా పథకాలకు ఎంతెంత ఖర్చు చేస్తారో వివరించలేదు. కాగా, 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.11,424.51 కోట్లు కేటాయించింది. తొలి 4 మాసాలకు రూ.5558.17 కోట్లు అంచనా వ్యయంగా చూపారు. మొదటి త్రైమాసికానికి పశుసంవర్ధక, మత్స్యరంగానికిరూ.619.34 కోట్లు, సహకార రంగానికి రూ.264.78 కోట్లు కేటాయించారు.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 8 ఫిబ్రవరి 2024

ఐపీఎల్‌కు పంత్ రెడీ

మెల్‌బోర్న్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాదికిపైగా క్రికెట్‌కు దూరంగా ఉన్న స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఐపీఎల్‌తో పునరాగమనం చేయాలని భావిస్తున్నాడు. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ వెల్లడించాడు. 'రాబోయే ఐపీఎల్ ఆడగలననే దృఢ సంకల్పంతో పంత్ ఉన్నాడు. కానీ బ్యాటర్‌గానే బరిలో దిగుతాడా..లేదా కీపర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తాడా అనే విషయంలో స్పష్టత లేదు' అని పాంటింగ్ తెలిపాడు. పంత్ సారథ్య బాధ్యతలు వహించలేకపోతే..గత సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన వార్నర్ ఈసారీ జట్టును నడిపిస్తాడని పాంటింగ్ వెల్లడించాడు.



వాషింగ్టన్ ఫ్రీడమ్ చీఫ్‌కోచ్‌గా పాంటింగ్

అమెరికా ఫ్రాంచైజీ క్రికెట్..మేజర్ క్రికెట్ లీగ్ జట్టు వాషింగ్టన్ ఫ్రీడమ్ ప్రధాన కోచ్‌గా పాంటింగ్‌ను నియమితులయ్యాడు. ఈమేరకు అతడితో రెండేళ్ల ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆ ఫ్రాంచైజీ తెలిపింది. లీగ్ రెండో సీజన్ జూలై 4న మొదలవనుంది.



బుమ్రా నెం. 1

టెస్ట్ ర్యాంకుల్లో అగ్రస్థానం

ఈ ఘనత అందుకున్న తొలి భారత పేసర్‌గా రికార్డు

దుబాయ్: ఇంగ్లండ్‌తో విశాఖపట్నంలో జరిగిన రెండో టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు తగిన రివార్డు లభించింది. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో 30 ఏళ్ల బుమ్రా అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. తద్వారా టెస్ట్‌ల్లో నెం.1 ర్యాంక్ కైవసం చేసుకున్న తొలి భారత పేసర్‌గా రికార్డు సృష్టించాడు. ఈక్రమంలో కమిన్స్, రబాడ, అశ్విన్‌ను బుమ్రా వెనక్కు నెట్టాడు. అలాగే టాప్‌ర్యాంక్‌కు ఎగబాకిన నాలుగో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. గతంలో అశ్విన్, జడేజా, బిషన్ సింగ్ బేడీకి నెం.1 ర్యాంక్ లభించింది. విశాఖ టెస్ట్‌లో మొత్తం 9 వికెట్లు పడగొట్టిన బుమ్రా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన విషయం విదితమే. ఇక..11 నెలలపాటు సుదీర్ఘంగా టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన అశ్విన్ (841 పాయింట్లు) ఆ హోదాను బుమ్రా (881 పాయింట్లు)కు కోల్పోయాడు. అశ్విన్ మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. అశ్విన్, జడేజా 2017లో సంయుక్తంగా నెం.1 ర్యాంక్‌లో ఉన్న అరుదైన ఘనత దక్కించుకున్నారు.

జైస్వాల్.. 37 స్థానాలు పైకి..

బ్యాటింగ్ విభాగంలో..భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఏకంగా 37 స్థానాలు ఎగబాకాడు. ఇంగ్లండ్‌తో విశాఖ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో దుమ్ము రేపిన జైస్వాల్ 29వ ర్యాంక్‌లో నిలిచాడు. ఆ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో తిరిగి ఫామ్‌లో కొచ్చిన శుభ్‌మన్ గిల్ 14 స్థానాలు మెరుగుపరుచుకొన్నాడు. కెరీర్‌లో అత్యుత్తమంగా 38వ ర్యాంక్‌ను అతడు చేజిక్కించుకున్నాడు.

మళ్లీ టాప్‌లోకి జైపూర్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆతిథ్య దబాంగ్ ఢిల్లీపై విజయంతో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తిరిగి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ ఇరు జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 27-22తో ఢిల్లీపై నెగ్గింది. ఈ సీజన్ స్టార్ రైడర్ అర్జున్ దేశ్‌వాల్ మరోసారి 10 పాయింట్లు సాధించి జైపూర్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీ తురుపుముక్క అషు మాలిక్ 9 పాయింట్లతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 40-31తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

ఇద్దరూ.. ఇద్దరే!

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం


అండర్-19 వరల్డ్‌కప్ ఫేవరెట్‌గా.. వరుస విజయాలతో జైత్రయాత్ర కొనసాగిస్తున్న యువ భారత్‌కు సెమీస్‌లో తొలిసారి సౌతాఫ్రికా రూపంలో అసలుసిసలు సవాల్ ఎదురైంది. 245 పరుగుల లక్ష్య ఛేదనలో టాపార్డర్ విఫలమవడంతో 32/4తో టీమిండియా పరాజయం ఖాయమని అనిపించింది. లీగ్ మ్యాచ్‌ల్లో పరుగుల వరదపారించిన ముషీర్ కూడా ఒత్తిడికి చిత్తయ్యాడు. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో కెప్టెన్ ఉదయ్ సహరన్, డాషింగ్ బ్యాటర్ సచిన్ దాస్ పరిణతి చెందిన ఆటతో మ్యాచ్ ఫలితాన్ని తలకిందులు చేశారు. ఐదో వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఓటమి కోరల్లోంచి రక్షించిన వీరు.. వరుసగా ఐదోసారి భారత్‌ను ఫైనల్‌కు చేర్చారు. సహరన్ ఎంతో కూల్‌గా ఇన్నింగ్స్‌ను నిర్మిస్తే.. దాస్ దూకుడుగా ఆడుతూ రన్‌రేట్ చేయిదాటకుండా చూశాడు. మ్యాచ్ ఫలితం కంటే.. తీవ్ర ఒత్తిడిలోనూ.. మొక్కవోని పట్టుదలతో వీరిద్దరూ పోరాడిన తీరు అద్భుతం.

కూల్ కెప్టెన్..



ఉదయ్ సహరన్

రాజస్థాన్‌కు చెందిన ఉదయ్ సహరన్ ఆట.. నిన్నటితరం క్రికెటర్లను గుర్తు చేస్తుంది. బంతి దొరికితే బాదేయడమే అన్నట్టుగా ఉంటుంది నేటి తరం ఆటగాళ్లది. కానీ, టెక్నిక్‌కు ఎంతో ప్రాధాన్యమిచ్చే 19 ఏళ్ల సహరన్.. ఎక్కువ సమయం క్రీజులో గడిపేందుకు వెచ్చిస్తాడు. గతి తప్పిన బంతులను మాత్రం తప్పకుండా శిక్షిస్తాడు. ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనైనా తలొగ్గ కూడదనేది అతడి మనస్తత్వం. సెమీస్ మ్యాచ్‌లో అతడు తన భాగస్వామికి సహకరిస్తూనే.. ఒక్కో పరుగు కూడగడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించిన తీరు గొప్ప ఆటగాడిని తలపించింది. ప్రస్తుతం పంజాబ్‌కు ఆడుతున్న సహరన్.. బటిండా యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. ఉదయ్ తండ్రి సంజీవ్ సహరన్ సర్టిఫైడ్ క్రికెట్ కోచ్. ఆటను ఎంత లోతుగా తీసుకెళ్లాలనేది తన తండ్రి వద్దనే నేర్చుకొన్నట్టు ఉదయ్ చెప్పాడు. ఆయుర్వేదిక్ డాక్టర్ కూడా అయిన సంజీవ్.. తన కొడుకు కెరీర్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాడు. 'మ్యాచ్ రోజు ఎంతో టెన్షన్‌కు గురయ్యాం. ఉదయ్ అమ్మ, అక్క అయితే గుడిలోంచి బయటకు రాలేద'ని సంజీవ్ చెప్పాడు.



సచిన్ దాస్

భారీ షాట్ల సచిన్..

భారత జట్టులో డేరింగ్.. డాషింగ్ బ్యాటర్ సచిన్ దాస్. భారీ షాట్లతో సూపర్ ఫినిషర్‌గా ముద్రవేసుకొన్నాడు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల సచిన్ దాస్ తండ్రి సంజయ్‌కు దిగ్గజం సచిన్ టెండూల్కర్ అంటే ఎంతో అభిమానం. అందుకే తన కుమారుడికి సచిన్ అని పేరు పెట్టుకొన్నాడు. సీనియర్ సచిన్ ధరించిన 10వ నెంబర్ జెర్సీనే యువ సచిన్ కూడా వేసుకుంటాడు. అక్కడ అందరూ దాస్‌ను ముద్దుగా బీడ్స్ సచిన్ అని పిలుస్తుంటారు. తండ్రి సంజయ్ ఒకప్పుడు యూనివర్సిటీ స్థాయిలో క్రికెట్ ఆడాడు. అంతకంటే ముందుకు వెళ్లలేకపోయిన సంజయ్.. కుమారుడినైనా గొప్ప క్రికెటర్‌గా చూడాలనుకున్నాడు. తల్లి దాస్‌ను చదుకోవాలని ఒత్తిడి చేసినా.. కుమారుడిలోని ప్రతిభను గుర్తించిన సంజయ్ ఆ దిశగా ప్రోత్సహించాడు. ఆర్థికంగా భారమైనా కొడుకు కోసం అప్పుచేసి మరీ టర్ఫ్ పిచ్‌ను తయారు చేయించాడు. క్రికెట్‌పై నుంచి ధ్యాస మరలకుండా ఉండేందుకు.. తన కొడుకొను ఎక్కడికీ వెళ్లనిచ్చేవాడిని కాదని సంజయ్ చెప్పాడు. దాస్ రోజుకు 7 గంటలు ప్రాక్టీస్ చేస్తాడని తెలిపాడు. ప్రస్తుతం సచిన్ ఆడుతున్న తీరు చూస్తుంటే.. అతను త్వరలోనే టీమిండియాలోకి వచ్చినా ఆశ్చర్యం లేదు. భారీ షాట్లతో మ్యాచ్‌ను ఒంటిచేత్తో మార్చేయగల సత్తా ఉన్న ఆటగాడిగా అందరి నుంచి ప్రశంసలు అందుకొంటున్నాడు.

సిరీస్‌కు కోహ్లీ, జడేజా దూరం?



ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌లకు జట్టు ఎంపిక నేడు!

న్యూఢిల్లీ: గాయపడిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, వ్యక్తిగత కారణాలతో జట్టుకు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌ల్లో పాల్గొనే అవకాశాలు దాదాపు లేనట్టే. మరోవైపు ఇంగ్లండ్‌తో హైదరాబాద్‌లో జరిగిన మొదటి టెస్ట్ సందర్భంగా జడేజాతోపాటు గాయపడిన మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కోలుకున్నట్టు తెలిసింది. కండర గాయంతో వైజాగ్‌లో జరిగిన రెండో టెస్ట్‌కు దూరమైన జడ్డూ ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్నాడు. తన గాయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పంచుకుంటున్నాడు. ఇందులో భాగంగా 'గాయం నుంచి కోలుకుంటున్నా. పరిస్థితి మెరుగైంది' అని తన ఫొటో సహా తాజాగా ట్వీట్ చేశాడు. అయితే ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌ల్లోనూ జడ్డూ ఆడే అవకాశాలు లేనట్టు తెలుస్తోంది. ఇక..వన్డే వరల్డ్ కప్ సందర్భంగా పాదానికి అయిన గాయం నుంచి పేసర్ షమి ఇప్పటికీ కోలుకోలేదట. 'పాదం గాయానికి యూకేలో చికిత్స పొందుతున్న షమితోపాటు జడేజా కూడా ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు ఫిట్‌గా ఉండే అవకాశాలు దాదాపు లేవు. అయితే రాహుల్ కోలుకున్నాడు. రెండు, మూడు టెస్ట్‌లకు నడుమ సుదీర్ఘ సమయం ఉన్న దరిమిలా..రాజ్‌కోట్ మ్యాచ్‌కు అతడు సిద్ధమయ్యే చాన్సుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. మూడో టెస్ట్ ఈనెల 15న రాజ్‌కోట్‌లో మొద లవనుంది. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్ట్‌లకు దూరమైన కోహ్లీ.. రాజ్‌కోట్, రాంచి టెస్ట్‌లతో పాటు మార్చి 7 నుంచి ధర్మశాలలో జరిగే చివరి మ్యాచ్‌కూ అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. కాగా, ఇంగ్లండ్‌తో ఆఖరి మూడు టెస్ట్‌లకు భారత జట్టును గురువారం ఎంపిక చేసే అవకాశముంది.

తొలి టెస్ట్ న్యూజిలాండ్‌దే

మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ 281 పరుగుల భారీ తేడాతో గెలిచింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 179/4 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను కివీస్ డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 349 పరుగులతో కలిపి మొత్తం 529 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. ఆటకు నాలుగో రోజు ఛేదనలో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు కుప్పకూలింది. డేవిడ్ బెడింగమ్ (87) పోరాటం వృథా అయింది. జేమిసన్ 4, శాంట్నర్ 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 511, సౌతాఫ్రికా 162 పరుగులు చేశాయి. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ అగ్రస్థానానికి ఎగబాకగా.. భారత్ మూడో ర్యాంక్‌కు పడిపోయింది. ఆస్ట్రేలియా రెండో స్థానంలో నిలిచింది.

ఫైనల్లో సన్‌రైజర్స్

కేప్‌టౌన్: సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండో ఏడాది సౌతాఫ్రికా (ఎస్‌ఏ) టీ20 లీగ్ ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయర్-1లో ఆ జట్టు 51 పరుగులతో డర్బన్ సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 157/8 స్కోరు చేసింది. మలాన్ (63) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఛేదనలో బార్ట్‌మన్ (4/10), మార్కో జాన్సెన్ (4/16) దెబ్బకు జెయింట్స్ 19.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది.

క్వార్టర్స్‌లో అమిత్, ఆకాష్

సోఫియా (బల్గేరియా): స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో భారత్‌కు చెందిన అమిత్ ఫంగల్ (51 కి), ఆకాష్ (71 కి), అభిమన్యు లోరా (80 కి) క్వార్టర్స్ చేరుకొన్నారు. ప్రీ క్వార్టర్స్‌లో అమిత్ 5-0తో రుడిక్ మక్సమ్ (ఉక్రెయిన్)పై, ఆకాష్ 3-1తో ట్రవోర్ మకన్ (ఫ్రాన్స్)పై, అభిమన్యు 5-0తో మోనీ రఫెల్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు.

ధోనీ లేని సీఎస్కేను ఊహించలేం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ధోనీ లేని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టును ఊహించలేమని మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో స్టార్‌స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐపీఎల్ చర్చా కార్యక్రమంలో మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్, ఎమ్మెస్కే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కే మాట్లాడుతూ.. ధోనీ తర్వాత సీఎస్కేను నడిపించే నాయకుడిని సంసిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నాడు. ఇక.. ప్రస్తుతం సీఎస్కే జట్టులో ఉన్న గుంటూరు యువ క్రికెటర్ షేక్ రషీద్‌కు ఈ ఐపీఎల్ సీజన్ చాలా కీలకమన్న ఎమ్మెస్కే.. అవకాశాలను సద్వినియోగం చేసుకొని సత్తా చాటితే అతడు త్వరలోనే టీమిండియాకు ఆడతాడని జోస్యం చెప్పాడు.

బిజినెస్

వచ్చేసింది ఇ-లూనా



ధర రూ.69,990

న్యూఢిల్లీ: కైనెటిక్ గ్రీన్ కంపెనీ గతంలో బహుళ జనాదరణ పొందిన లూనాను ఇ-లూనాగా మార్కెట్లోకి తెచ్చింది. బుధవారం ఇ-లూనాను కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ఆవిష్కరించారు. దీని ధర రూ.69,990 నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ సీఈఓ సులజ్జా ఫిరోదియా మోత్వానీ చెప్పారు. ఒక సారి చార్జింగ్ చేస్తే 110 కిలోమీటర్లు నడిచే 2 కిలోవాట్ల లిథియం అయాన్ బ్యాటరీతో ఇది అందుబాటులోకి వస్తున్నట్టు ఆమె తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇ-లూనాలు విక్రయించడం, రూ.1200 కోట్ల టర్నోవర్ సాధించడం తమ లక్ష్యమని ఆమె అన్నారు.

నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: రెపోరేట్ల తగ్గింపు ఈ సారి కూడా ఉండదన్న స్పష్టమైన సంకేతాల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం ప్రకటించనున్నారు. ప్రస్తుతం రెపోరేటు 6.5 శాతంగా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో రెపోరేటును 0.25 శాతం పెంచి 6.5 శాతం చేసిన తర్వాత వరుసగా ఐదు విడతలుగా ఆర్‌బీఐ అదే స్థాయిలో స్థిరంగా కొనసాగిస్తూ వస్తోంది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి (2 శాతం ఎగువకు లేదా దిగువకు సర్దుబాటు చేసుకునే వెసులుబాటుతో 4 శాతం వద్ద స్థిరీకరించడం) పై స్థాయికి చేరువలోనే కదలాడుతున్నందు వల్ల ఈ సారి కూడా ఆర్‌బీఐ వైఖరిలో మార్పు ఉండకపోవచ్చునంటున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,230 ▲	58,000 ▲	76,000 ▲
ముంబై	62,650 ▲	57,380 ▲	69,870 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ		విజయవాడ	546
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
8వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583	దజను గుడ్లు రూ.72	
గోదావరి	546		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	గోదావరి	120
వరంగల్	115	విజయవాడ	120
కరీంనగర్	115	గుంటూరు	124
మహబూబ్‌నగర్	115	ఒంగోలు	124
కర్నూలు	115	చిత్తూరు	128
విశాఖపట్నం	115		

2027 నాటికి చైనాను మించి...

భారత్‌లో చమురు డిమాండ్

అంతర్జాతీయ ఇంధన సంస్థ నివేదిక

బెతుల్ (గోవా): దేశం హరిత ఇంధనాలపై ఎంతగా దృష్టి సారిస్తున్నా సమాంతరంగా శిలాజ ఇంధనాల డిమాండు కూడా పెరిగిపోతూనే ఉంది. పెట్రోల్, డీజిల్ విక్రయాలు ఏ ఏటికాయేడు పెరిగిపోతూనే ఉన్నాయి. డిమాండ్‌లో వృద్ధి ఇలానే కొనసాగితే 2027 నాటికి మన దేశం ముడి చమురు డిమాండ్ వృద్ధిరేటులో చైనాను మించి పోతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఒక నివేదికలో తెలిపింది. గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ సదస్సులో ఇందుకు సంబంధించి "ఇండియన్ ఆయిల్ మార్కెట్ ఔట్‌లుక్, 2030" పేరుతో ఐఈఏ ఒక నివేదిక విడుదల చేసింది.



రోజుకు 66.4 లక్షల బ్యారెళ్ల డిమాండ్ : గత ఏడాది మన దేశం రోజుకు సగటున 54.8 లక్షల బ్యారెళ్ల ముడి చమురుని పెట్రో ఉత్పత్తులుగా మార్చింది. ఇందులో 50 లక్షల బ్యారెళ్ల ఉత్పత్తులు దేశీయ వినియోగానికే సరిపోయాయి. 2030 నాటికి రోజువారీ ముడి చమురు డిమాండ్ 66.4 లక్షల బ్యారెళ్లకు చేరుకుంటుందని ఐఈఏ తెలిపింది. పెట్రో ఉత్పత్తుల వినియోగంలో ప్రస్తుతం మన దేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో ఉంది. దేశంలో వీటి వినియోగం వేగంగా పెరుగుతోంది. అయితే దేశంలో ముడి చమురు ఉత్పత్తి అందుకు తగ్గట్టు పెరగడం లేదు. 2030 నాటికి రోజువారీ దేశీయ చమురు ఉత్పత్తి 5.4 లక్షల బ్యారెళ్లకు పడిపోతుందని అంచనా. దీంతో మన దేశ అవసరాల్లో 85 శాతం చమురును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. గత ఏడాది రోజుకు సగటున 46 లక్షల బ్యారెళ్లున్న చమురు దిగుమతులు 2030 నాటికి మరింత పెరిగి 58 లక్షల బ్యారెళ్లకు చేరుకుంటాయని ఐఈఏ అంచనా. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలు, పారిశ్రామిక వినియోగం ఇందుకు ప్రధాన కారణం.

ఈవీల ప్రభావం అంతంతే : విద్యుత్ వాహనాల గురించి ఎంతగా ప్రచారం జరుగుతున్నా, అవి ఇంకా మధ్య తరగతి జనానికి అందుబాటు ధరల్లో లభించడం లేదు. దీంతో ఈవీల అమ్మకాలు ఇంకా ఆశించిన స్థాయిలో లేవు. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న టూ వీలర్లు, త్రీ వీలర్లలో ఒక శాతం కూడా ఈవీలు లేవు. ఫోర్ వీలర్ల అమ్మకాల్లో మాత్రమే ఐదు శాతం వరకు ఈవీలు ఉన్నాయి. అది కూడా హై ఎండ్ కొనుగోలుదారుల కోసమే. ఈవీలు, ఇంధన సామర్థ్యం పెంపు, బయో ఇంధనాలను విస్తృతంగా వినియోగించడం ద్వారా మన దేశం రోజుకు ఐదు లక్షల బ్యారెళ్ల చమురును ఆదా చేసే అవకాశం ఉందని ఐఈఏ అంచనా. ఇందులో రెండు లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఒక్క ఈవీల వాడకం ద్వారానే పొదుపు చేయవచ్చని తెలిపింది.

ఎన్‌టీపీసీతో ఓఎన్‌జీసీ జాయింట్ వెంచర్

పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ చేతులు కలిపాయి. ఇందుకోసం రెండు కంపెనీలు ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేయనున్నాయి. ఇండియా ఎనర్జీ వీక్ సదస్సు సందర్భంగా ఎన్‌టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్, ఓఎన్‌జీసీ చైర్మన్, సీఈఓ అరుణ్ కుమార్ సింగ్ సమక్షంలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ సీఈఓ మోహిత్ భార్గవ, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీశ్ కుమార్ ద్వివేది సంతకాలు చేశారు. ఈ జేవీ ద్వారా సముద్ర, నదీ జలాలపై పవన, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెండు కంపెనీలు భావిస్తున్నాయి. అయితే ఈ జేవీ ఈక్విటీలో రెండు కంపెనీలకు ఎంతెంత వాటా ఉంటుందనే విషయాన్ని ఓఎన్‌జీసీగానీ, ఎన్‌టీపీసీగానీ వెల్లడించలేదు.

ఏఐలో 20 లక్షల మందికి శిక్షణ

- 2025 నాటికి జీడీపీలో 10 శాతం ఏఐ ద్వారానే..
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల



ముంబై: కృత్రిమ మేధ (ఏఐ) నియంత్రణ ఇతర నియమావళి రూపకల్పనలో భారత్, అమెరికా సహకరించుకోవాల్సిన అవసరం ఉందని యూఎస్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఏఐ శరవేగ వ్యాప్తి ద్వారా ఆర్థికాభివృద్ధి ఫలాలను అన్ని వర్గాలకు సమానంగా అందించగలమని అన్నారు. మైక్రోసాఫ్ట్ 2025 నాటికి 20 లక్షల మంది భారతీయులకు ఏఐలో శిక్షణ అందించనుందని ఈ సందర్భంగా నాదెళ్ల తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతోపాటు గ్రామీణ వ్యక్తులకు ఏఐలో శిక్షణ ఇవ్వడంపై కంపెనీ దృష్టిసారించనుందన్నారు. భారత భవిష్యత్ కార్మిక శక్తిని మరింత శక్తిమంతం చేసేందుకు మైక్రోసాఫ్ట్ కట్టుబడి ఉందనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమన్నారు. అంతేకాదు, దేశంలో ఉద్యోగాల కల్పనను ఇది వేగవంతం చేయనుందన్నారు. తెలుగు వ్యక్తి అయిన సత్య నాదెళ్ల ఏడాది తర్వాత భారత్‌కు విచ్చేశారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా నాదెళ్ల బుధవారం ముంబైలో ఏర్పాటు చేసిన 'మైక్రోసాఫ్ట్ సీఈఓ కనెక్షన్' అనే కార్యక్రమంలో ఐటీ కంపెనీలు, కన్సల్టెన్సీలు, న్యాయ సంస్థల నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనింకా ఏమన్నారంటే..

1తొలిసారిగా భారత్ మిగతా ప్రపంచంతో సమానంగా ఏఐలో అభివృద్ధిని సాధిస్తోంది. అలాగే, ఇక్కడి ఏఐ యూజ్ కేసెస్‌లు కూడా ఎంతో వినూత్నమైనవి. 1భారత ఆర్థికాభివృద్ధిని మరింత పెంచడంలో ఏఐ తోడ్పడనుంది. ప్రపంచంలో అధిక వృద్ధిరేటు సాధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం.. 2025 నాటికి భారత జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుండగా.. అందులో ఏఐ ఆధారిత వృద్ధి వాటా 10 శాతంగా (50,000 కోట్ల డాలర్లు) ఉండనుంది.

ఉద్యోగులకు టీసీఎస్ అల్టిమేటం

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఇప్పటికీ వర్క్ ఫ్రం హోమ్ చేస్తూ ఇంట్లోనే ఉండిపోతున్న ఉద్యోగులకు తుది అల్టిమేటం జారీ చేసింది. మార్చి చివరి నాటికి కార్యాలయాలకు వచ్చి పని చేయడం ప్రారంభించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని హెచ్చరించింది. ఉద్యోగులకు కంపెనీ ఇస్తున్న చివరి అవకాశం ఇదేనని స్పష్టం చేసింది. తాము ఉద్యోగులకు అల్టిమేటం జారీ చేసిన మాట నిజమేనని టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్‌జీ సుబ్రమణియం ధ్రువీకరించారు.



బీన్యూలో రియల్‌మీ 12 ప్రో మొబైల్ విడుదల

బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి): మొబైల్ రిటైలింగ్‌లోని బీన్యూ మాదాపూర్ స్టోర్‌లో రియల్‌మీ 12 ప్రో 5 జీ సిరీస్ మొబైల్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. సినీ నటి ప్రియాంక జవాల్కర్, బీన్యూ సంస్థ సీఎండీ వైడి బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్‌లు ఈ ఫోన్‌ను బుధవారం లాంచనంగా ప్రారంభించారు. రియల్‌మీ 12 ప్రోలో యువతను ఆకట్టుకునే ఫీచర్స్ ఉన్నాయని ప్రియాంక అన్నారు. చూడగానే ఆకట్టుకునే వేగన్ లెదర్ డిజైన్, 50 మెగా పిక్సల్ కెమెరా దీని ఆకర్షణలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈడీ సాయి నితేష్, ఇతరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ లాండ్రీ విభాగంలోకి ఎల్‌జీ అడుగు

న్యూఢిల్లీ: కొరియాకు చెందిన హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ దేశంలో సెల్ఫ్ లాండ్రీ సర్వీసును ప్రారంభించింది. ఈ విభాగంలో రూ.33.2 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ సెల్ఫ్ లాండ్రీ సర్వీసు విశ్వవిద్యాలయ, కళాశాల విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని విద్యాసంస్థల హాస్టళ్లలో 200 సెల్ఫ్ లాండ్రీ కేంద్రాలు ప్రారంభించడం లక్ష్యమని కంపెనీ ప్రకటించింది. తొలి లాండ్రీ సర్వీసును గ్రేటర్ నోయిడాలోకి ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్టు కంపెనీ ఎండీ హోంగ్ జు జియోన్ తెలిపారు.

ఆద్యంతం ఊగిసలాటలే..

మిశ్రమంగా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ఈక్విటీ సూచీలు బుధవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 34.09 పాయింట్ల నష్టంతో 72152 వద్ద ముగియగా నిఫ్టీ 1.10 పాయింట్ల నామమాత్రపు లాభంతో 21930.50 వద్ద ముగిసింది. ఆశాజనక పీఎంఐ డేటాతోపాటు గ్లోబల్ సంకేతాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను గురువారం ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా వ్యవహరించారు.

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓకు 88 శాతం బిడ్లు: పబ్లిక్ ఆఫరింగ్ తొలిరోజు ముగిసేసరికి, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇష్యూ సైజులో 88 శాతానికి సమానమైన బిడ్లు రాగా.. క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు 50 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది. రాశి పెరిఫెరల్స్ ఐపీఓకు మాత్రం 1.08 రెట్ల బిడ్లు లభించాయి. కాగా, గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజనీరింగ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఐపీఓకు దరఖాస్తు చేసుకున్న కంపెనీల సంఖ్య పదికి చేరుకుంది.

కెనరా బ్యాంక్ షేర్ల విభజన!: ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ షేర్లను విభజించాలనుకుంటున్నట్లు తెలిపింది. ఈనెల 26న సమావేశం కానున్న బ్యాంక్ బోర్డు షేర్ల విభజన ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనుంది. దాంతో కెనరా బ్యాంక్ షేరు 6.23 శాతం ఎగబాకి రూ.553.70 వద్ద ముగిసింది.

ఎన్‌టీపీసీ రూ.6,222 కోట్ల సమీకరణ: ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్‌టీపీసీ.. విదేశీ ఇన్వెస్టర్ల నుంచి 75 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,222 కోట్లు) రుణం సేకరించాలనుకుంటోంది. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్ మార్గదర్శకాలకు లోబడి ఈ రుణాలను సమీకరించనుంది.

ఆర్థిక మంత్రితో పేటీఎం బాస్ భేటీ

న్యూఢిల్లీ: పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మ మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరిద్దరి మధ్య పది నిమిషాలపాటు సంభాషణ జరిగిందని తెలిపారు. పీపీబీఎల్‌పై కఠిన చర్యలకు దారి తీసిన సమస్యలను నేరుగా ఆర్‌బీఐతోనే చర్చించి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించినట్లు వారు తెలిపారు. అయితే, ఆర్‌బీఐ అధికారులతో భేటీ అయిన సందర్భంగా పీపీబీఎల్ సేవలపై విధించిన డెడ్‌లైన్(ఫిబ్రవరి 29)ను పొడిగించాలని శర్మ కోరినట్లు తెలిసింది.

మరో 10 శాతం పెరిగిన పేటీఎం షేరు: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు బుధవారం బీఎస్ఈలో 10 శాతం పెరిగి రూ.496.75 వద్దకు చేరుకుంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(పీపీబీఎల్)పై ఆర్‌బీఐ నిషేధం నేపథ్యంలో వరుసగా మూడు రోజుల్లో 42 శాతం క్షీణించిన షేరు.. ఈ రెండ్రోజుల్లో కాస్త కోలుకుంది. మంగళవారం ట్రేడింగ్‌లో షేరు 3 శాతం పెరిగింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

బడ్జెట్ ప్రతులకు దుర్గగుడిలో పూజలు


దుర్గగుడిలో పూజలకు బడ్జెట్ ప్రతులతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : ఏపీ ప్రభుత్వ 2024-2025 బడ్జెట్ ప్రతులకు గురువారం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కే.వీ.వీ సత్యనారాయణ, ఆర్థిక శాఖ ఇన్‌చార్జి, అదనపు కార్యదర్శి బి.సునీల్‌కి 'సమార్ రెడ్డి దుర్గగుడికి వచ్చి పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో బడ్జెట్ ప్రతులను ఉంచి అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించారు. వీరికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, అధికారులు సాదర స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో రమేష్ వారికి ప్రసాదాలు, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మేము సేవకులమే

● భక్తులకు సేవకులుగానే.. : ట్రస్ట్‌బోర్డు చైర్మన్

దుర్గగుడి ట్రస్ట్ బోర్డుకు ఏడాది నిండిన సందర్భంగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులతో కలిసి ఆలయంలోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాము ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా కాకుండా భక్తులకు సేవకులుగానే ఉంటున్నామని, ఉంటామని తెలిపారు. మల్లేశ్వరాలయాన్ని ఈ నెల 18వ తేదీన ప్రారంభిస్తున్నామని, ధ్వజస్తంభానికి సంబంధించి దాత బంగారు తొడుగు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని ఇంకా చిన్న చిన్న పనులు ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

రాయపూడిలో 'ఇగ్నో' నిర్మాణానికి భూమిపూజ

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : రాజధాని అమరావతి ప్రాంతంలోని రాయపూడిలో ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కార్యాలయ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ జరిగింది. ప్రాంతీయ కేంద్ర సంచాలకురాలు డాక్టర్ కే.సుమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఒడిశాలోని అన్గుల్ ప్రాంత కేంద్ర సంచాలకులు డాక్టర్ మనోజ్‌కుమార్ దాస్ పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. మరో 6 ప్రాంతీయ కేంద్రాల శాశ్వత భవన నిర్మాణానికి కూడా ఇదే సమయంలో ఆన్‌లైన్‌లో శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీడబ్ల్యుడీ ముఖ్య ఇంజనీర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ కృష్ణకిషోర్, ఇగ్నో ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకుడు డాక్టర్ బి.ప్రసాద్‌బాబు, సహాయ కులపతి సి.బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

బస్సుస్టేషన్, ఫిబ్రవరి 7 : ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతపై జారీ అయిన సర్క్యులర్ 1ని అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఏయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. మంగళగిరి డిపోలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైన నాటి నుంచి నాలుగేళ్లుగా సరెండర్ లీవుల డబ్బు, డీఏ, బకాయిలు, విలీనం అనంతరం చనిపోయిన, పదవీ విరమణ చేసిన ,మెడికల్ అన్‌ఫిట్, వీఆర్‌ఎస్ తీసుకున్న ఉద్యోగులకు 2023 సెప్టెంబరులోపే చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటి వరకు అమలు కాలేదన్నారు. ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసంతృప్తి ఉద్యమంగా మారకముందే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు మాట్లాడుతూ, త్వరలో 1500 మందికి పదోన్నతులు రానున్నాయన్నారు. రాష్ట్ర కార్యదర్శి కృష్ణారావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరీముల్లా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇష్టారీతిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

● అడ్డుకున్న అధికారులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సెంట్రల్ నియోజకవర్గానికి బదిలీ చేయాలని సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చేసిన ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వెలంపల్లి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్న క్రమంలో అక్కడి పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన మూడు రోజుల క్రితం కార్పొరేషన్ అధికారుల అనుమతి తేలకుండా పశ్చిమ నియోజకవర్గంలో తనకు అనుకూలంగా ఉండే పలు డివిజన్లకు చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సెంట్రల్‌కు, అక్కడ ఉన్నవారిని పశ్చిమ నియోజకవర్గానికి బదిలీ చేశారు. ఈ అంశం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్ దృష్టికి చేరింది. దీంతో అధికారులు వివరాలు తెలుసుకుని బదిలీలను నిలుపుదల చేయించారు. ఈ అంశంపై పశ్చిమ నియోజకవర్గంలో కొందరు కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.


జనసేన కార్యాలయం వద్ద కొట్లాట

● పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : పశ్చిమ నియోజకవర్గం కొత్తపేటలోని జనసేన కార్యాలయం వద్ద కార్యకర్తల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై కొత్తపేట పోలీసుస్టేషన్‌కు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. 40వ డివిజన్‌లోని జనసేన నాయకులు షేక్ గయాజుద్దీన్ రుణాలు ఇప్పిస్తానని పలువురి వద్ద డబ్బు తీసుకుని రుణాలు ఇప్పించలేదని, పైగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేసిన ఒక వీడియో వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. ఈ వీడియోను జనసేన నగర అధ్యక్షుడు, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్ కావాలనే మార్ఫింగ్ చేసి తన గురించి అసత్య ప్రచారం చేయిస్తున్నాడని గయాజ్ తిరిగి ఆరోపించారు. ఆ వీడియోని బాధితుడిని గ యాజ్ సంప్రదించారు. బాధితుడు తనకేమీ సంబంధం లేదని తెలిపారు. ఈ విషయంపై గయాజ్ పోతిన మహేష్‌ను అడిగేందుకు జనసేన కార్యాలయం వద్దకు అనుచరులు, బాధితులు వచ్చారు. పోతిన మహేష్ కార్యాలయంలో లేకపోవడంతో ఆయనపై తిట్లు లంఘించుకున్నారు. దీంతో జనసేన కార్యాలయంలోని సిబ్బందితో వాదులాట జరిగింది. మాటా మాటా పెరిగి కొట్టుకున్నారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్ హంతకులను కఠినంగా శిక్షించాలి

● ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నాయకులు


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహరరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : తహసీల్దార్ రమణయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని, హత్య జరిగి ఐదు రోజులవుతున్నా రమణయ్య కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించకపోవడం శోచనీయమని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహరరెడ్డి, మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో జి.సాయిప్రసాద్ ఐఏఎస్‌లకు బుధవారం అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రమణయ్య భార్యకు గ్రూప్-2 స్థాయి ఉద్యోగం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

● రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీదేవి

లబ్బీపేట, ఫిబ్రవరి 7 : దురలవాట్లకు దూరంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలు నివారించే వీలుంటుందని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.హెచ్.శ్రీదేవి అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం బెంజిసర్కిల్ వద్ద గల లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డిప్యూటీ ట్రాన్స్ లక్షన్నమంది మృతి చెందారని ఇది చాలా దురదృష్టకరమని అన్నారు.

రోడ్డు రొద!






ఇది జనరల్ ఆస్పత్రికి వెళ్లే సర్వీసు రహదారి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆస్పత్రికి వెళ్లే అంబులెన్స్‌లు, కార్లు ఇతర వాహనాలు ఈ మార్గంలో వెళుతుంటాయి. జనంతో రద్దీగా ఉండే ప్రాంతమిది. ఇరుకైన ఈ సర్వీసు రోడ్డుకు ఒకవైపు బారుగా ఆటోలు పార్కింగ్ చేసి ఉంటాయి. మరోవైపు టీ, టిఫిన్ దుకాణాలు వరుస కట్టాయి. దీంతో రోడ్డు మొత్తం వీటితోనే నిండిపోయి వాహనాల రాకపోకలకు, నడిచి వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా ఇక్కడే ఉన్నా పట్టించుకోవడం లేదు. నగరంలో ఎవరికీ అడ్డురాని ఫెక్సీలపై దృష్టి పెట్టే మున్సిపల్ అధికారులు ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఈ రోడ్డు రొదను పట్టించుకోకపోవడం గమనార్హం.




అలరించిన గదాయుద్ధ

విజయవాడ కల్చరల్, జనవరి 7 : గదాయుద్ధ (దుర్యోధన వధ) నాటకం విశేషంగా అలరించింది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సాంస్కృతి శాఖ అనుబంధ సంస్థ నేషన్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాటక ప్రదర్శనల్లో భాగంగా రెండోరోజు బుధవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'గదాయుద్ధ' (దుర్యోధన వధ) యక్షగాన నాటకం ప్రదర్శించారు. కర్ణాటక రాష్ట్ర కెరెమనె ప్రాంతానికి చెందిన ఇడగుమ్ జీ మహాగణపతి యక్షగాన మండలి బృందం ప్రదర్శించిన ఈ నాటకం యక్షగాన శైలిలో కన్నడ ఆలయ సంప్రదాయ నృత్యంతో శాస్త్రీయ సంగీత మేలవింపులో నృత్య, నాటక, సంగీత, వేష, భాష, అలంకారాల కలబోతగా కనువిందు చేసింది. ప్రముఖ రచయి, దర్శకుడు శివానంద హెగ్డే రచన, దర్శకత్వంలో కురుక్షేత్ర యుద్ధ చివరి అంకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

సెంట్రల్‌లో అడుగడుగునా అధికార దుర్వినియోగం

● వెలంపల్లి తీరుపై బొండా ఉమా ఆగ్రహం

పాయకాపురం, ఫిబ్రవరి 7 : సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాస్ అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కి వైసీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ నియోజకవర్గంలోని వలంటీర్లతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీకి పనిచేయాలని కొరుతున్నారని చెప్పారు. వలంటీర్లకు తాయిలాలుగా కుక్కర్లు, నగదును కూడా పంపిణీ చేసి వారిని పార్టీ ప్రచారానికి సహకరించాలని కోరినట్లు వివరించారు. వలంటీర్లకు ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, డిప్యూటీ మేయర్లు తాయిలాలు పంపిణీ విషయమై ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనాలను, ఫొటోలను మీడియాకు చూపించారు. నగరపాలక సంస్థ కమిషనర్, పోలీసు కమిషనర్లకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్లు ఓ సర్క్యులర్ జారీ చేశారని ఎవరైన వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారని బొండా ఉమా పేర్కొన్నారు. ఈ సమావేశంలో నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రైతు బజార్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు

గన్నవరం, ఫిబ్రవరి 7 : నియోజకవర్గంలో నూతన రైతుబజార్ల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించినట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, 2022-23 సంవత్సరంలో మార్కెట్ ఫీజు రూ.2.47 కోట్లు, 2023-24లో 3.67కోట్లు వసూళ్లు అయ్యాయని, ప్రస్తుతం రూ.14.24కోట్లు నిల్వ ఉందని తెలిపారు. రామవరప్పాడు రైతు బజార్ నిర్మాణానికి రూ.1.05 కోట్లు, తేలప్రోలు రైతు బజార్‌కు రూ.72లక్షలు నున్న రైతు బజార్‌కు రూ.50లక్షలు మంజూరు చేశామన్నారు. గన్నవరం రైతు బజార్‌లో పార్కింగ్ ప్రాంతం లెవలింగ్, అదనపు స్టాల్స్ నిర్మాణానికి 20.30 లక్షలు, మార్కెట్ యార్డులో గోదాముల మరమ్మతులకు రూ.35లక్షలు, బాపులపాడు సబ్ యార్డులో మరమ్మతులకు రూ.17లక్షలు మంజూరు చేశామని వీటి టెండర్‌ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏడీఏ సునీల్, గ్రేడ్-1 కార్యదర్శి ఎ.కిషోర్, గ్రేడ్-3 కార్యదర్శి పి.జ్యోతి, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, డైరెక్టర్‌లు ఆవుటపల్లి రోజా రాణి, మోటమర్రి శేఖర్, దారా రాజారత్నం, షేక్ రహమతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించి నగదు, బంగారం అపహరణ

చిట్టినగర్, ఫిబ్రవరి 7 : దుండగులు మహిళను బెదిరించి నగదు, బంగారం అపహరించిన ఘటన కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సూర్యానగర్ కాలనీకి చెందిన రిక్కుల శోభ కొత్తపేటలోని తన సోదరి నివాసానికి వారం క్రితం కుమారుడికి వైద్యం నిమిత్తం వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె చెల్లెలు, భర్త ఎవరి పనులకు వారు వెళ్లారు. వీరి కుమార్తె కళాశాలకు వెళ్లింది. దీంతో శోభ ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇది గమనించిన గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఆమె వద్దకు వెళ్లి ఆమె మరిది అప్పారావు పేరు చెప్పి ఆయన ఉన్నారా అని అడిగారు. తాము ఆయన బంధువులమని నమ్మించారు. వారిని మంచినీరు తాగుతారా అని కూడా శోభ అడిగింది. ముఖాలకు మాస్కులు పెట్టుకున్న దుండగులలో ఒకరు వెంటనే లోపలికి వెళ్లి తలుపు గడియపెట్టాడు. ఆమెకు కత్తులు చూపించి బీరువా తాళాలు ఇమ్మని బెదిరించారు. ఆమె తప్పించుకోవడానికి ప్రయత్నించింది. ఆమెను అడ్డుకుని చంపేస్తామని బెదిరించారు. బీరువా తాళం చెవులు ఎక్కడున్నాయని అడగడంతో ఆమె పరుపు కింద ఉన్నాయని చెప్పింది. వారు తాళం చెవి తీసుకుని బీరువాలో భద్రపరిచిన లక్షన్నర రూపాయల నగదు, 37 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. పట్టపగలు ఈ ఘటన చోటుచేసుకుంది. కాలేజీకి వెళ్లిన శోభ చెల్లెలు, కుమార్తె ఇంటికి రాగా జరిగిన ఘటన తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల నిరసన దీక్ష



ధర్నాచౌక్, ఫిబ్రవరి 7: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈపీఎస్-95 పెన్షనర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తమ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మూడు రోజుల నిరసన దీక్షను బుధవారం చేపట్టారు. తమకు పెన్షన్ పెంపులేదని, కేంద్ర పాలకులకు (బీజేపీకి) ఓటు లేదని అన్నారు. నిరసనలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రీ, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, నాంచారయ్య, మురహరి, ప్రభుదాసు, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఎస్పీఎఫ్ ప్రతిభ



విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఎస్పీఎఫ్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఎస్పీఎఫ్ మంగళగిరి బెటాలియన్ సిబ్బంది సత్తా చాటారు. వాలీబాల్, బాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచారు. ఎస్పీఎఫ్‌లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆయా యూనిట్లకు ప్రోత్సహకాలను బుధవారం అందజేశారు. విమానాశ్రయాలు, జేన్‌కో, సచివాల యం, హైకోర్టుల వద్ద భద్రతా విధులు నిర్వహించడంతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని ఐజీ త్రివిక్రమవర్మ చెప్పారు. ఆయా యూనిట్ల కమాండెంట్లకు వాలీబాల్ కిట్లను అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

పెనమలూరు, ఫిబ్రవరి 7 : కడుపునొప్పి తాళలేక ఒక వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు బీఆర్‌నగర్‌కు చెందిన ఆరిగ దీప్తికి అదే గ్రామానికి చెందిన అవినాష్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. గత సంక్రాంతికి తన పిల్లలతో పుట్టింటికి వచ్చిన దీప్తి ఇక్కడే ఉంటోంది. ఇంటి పైఅంతస్తులో కడుపునొప్పి భరించలేక ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందింది. తన తండ్రి భాస్కరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

భూ హక్కుల చట్టంతో న్యాయ వ్యవస్థ అస్తిత్వానికి చేటు

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : న్యాయవ్యవస్థ అస్తిత్వానికే చేటు తెచ్చే భూ హక్కుల చట్టాన్ని రద్దు చేసేంత వరకు తమ ఉద్యమం ఆగదని బెజవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసరావు అన్నారు. భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చట్టాన్ని అమలు చేయడం సాధ్యం కాదన్నారు. న్యాయవాదులతో సంప్రదించి అనవసరమైన సెక్షన్లను తొలగిస్తామని ప్రభుత్వం చెప్పడంతోనే అందులో ఉన్న ప్రాధాన్యత ఎంతో ఉందన్నది అర్థమవుతోందని అన్నారు. ఈ చట్టం న్యాయవ్యవస్థ అస్తిత్వానికే చేటు తెస్తుందని కూడా అభిప్రాయ పడ్డారు.

● 50వ రోజుకు చేరిన నిరసన దీక్ష..

న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షలు బుధవారానికి 50వ రోజుకు చేరుకున్నాయి.

డీసీపీగా కృష్ణకాంత్ పటేల్ బాధ్యతల స్వీకరణ


సీపీ కాంతిరాణాను కలిసిన కృష్ణకాంత్

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సిటీ డిప్యూటీ కమిషనర్‌గా కృష్ణకాంత్ పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ టి.కాంతిరాణాను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా ఉన్న కృష్ణకాంత్ పటేల్‌ను కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం విజయవాడకు బదిలీ చేసింది. కర్నూలులో పనిచేస్తుండగానే ఎస్పీగా పదోన్నతి పొందారు. ఎస్పీ పదోన్నతి వచ్చిన తర్వాత మొదటి పోస్టింగ్‌ను విజయవాడలో ఇచ్చారు. కొన్నాళ్లు ఆయన ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం ఏఎస్పీగా పనిచేశారు.

విరాళ దాతకు కలెక్టర్ దిల్లీరావు అభినందనలు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ రూ.2 లక్షల విరాళం అందించింది. ఈ మేరకు బ్యాంకు ప్రతినిధులు బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ డిల్లీరావు చేతుల మీదుగా విరాళానికి సంబంధించిన మెగా చెక్‌ను అందించారు. కలెక్టర్ అభినందించారు.

కతోలిక క్రైస్తవుల కల్పవల్లి మరియమాత

● 8వ రోజుకు చేరిన నవదిన ప్రార్థనలు



గుణదల, ఫిబ్రవరి 7 : దేవుని తల్లి అయిన మరియమాత కతోలిక క్రైస్తవుల కల్పవల్లిగా విరాజిల్లుతోందని కడప మేత్రాసనం ఫాదర్ సగిలి ప్రకాష్ అన్నారు. గుణదల మేరీమాత శతాబ్ది మహోత్సవాల నవదిన వేడుకల్లో భాగంగా బుధవారం 8వ రోజు నిర్వహించిన ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా ఫాదర్ సగిలి ప్రకాష్ వచ్చి భక్తులకు సందేశమిచ్చారు.

ప్రపంచ స్థాయిలో ఏపీ ఖ్యాతిని చాటాలి


జెస్సీరాజ్, జోయల్‌ను అభినందిస్తున్న సీఎం జగన్

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 7 : అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించిన రాష్ట్ర ఖ్యాతిని చాటాలని స్కేటింగ్ జాతీయ క్రీడాకారులు జెస్సీరాజ్, జోయల్ ఆదర్శ్‌లకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎంను రైల్వే కోడూరు, దెందులూరు ఎమ్మెల్యేలు కె.శ్రీనివాసులు, కె.అబ్బయ్య చౌదరీల సమక్షంలో విజయవాడకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు సీఎంను బుధవారం కలిశారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జెస్సీరాజ్ ఆర్టిస్టిక్ సోలో స్కేటింగ్‌లో రాణించి ఇప్పటి వరకు 20 పతకాలు (8 స్వర్ణం, ఏడు రజతాలు, 5 కాంస్యాలు), రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జోయల్ ఆదర్శ్ 7 పతకాలు (4 స్వర్ణాలు, 3 రజతాల)ను సాధించారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో పతకాలను సాధించిన సందర్భంగా సీఎంను వీరిద్దరూ కలిశారు.

ఉత్తరాఖండ్, జార్కండ్ జయభేరి

విజయవాడస్పోర్ట్సు, ఫిబ్రవరి 7 : మూలపాడు వేదికగా ట్విన్ స్టేడియాల్లో ఏసీఏ పర్యవేక్షణలో జరుగుతున్న బీసీసీఐ అండర్-23 ఎలైట్ గ్రూప్-డి వన్డే టోర్నీ మ్యాచ్‌ల్లో ఉత్తరప్రదేశ్‌పై ఉత్తరాఖండ్, మేఘాలయపై జార్కండ్ జట్లు జయభేరి మోగించాయి. ఉత్తరప్రదేశ్- ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో తొలుత బ్యాట్ పట్టిన ఉత్తరాఖండ్ 49.2 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటయ్యింది. ముస్కన్ కుమారి 49, అంజలి గోస్వామి 53 పరుగులతో రాణించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో అర్చనా దేవి నాలుగు వికెట్లతో సత్తా చాటింది. 201 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ఉత్తరప్రదేశ్ 49.5 ఓవర్లలో 165 పరుగులకు కుప్పకూలి 36 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. రెండో మ్యాచ్ జార్కండ్-మేఘాలయ మధ్య జరగ్గా తొలుత బ్యాటింగ్ దిగిన మేఘాలయ 46 ఓవర్లలో 78 పరుగులకు ఆలౌటయ్యింది. 79 పరుగుల విజయ లక్ష్యాన్ని జార్కండ్ 12.2 ఓవర్లలో 2 వికెట్లను కోల్పోయి అధిగమించింది.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ దిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ దిల్లీరావు, ఐజీఎంసీ స్టేడియం కాంప్లెక్సులోని వార్డు సచివాలయం-89ను ఆకస్మికంగా సందర్శించారు. వార్డు సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

బహుజనులకు చట్టసభల్లో అవకాశమివ్వాలి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 7 : బహుజనుల సమస్యలపై చట్టసభల్లో మాట్లాడేందుకు, వారి హక్కుల పరిరక్షించేందుకు ఎమ్మెల్యే, ఎంపీ, నామినేటెడ్ పోస్టుల నియమాకాల్లో బహుజన ఉద్యమ నేతలకు అవకాశం కల్పించాలని బహుజన పరిరక్షణ సమితి నేతలు సీఎం జగన్‌ను కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు.

ఇది ఎన్నికల స్టంట్ బడ్జెట్

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 : వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్ రానున్న ఎన్నికల స్టంట్ అని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ అభిప్రాయపడ్డారు. 'ఇది కేవలం అంకెల గారడీ బడ్జెట్. వ్యాపారస్తులకు ఏ విధంగా మేలు జరుగుతుందో స్పష్టత లేదు. జగన్ ప్రభుత్వం వ్యాపారస్తులపై భారం మోపుతోందేగాని వెసులుబాట్లు లేవు. బడ్జెతో మరోసారి ప్రజలను మోసం చేశారు' అని ఆయన పేర్కొన్నారు.



పోలవరం నిర్మాణంపై కౌంటర్ వేయండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
- హోం, జలశక్తి కార్యదర్శులకు, పీపీఏ సీఈవో, సీఎస్‌లకు నోటీసులు
- విచారణ నాలుగు వారాలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర హోం, జలశక్తి శాఖల కార్యదర్శులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తన అధీనంలోకి తీసుకుని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ అమలాపురానికి చెందిన న్యాయవాది వి. రమేశ్‌చంద్రవర్మ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం చేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతించిన అధికారులపై విచారణకు ఆదేశించకపోవడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మంగెన శ్రీరామారావు వాదనలు వినిపిస్తూ... కాఫర్ డ్యాం పూర్తిగా నిర్మించకుండా వదిలేయడంతో వరదల కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిందని.. దీంతో రూ.700 కోట్ల ప్రజాధనం వృథా అయిందని తెలిపారు. డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేసేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేయకుంటే ప్రజలకు నష్టం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ.. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని.. కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్రప్రభుత్వం నిర్మిస్తోందని పేర్కొన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

రుషికొండపై నిపుణుల కమిటీ నివేదిక సిద్ధం

- కమిటీ చైర్మన్ గుండెపోటుతో చనిపోయారు
- నివేదికకు సమయం ఇవ్వండి
- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండపై చేపట్టిన నిర్మాణాలు, ఇతర పర్యావరణ ఉల్లంఘనలపై కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ(ఎంవోఈఎఫ్) నియమించిన నిపుణుల కమిటీ నివేదిక సిద్ధం చేసిందని హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం నివేదించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించిన వివరాలను కమిటీ చైర్మన్, ఇతర సభ్యులు నివేదికలో పొందుపర్చారని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ ధర్మాసనానికి వివరించారు. అయితే కమిటీ చైర్మన్ కె.గౌరప్పన్ గుండెపోటుతో మరణించారని, నివేదికపై ఆయన సంతకం చేయలేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నివేదికను కోర్టు ముందుంచడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. చైర్మన్ లేవనెత్తిన అభ్యంతరాలపై కమిటీలో ఇతర సభ్యుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌కి విరుద్ధంగా విశాఖ జిల్లా చినగదిలి మండలం ఎండాడ గ్రామం పరిధిలోని సర్వే నం.19లో రుషికొండను తవ్వేయడంతో పాటు చెట్లను తొలగిస్తున్నారని పేర్కొంటూ విశాఖ తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ నగరవాసి, జనసేన నాయకుడు పీవీఎస్ఎన్ మూర్తి యాదవ్ వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఇదే వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చి తన వాదనలు కూడా వినాలని కోరుతూ ఎంపీ రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం... ఎంవోఈఎఫ్ నివేదికలో పేర్కొన్న ఉల్లంఘనల ప్రభావం పర్యావరణంపై ఏ మేరకు ఉంటుందనే విషయమై అధ్యయనం చేయించాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా ఏర్పాటైన కమిటీ రుషికొండపై క్షేత్రస్థాయిలోపరిశీలించినివేదిక సిద్ధం చేసింది.





ప్రయాణికులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ఏపీ నుంచి అయోధ్యకు తొలి ప్రత్యేక రైలు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలక్‌రామ్‌ని దర్శించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారిగా ప్రత్యేక రైలు బయల్దేరింది. 1,345 మంది శ్రీరామ భక్తులతో బుధవారం గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరిన ఈ రైలుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు..

ఎవరెలా పోతే మాకేంటీ?

- మేం ఒంటరిగానే పోటీ చేస్తాం: మంత్రి బొత్స

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎవరెలా పోతే మాకేంటీ? అని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... 'ప్రజలు మావైపే ఉన్నారనే విశ్వాసంతో ఉన్నాం. మేం ఒంటరిగానే పోటీ చేస్తాం. చంద్రబాబు ఎవరితో కలిసి వెళ్తే మాకేంటీ సంబంధం? బాబు ఢిల్లీ వెళ్లింది బీజేపీతో పొత్తు కోసమని చెప్పాడా? ఆయన దేనికెళ్లారో తెలియకుండా ఎలా స్పందిస్తాం? పొత్తు కోసమే అని చెప్తే అప్పుడు స్పందిస్తాం. అమిత్‌షా నిజంగా రమ్మంటే ఎంతో హడావుడి చేసేవారు' అని బొత్స అన్నారు.

షర్మిల భద్రత మా పనికాదు: మంత్రి పెద్దిరెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలైనంత మాత్రాన షర్మిలకు భద్రత ఇస్తారా? ఆమెకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అనంతపురంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రాయలసీమలో సిద్ధం సభను ఈ నెల 18న రాప్తాడులో ఏర్పాటు చేస్తున్నా. టీడీపీ పొత్తులు పెట్టుకోవడాన్ని మేం ముందుగానే ఊహించాం. మా నాయకుడు జగన్ సింగిల్‌గానే ఎన్నికలకు వస్తారు. షర్మిలకు భద్రతను వారే సొంతంగా ఏర్పాటు చేసుకోవాలి. పాదయాత్ర సమయంలో జగన్‌రెడ్డికి సొంత డబ్బులతో భద్రత కల్పించుకున్నాం' అని పెద్దిరెడ్డి వివరించారు.

బతికుండగానే బకాయిలు చెల్లించండి

- ఆంధ్రా పెన్షనర్ల పార్టీ అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 7: పెన్షనర్లకు బతికుండగానే బకాయిలు చెల్లించాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక పథకాలకు బటన్ నొక్కి డబ్బు పంచుతున్నానని చెప్పుకుంటున్న సీఎం జగన్ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడం శోచనీయమని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు.

మార్కెటింగ్ సెక్రటరీగా బాబు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. డైయిరీ డెవలప్‌మెంట్ ఎండీగా ఉన్న బాబు.ఎను మార్కెటింగ్ అండ్ కో-ఆపరేటివ్స్ సెక్రటరీగా నియమించింది. అక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న చిరంజీవి చౌదరిని రిలీవ్ చేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అభిషేక్ గౌడ ఎం.జెను విలేజ్, వార్డు సచివాలయాల విభాగానికి అడిషనల్ డైరెక్టర్‌గా నియమించింది. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న శేఖర్‌బాబును మార్క్‌ఫెడ్ ఎండీగా ప్రభుత్వం నియమించింది. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఎం.శివప్రసాద్‌ను ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ చేసింది. విద్యాశాఖలో ఇంగ్లీష్ మీడియం ప్రత్యేక అధికారిగా ఉన్న వెట్రిసెల్వీని బదిలీ చేసి మహిళా, శిశు సంక్షేమ శాఖకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించారు. ఈమేరకు బుధవారం సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

తాపీ మేస్త్రీల విమానయానం

- స్టార్ హోటల్‌లో భోజనం.. బీచ్‌లో విహారం.. కాంట్రాక్టర్ ఉదారత

మదురై, ఫిబ్రవరి 7: తాపీ మేస్త్రీలు, కూలీలు, ఇంజనీర్లు, ఇతర సిబ్బంది 75 మందికి మదురై నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణించే అరుదైన అవకాశం దక్కింది. చెన్నై నుంచి బస్సుల్లో బీచ్‌కు వెళ్లి ఆహ్లాదంగా గడిపారు. తరువాత మహాబలిపురం సందర్శించారు. రాత్రికి స్టార్ హోటల్‌లో భోజనం చేసి బస్సుల్లో ఇళ్లకు చేరుకున్నారు. మదురైకి చెందిన భవన నిర్మాణ కాంట్రాక్టర్ ఆర్.మయాన్ తన సిబ్బందికి ఈ అరుదైన అనుభూతి కలిగించారు.

విజయ సాయిరెడ్డి పెద్ద అజ్ఞాని: టీపీసీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి పెద్ద అజ్ఞాని అని, ప్రధాని మోదీ మెప్పు కోసమే ఇతర పార్టీలను విమర్శిస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ఆయనకు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. షర్మిల రాకతో కాంగ్రెస్ బలం పెరుగుతోందనే విజయసాయిరెడ్డికి అంత అక్కసని అన్నారు. పిచ్చి సాయిరెడ్డికి తెలంగాణకు ఏం సంబంధమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు.

షర్మిలపై దుష్ప్రచారం మానుకోవాలి

- లేకుంటే చరిత్ర హీనులుగా మారతారు: మాజీ ఎమ్మెల్యే గోనె

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే చరిత్ర హీనులుగా మారతారని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టాక వైసీపీకి భయం పట్టుకుందన్నారు. అందుకే ఆమెపై తీవ్రస్థాయి ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఎన్ని గిమ్మిక్కులు చేసినా టీడీపీ, జనసేన కూటమిదే విజయమన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో దళితులపై దమనకాండ: హర్ష

కడప, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో దళితులపై వైసీపీ పెత్తందారుల దమనకాండ కొనసాగుతోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. బుధవారం కడపలో ఆయన దళిత సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటుగా జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పలికేందుకు వేమగిరిలో ఈ నెల 11న తలపెట్టిన దళిత సింహగర్జనకు దళితులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

జనసేనకు 'గాజు గ్లాసు'పై పిటిషన్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. ఫ్రీ సింబల్‌గా ఉన్న గాజుగ్లాసు గుర్తుకోసం తాను దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టు ముందు విచారణకు రానుంది.

మూడ్రోజులుగా ముభావమే..!

వైసీపీ ఎమ్మెల్యేల ముఖాల్లో కనిపించని కళాకాంతులు!!

- 81 మంది మాత్రమే సభకు హాజరు
- టికెట్లు దక్కని వారు లాబీలకే పరిమితం
- ఎవరు కలిసినా సీట్ల గురించే చర్చ
- ఓటాన్ అకౌంట్‌పై పేలవంగా స్పందన
- సీఎం ముఖంలోనూ కనిపించని నవ్వు
- అసెంబ్లీ సమావేశాలు నేటితో ఆఖరు!
- సభ్యులతో కలసి స్పీకర్ ఫొటో సెషన్
- హాజరు కాబోమంటున్న టీడీపీ ఎమ్మెల్యేలు
- రాజ్యసభ ఎన్నికలకే మళ్లీ అందరూ వచ్చేది?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెలాఖరులోగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున.. ప్రస్తుత అసెంబ్లీకి ఇవే చిట్టచివరి సమావేశాలు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు ఈ నెల 27వ తేదీన పోలింగ్ అనివార్యమైతేనే ఎమ్మెల్యేలు ఇక అసెంబ్లీ ముఖం చూసేది. ఇప్పటికే వారిలో చాలా మంది అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత మూడ్రోజులుగా సభకు వస్తున్నా ముభావంగానే ఉన్నారు. అత్యధికుల ముఖాల్లో కళ తప్పింది. సర్వేల సాకుతో పలువురు సిటింగ్‌లకు సీఎం జగన్ మొండిచేయి చూపుతుండడంతో వారిలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. మొక్కుబడిగా మాత్రమే హాజరవుతున్నారు. విపక్ష టీడీపీ విరుచుకుపడుతున్నా.. ఒకరిద్దరు మినహా ఎవరూ స్పందించడం లేదు. ఓటాన్ అకౌంట్‌పై కూడా పెద్దగా మాట్లాడలేదు. గురువారం ద్రవ్య వినిమయ బిల్లు, బడ్జెట్ ఆమోదం తర్వాత అసెంబ్లీ ఉభయ సభలూ వాయిదాపడతాయి. చివరి రోజున సభ్యులకు వీడ్కోలు పలుకుతూ.. సభానాయకుడు, ప్రతిపక్ష నాయకుడి సమక్షంలో సభాపతి వారితో కలిసి ఫొటో దిగడం ఆనవాయితీ. అయితే స్పీకర్ తమ్మినేని సీతారాం తమ పట్ల వివక్ష చూపుతున్నందున ఆయనతో కలసి ఫొటో సెషన్‌లో పాలుపంచుకోబోమని టీడీపీ సభ్యులు చెబుతున్నారు. ఇక అధికారపక్షంలోనూ పలువురు హాజరు కాకపోడంతో.. వీడ్కోలు ఫొటో పలుచగా ఉండనుంది. ఐదో తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా.. శాసనసభకు అధికారపక్షానికి చెందిన 81 మంది ఎమ్మెల్యేలు మాత్రమే వచ్చారు. టీడీపీ తరఫున 14 మంది ఎమ్మెల్యేలు హాజరవుతుండగా.. వారిని కూడా ఏరోజుకారోజు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నారు. మొత్తంగా 175 మంది ఉండాల్సిన సభలో.. 95 మంది మాత్రమే ఉంటుండడం.. వారిలోనూ కొందరు బయటకు వెళ్లిపోతుండడం.. సస్పెన్షన్లతో సభ వెలవెలబోతోంది.

ఉత్సాహం మాయం..

గత అసెంబ్లీ సమావేశాల్లో ఎక్కడా లేని దూకుడు ప్రదర్శించిన వైసీపీ సభ్యులు ఈసారి పూర్తిగా రివర్స్ అయ్యారు. తొలిరోజున గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగ సమయంలో గానీ.. ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో గానీ, సీఎం సమాధానమిచ్చే సమయంలో గానీ.. బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రసంగం చేసేటప్పుడు గానీ.. అధికార పక్ష సభ్యుల నుంచి ఎలాంటి స్పందనా కనిపించలేదు. ఎవరిలోనూ మునుపటి దూకుడు, ఉత్సాహం లేవు. ముఖ్యంగా టికెట్లు రాని వారిలో నిరాశానిస్పృహలు స్పష్టంగా కనిపించగా.. టికెట్లు రానివారు అసెంబ్లీ లాబీల్లో దిగాలుగా కూర్చున్నారు. నలుగైదుగురు ఒక చోటకు చేరి.. తమకు టికెట్లు వస్తాయో రావోనన్న నిర్వేదంతో భావి కార్యాచరణపై చర్చించుకోవడం కనిపించింది. అలాగే సీఎం కూడా తెచ్చిపెట్టుకున్న నవ్వుతోనే కనిపిస్తున్నారు. ధన్యవాద తీర్మానానికి జవాబిచ్చే సమయంలోనూ, బడ్జెట్ చదివేటప్పుడు బల్లలు చరిచేటప్పుడూ సీరియస్‌గానే కనిపించారు. కాగా.. గురువారం అసెంబ్లీ నిరవధికంగా వాయిదాపడుతుంది. 27న రాజ్యసభ ఎన్నిలకు పోలింగ్ నిర్వహించాల్సి వస్తే.. ఓటు వేయడానికి మాత్రమే ఎమ్మెల్యేలు రావలసి ఉంటుంది. ఏకగ్రీవమైతే ఇక ఇప్పట్లో వెలగపూడి అసెంబ్లీవైపు కన్నెత్తి చూడాల్సిన అవసరమే ఉండదు.

రైతులు ఛీ కొడతారని భయం

- అందుకే చర్చకు నిరాకరణ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సమస్యలు, నీటిపారుదల రంగ దుస్థితి, అధోగతి పాలైన వ్యవసాయ రంగంపై శాసనసభలో చర్చించే ధైర్యం వైసీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌రెడ్డికి లేవని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. రైతు సమస్యలపై ఉభయసభల్లో గంటసేపు చర్చకు కూడా ఇష్టపడలేదంటే.. ఈ ప్రభుత్వం, సీఎం రైతు ద్రోహులుకాక ఏమౌతారని ప్రశ్నించారు. మూడో రోజు బుధవారం శాసనసభ నుంచి సస్పెండైన టీడీపీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు బయటకు వస్తే రైతులు ప్రభుత్వాన్ని ఛీకొడతారన్న భయంతోనే జగన్‌రెడ్డి టీడీపీ వాయిదా తీర్మానంపై చర్చ లేకుండా చేశాడని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉంటే, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందని చెప్పారు. రైతు కుటుంబాలపై ఉన్న అప్పుల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని విమర్శించారు. టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. 'సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం, నిర్వీర్యమైన సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించడానికి జగన్ సర్కార్ ఇష్టపడలేదు. పోలవరం ప్రాజెక్టును జగన్‌రెడ్డి గోదాట్లో ముంచాడు. తనపై పత్రికల్లో వచ్చిన కథనాలు చూసి, అసహనంతో స్పీకర్ టీడీపీ సభ్యుల్ని సస్పెండ్ చేశారు' అని వ్యాఖ్యానించారు. టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ, 'రాష్ట్రంలో 60 వేల మంది ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో చెప్పిన ప్రభుత్వం.. గతంలో ఎంత మంది ఆక్వా రైతులు విద్యుత్ వాడారు? రోజుకు ఎన్ని యూనిట్లు వాడుతున్నారో చెప్పలేదు. పాత బకాయిల పేరుతో ఆక్వా రైతుల్ని ఈ ప్రభుత్వం వేధిస్తోంది. ఆక్వా సీడ్, ఫీడ్ ధరలు భారీగా పెంచింది' అని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ... రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించలేని దుస్థితిలో జగన్ సర్కార్ ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం ఇవ్వడం లేదు' అని ఆరోపించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ, 'పోలవరం ప్రాజెక్టుపై ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబుకు అవగాహన ఉండదు. వ్యవసాయం గురించి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఏమీ తెలీదు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎంత ధాన్యం వస్తుందో? ఎంత కొనాలో పౌరసరఫరాల మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు తెలియదు' అని ఎద్దేవా చేశారు.

పాస్‌పోర్టు సేవలు సులభతరం

- మరుసటిరోజుకే స్లాట్ బుకింగ్
- 2023లో అత్యధికంగా 1.98 లక్షల పాస్‌పోర్టుల జారీ

గత ఐదేళ్లలో జారీ చేసిన పాస్‌పోర్టుల వివరాలు...	
ఏడాది	పాస్‌పోర్టులు
2019	1,49,700
2020	70,331
2021	1,08,809
2022	1,71,318
2023	1,98,577

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో సేవలు సులభతరం అయ్యాయి. గతంలో పాస్‌పోర్టు సంబంధిత సేవల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలంటే 25 రోజుల తరువాత అవకాశం లభించేది. ఇప్పుడు ఈ సమయం గణనీయంగా తగ్గిపోయింది. ఒక్కరోజు వ్యవధిలోనే.. అంటే మరుసటి రోజుకే స్లాట్ లభిస్తోందని పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పాస్‌పోర్టు సేవా కేంద్రం (పీఎస్‌కే)లో పత్రాలన్నీ సరిగ్గా సమర్పిస్తే అదేరోజు పాస్‌పోర్టును మంజూరు చేస్తున్నామని అంటున్నారు. అదే పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాల ద్వారా అయితే వారం రోజుల సమయం పడుతోందని చెబుతున్నారు. గతంలో మర్రిపాలెంలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి ఏదైనా పని కోసం వెళితే అధికారుల అపాయింట్‌మెంట్ లభించేది కాదు. గేటు దగ్గరే సెక్యూరిటీ ఆపేసేవారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు అలా కాకుండా ఏ ఎంక్వయిరీ కోసమైనా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య ఎటువంటి ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా కలవవచ్చునని పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు తెలిపారు.

ప్రతిరోజూ 1,290 అపాయింట్‌మెంట్లు

విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో 13 జిల్లాలు ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి ఏలూరు, యానాం వరకు పరిధి విస్తరించి ఉంది. రెండు (విశాఖపట్నం, భీమవరం) పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, మరో ఏడు పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతిరోజు 1,290 మందికి అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారు. ఇక తత్కాల్ పాస్‌పోర్టుకు రాజమండ్రిలో 13 రోజులు, కాకినాడలో 7 రోజులు, భీమవరంలో 2 రోజుల సమయం పడుతోందని, మిగిలిన కేంద్రాలన్నింటిలో ఒక్కరోజులోనే ఇస్తున్నామని అధికారులు తెలిపారు. కరోనా తరువాత పాస్‌పోర్టుల జారీ తగ్గుముఖం పట్టింది. విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు ఉండడంతో పరిమిత సంఖ్యలోనే ఇచ్చేవారు. క్రమంగా ఆంక్షలు ఎత్తేయడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. అవన్నీ క్లియర్ చేసుకుంటూ ప్రస్తుతం పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు.

ఒకరోజు ముందా పిలిచేది?

- ఉప లోకాయుక్త, సమాచార కమిషనర్ల నియామక సమావేశాలను రీ షెడ్యూల్ చేయండి
- 2 వారాల సమయమిచ్చి సమాచారం పంపండి
- ప్రభుత్వ చర్యను తప్పుబడుతూ చంద్రబాబు లేఖ

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉప లోకాయుక్త, సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ చర్యను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తప్పుబట్టారు. నియామక సమావేశాలను రీ షెడ్యూల్ చేయాలని, హాజరు కావడానికి కనీసం 2 వారాల సమయమిచ్చి తనకు సమాచారం పంపాలన్నారు. బుధవారం ఆయన ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాశారు. ఉప లోకాయుక్త, ముగ్గురు సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామకానికి సంబంధించి నిర్వహిస్తున్న సమావేశానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వంలోని జీఏడీ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజు రెండు విడివిడి లేఖలను చంద్రబాబుకు పంపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రతిపక్ష నేత హోదాలో రావాలని కోరారు. ఈ రెండు నియామకాలకు సంబంధించిన సమావేశాన్ని గురువారం ఉదయం రాష్ట్ర సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ఉప లోకాయుక్త నియామకానికి సంబంధించిన సమావేశం ఉందన్న సమాచారం కేవలం ఒక రోజు ముందు చంద్రబాబుకు వచ్చింది. సమాచార కమిషనర్ల సమావేశానికి సంబంధించిన ఆహ్వానాన్ని మూడు రోజుల ముందు పంపారు. దీనిపై చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'సమాచార కమిషనర్ల పదవులకు దరఖాస్తు చేసుకొన్న వారి వివరాలు పంపలేదు. వివరాలు పంపితే వారి అర్హతలు, ఇతర విషయాలపై మేం అధ్యయనం చేస్తాం. దీనికి వీలుగా వారి వివరాలు పంపడంతో పాటు రెండు వారాల సమయం ఇచ్చి సమావేశం నిర్వహించండి. అలాగే ఉప లోకాయుక్త ఎంపిక సమావేశానికి ఒక రోజు ముందు మాత్రమే సమాచారం పంపడం సరి కాదు. ఈ పదవికి దరఖాస్తుదారు పాతికేళ్ల హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌లో చేసి ఉండాలన్న నిబంధన కూడా సరికాదు. ఈ రెండు ఎంపికల సమావేశాలను రీ షెడ్యూల్ చేయండి. కనీసం రెండు వారాల సమయం ఇస్తూ సమాచారం పంపండి' అని చంద్రబాబు లేఖలో కోరారు.

ఈసీ కార్యాలయంలో ఆయనకు పోస్టింగా?

మంగళగిరి తహసీల్దార్‌గా పనిచేసిన జీవీ రాంప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై ఎన్నికల కమిషన్ కార్యాలయంలో నియమించడంపై తెలుగుదేశం పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ షరీఫ్ బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఈ మేరకు లేఖ రాశారు. 'రాంప్రసాద్‌ను పర్యాటక శాఖకు బదిలీ చేసి అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై ఎన్నికల కమిషన్ కార్యాలయంలో పనిచేయాలని ఆదేశించారు. ఆయన తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ వారితో కలిసిపోయి పనిచేశారు. ఆయనను ఎన్నికల కమిషన్ కార్యాలయంలో నియమిస్తే వైసీపీకి అనుకూలంగా పనిచేసే ప్రమాదం ఉంది. ఆయనను తక్షణం అక్కడ నుంచి తప్పించాలి' అని కోరారు.

ఆర్జీయూకేటీ చాన్స్‌లర్‌గా సీఎం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) చాన్స్‌లర్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆర్జీయూకేటీ-2008 చట్టానికి ప్రభుత్వం సవరణ చేసింది. ఈ సవరణ బిల్లుకు బుధవారం శాసనసభ ఆమోదం లభించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆర్జీయూకేటీ యూనివర్సిటీని ప్రారంభించి, రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు ఏర్పాటు చేశారు. అయితే, ఇది యూజీసీ నిధులతో సంబంధం లేకుండా సొంతంగా ఏర్పాటు చేసుకున్న యూనివర్సిటీ కావడంతో అప్పట్లో వైఎస్‌కి సన్నిహితుడిగా ఉన్న కేసీ రెడ్డిని చాన్స్‌లర్‌గా నియమించారు.

'డిఫాల్టర్' నిర్ణయంపై రివ్యూ కమిటీకి వెళ్లొచ్చు!

- రఘురామ అప్పీల్‌పై టీ-హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటిస్తూ కేంద్ర గ్రామీణ విద్యుదీకరణ సంస్థ(ఆర్ఈసీ) ప్రాథమిక కమిటీ తీసుకున్న నిర్ణయం అంతిమం కాదని.. సదరు నిర్ణయంపై అప్పీలుదారులు రఘురామకృష్ణరాజు, కె. రమాదేవి రివ్యూ కమిటీ వద్దకు వెళ్లవచ్చని తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. రఘురామ, రమాదేవి తదితరులు(సస్పెండెడ్) బోర్డు డైరెక్టర్లుగా ఉన్న ఇండ్ భారత్ పవర్(మద్రాస్) లిమిటెడ్.. ఆర్ఈసీ తదితర ఆర్థిక సంస్థల నుంచి తమిళనాడులో థర్మల్ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.2,655 కోట్ల రుణం తీసుకుంది. ఇందులో రూ.947 కోట్లు సదరు కంపెనీకి విడుదల చేశారు. ఈ నిధులను ఇతర అవసరాలకు అక్రమంగా మళ్లించారని పేర్కొంటూ పిటిషనర్లకు ఆర్ఈసీ నోటీసులు జారీచేసింది. 2022లో ఆర్ఈసీ ప్రాథమిక కమిటీ(ఫస్ట్ లెవల్) రఘురామ తదితరులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా(విల్‌ఫుల్ డిఫాల్టర్లు)గా ప్రకటించింది. దీనిపై వారు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సింగిల్ జడ్జి ధర్మాసనం వాటిని కొట్టివేసింది. ఈ తీర్పుపై రఘురామ, రమాదేవి తదితరులు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం.. రివ్యూ కమిటీని ఆశ్రయించాలని ఆదేశాలిచ్చింది.

ఐక్య పోరాటాలతోనే ఉక్కుకు రక్షణ

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ
- సెమినార్‌లో పలు పార్టీల అగ్రనేతలు
- స్టీల్ ప్లాంట్ ప్రజల సంపద.. దానికి ప్రధాని మేనేజర్ మాత్రమే: సీతారాం ఏచూరి
- ఉక్కు భూములపై కార్పొరేట్ల కన్ను: డి.రాజా



స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏచూరి, డి.రాజా, లక్ష్మీనారాయణ తదితరులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని పలు పార్టీల అగ్రనేతలు పిలుపునిచ్చారు. మోదీ మరోసారి వస్తే ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీలకు అప్పజెప్పుతారన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం మూడేళ్లు పూర్తి చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని బుధవారం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడి కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సెమినార్ నిర్వహించారు. ఇందులో సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి మాట్లాడుతూ "విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ సంపద. దానికి ప్రధాని మోదీ మేనేజర్ మాత్రమే. దేశ ప్రజలే ప్రభుత్వరంగ సంస్థలకు యజమానులు. ప్రజల అనుమతి లేకుండా దేశ సంపదను అమ్మే హక్కు ప్రధాని మోదీకి లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటే 2024 ఎన్నికల్లో మోదీని ఓడించాలి' అని అన్నారు. స్టీల్ ప్లాంట్ స్థాపించినప్పుడు కేంద్రం రూ.5వేల కోట్లు మాత్రమే పెట్టిందని, ఇప్పుడు దాని విలువ రూ.3లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. అటువంటి స్టీల్ ప్లాంట్ ప్రజల ఆస్తి అని, అంతేతప్ప దాన్ని అదానీ, అంబానీ ఆస్తిగా మార్చకూడదని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ దేశానికి గర్వకారణమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అదానీ, అంబానీ, జిందాల్‌ల కన్ను స్టీల్‌ప్లాంట్ భూములపై పడిందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం ఎందుకు అమ్మాలని చూస్తోందో అర్థం కావటం లేదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వైజాగ్ ఎంపీ సత్యనారాయణ, ఐద్వా కోశాధికారి ఎస్.పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం విపక్షం తంటా: మంత్రి వేణు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'అల్జీమర్స్ వ్యాధి వచ్చిన చంద్రబాబు, టీడీపీ సభ్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ సభ్యులు మీడియాలో కనిపించాలని రోజూ ఆందోళన చేస్తూ, స్పీకర్ పోడియంపైకి వెళ్లి గోల చేస్తున్నారు. ఏదో విధంగా అధికారంలోకి వచ్చేందుకు ప్రతిపక్షం తంటాలు పడుతోంది' అని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ తాను కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాననే ప్రచారం అబద్ధమని చెప్పారు. కాగా, తాజా బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధి ఊసే లేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'శాసన మండలిలో మంత్రి అమర్నాథ్ బడ్జెట్ ప్రసంగంలో కొటేషన్లు, వ్యాఖ్యానాలే ఎక్కువ చేశారు' అని అన్నారు.

పవార్ పార్టీ పేరు.. ఎన్సీపీ శరద్‌చంద్ర పవార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మహారాష్ట్రలో శరద్ పవార్ వర్గానికి పార్టీ పేరును కేంద్రం ఎన్నికల సంఘం (ఈసీ) కేటాయించింది. ఆయన వర్గానికి 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్' పేరును బుధవారం ఖరారు చేసింది. ఇటీవల అజిత్ పవార్ వర్గానిదే అసలైన ఎన్సీపీగా గుర్తించిన ఈసీ.. పార్టీ గడియారం గుర్తునూ వారికే కేటాయించిన సంగతి తెలిసిందే. ఈనెలాఖరులోనే మహారాష్ట్రలోని 6 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలున్న నేపథ్యంలో పార్టీ కొత్త పేరు, కొత్త గుర్తు ఎంచుకోవాల్సిందిగా శరద్ వర్గానికి ఈసీ మంగళవారం సూచించింది. ఈ నేపథ్యంలోనే ఎన్సీపీ-శరద్‌చంద్ర పవార్, ఎన్సీపీ-శరద్ పవార్, ఎన్సీపీ-శరద్‌రావు పవార్ పేర్లతో ఉదయించే సూర్యుడు, టీ కప్పు, పొద్దు తిరుగుడు పువ్వు గుర్తులను శరద్ వర్గం ఈసీ ఆమోదం కోసం పంపింది. వీటిలో ఎన్సీపీ-శరద్‌చంద్ర పవార్‌కు ఆమోదం తెలిపిన ఈసీ.. పార్టీ గుర్తును ఇంకా నిర్ణయించలేదు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 8 ఫిబ్రవరి 2024



హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'కి చెందిన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం- ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.
● వెబ్‌సైట్: doms.nalsar.ac.in

నల్సార్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులు

బీబీఏ-ఎంబీఏ ప్రోగ్రామ్(ఐపీఎం)

ఇది ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. యూజీసీ నిబంధనల మేరకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ పాలసీతో ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఇందులో మొత్తం 15 టర్మ్‌లు ఉంటాయి. రెండో ఏడాది తరవాత అభ్యర్థులు స్టార్టప్ కంపెనీల్లో ఆరు నుంచి ఎనిమిది వారాలు ఇంటర్న్‌షిప్; మూడు, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

ఎంబీఏ లెవెల్ స్పెషలైజేషన్లు: బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, కోర్టు మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లున్నాయి. జనరల్ అభ్యర్థులకు 33; ఎస్సీలకు 9; ఎస్టీలకు 4; ఓబీసీ/బీసీ(ఎన్‌సీఎల్)లకు 14; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 06 సీట్లు రిజర్వ్ చేశారు. 25 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇంటర్ స్థాయి చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌మెట్(యూజీ)/ ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోరుకు 75 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 25 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎన్‌మెట్(యూజీ) 2024 వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగాల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31

ఎంబీఏ ప్రోగ్రామ్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు టర్మ్‌లు ఉంటాయి. వీటిలో కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 130 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా మూడు ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

స్పెషలైజేషన్లు: కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కోర్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33; ఎస్సీలకు 9; ఎస్టీలకు 4; ఓబీసీ/బీసీ(ఎన్‌సీఎల్)లకు 14; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 06 సీట్లు రిజర్వ్ చేశారు. 25 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే. నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌మెట్ పీజీ)2024/క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 50 శాతం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 శాతం, గ్రూప్ డిస్కషన్‌కి 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎన్‌మెట్ (పీజీ) 2024 వివరాలు: ఇందులో లాజికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 30 శాతం ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్& క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 40 శాతం ప్రశ్నలు, బిజినెస్ ఆప్టిట్యూడ్ నుంచి 30 శాతం ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ)- బీటెక్+ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని డా.వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. మొత్తం 510 సీట్లు ఉన్నాయి. ఏఎన్‌యూ నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎన్‌యూఈఈటీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు కూడా వర్తించవు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీటెక్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

నాగార్జున వర్సిటీలో డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

విభాగాలు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 120, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 120, మెకానికల్ ఇంజనీరింగ్ 30, సివిల్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 30, డేటా సైన్స్ 60, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 60, సైబర్ సెక్యూరిటీ 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఏఎన్‌యూఈఈటీ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఏఎన్‌యూఈఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 7
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.anucet.in



ఎఫ్ఆర్ఐలో ఎమ్మెస్సీ

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఫారెస్ట్రీ, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.


ఫారెస్ట్రీ: ఇందులో 43 సీట్లు ఉన్నాయి. బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, జువాలజీల్లో ఏదైన ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు. బీఎస్సీ(అగ్రికల్చర్/ఫారెస్ట్రీ) పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ: ఇందులో కూడా 43 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ - ఎంపీసీ)/బీఎస్సీ (ఫారెస్ట్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ఈ స్పెషలైజేషన్‌లో 43 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(బేసిక్ సైన్సెస్/అప్లయిడ్ సైన్సెస్)/బీఎస్సీ(ఫారెస్ట్రీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు అర్హులు. ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో బీఈ/బీటెక్ చేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ: ఇందులో 26 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ లేదా బీఈ/బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అర్హులు. ఈ స్పెషలైజేషన్‌ను ఎంచుకొన్నవారు రెండో ఏడాది కోర్సుని సెంట్రల్ పల్ప్ అండ్ పేపర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీపీఆర్ఐ)లో చదవాల్సి ఉంటుంది.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. బేసిక్ సైన్సెస్,




సోషల్ సైన్సెస్, అర్థమెటిక్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ టేబుల్స్ గ్రాఫ్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, ఒకాబులరీ, గ్రామర్, ఇడియమ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 15 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- ★ డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- ★ **ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మే 19
- ★ **చిరునామా:** రిజిస్ట్రార్, ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), ఐపీఈ కౌలాగర్ రోడ్, డెహ్రాడూన్-248195
- ★ **వెబ్‌సైట్:** www.fridu.edu.in

యూనియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు



మొత్తం ఖాళీలు: 606

ముంబయిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మానవ వనరుల శాఖ, సెంట్రల్ ఆఫీస్...కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. చీఫ్ మేనేజర్- ఐటీ(సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్) ఎస్ఎంజీఎస్-4: **2 పోస్టులు**
2. చీఫ్ మేనేజర్- ఐటీ(క్వాలిటీ అస్యూరెన్స్ లీడ్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
3. చీఫ్ మేనేజర్- ఐటీ(ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
4. చీఫ్ మేనేజర్- ఐటీ(ఎజైల్ మెథడాలజీస్ స్పెషలిస్ట్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
5. సీనియర్ మేనేజర్-ఐటీ(అప్లికేషన్ డెవలపర్) ఎంఎంజీఎస్-3: **4 పోస్టులు**
6. సీనియర్ మేనేజర్-ఐటీ(డీఎస్ఓ ఇంజనీర్) ఎంఎంజీఎస్-3: **2 పోస్టులు**
7. సీనియర్ మేనేజర్- ఐటీ(రిపోర్టింగ్ అండ్ ఈటీఎల్ స్పెషలిస్ట్, మానిటరింగ్, లాగింగ్) ఎంఎంజీఎస్-3: **2 పోస్టులు**
8. సీనియర్ మేనేజర్(రిస్క్) ఎంఎంజీఎస్-3: **20 పోస్టులు**
9. సీనియర్ మేనేజర్(చార్టర్డ్ అకౌంటెంట్) ఎంఎంజీఎస్-3: **14 పోస్టులు**
10. మేనేజర్-ఐటీ(ఫ్రంట్ ఎండ్)/మొబైల్ యాప్ డెవలపర్) ఎంఎంజీఎస్-2: **2 పోస్టులు**
11. మేనేజర్-ఐటీ(ఏపీఐ ప్లాట్‌ఫాం ఇంజనీర్/ ఇంటిగ్రేషన్ స్పెషలిస్ట్) ఎంఎంజీఎస్-2: **2 పోస్టులు**
12. మేనేజర్(రిస్క్) ఎంఎంజీఎస్-2: **27 పోస్టులు**
13. మేనేజర్(క్రెడిట్) ఎంఎంజీఎస్-2: **371 పోస్టులు**
14. మేనేజర్(లా) ఎంఎంజీఎస్-2: **25 పోస్టులు**
15. మేనేజర్(ఇంటిగ్రేటెడ్ ట్రెజరీ ఆఫీసర్) ఎంఎంజీఎస్-2: **5 పోస్టులు**
16. మేనేజర్(టెక్నికల్ ఆఫీసర్) ఎంఎంజీఎస్-2: **19 పోస్టులు**
17. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్ ఇంజనీర్) జేఎంజీఎస్-1: **2 పోస్టులు**
18. అసిస్టెంట్ మేనేజర్(సివిల్ ఇంజనీర్) జేఎంజీఎస్-1: **2 పోస్టులు**
19. అసిస్టెంట్ మేనేజర్(ఆర్కిటెక్ట్) జేఎంజీఎస్-1: **1 పోస్టు**
20. అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్ ఆఫీసర్) జేఎంజీఎస్-1: **30 పోస్టులు**
21. అసిస్టెంట్ మేనేజర్(ఫారెక్స్) జేఎంజీఎస్-1: **73 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీఈ, బీటెక్/ఎంఈ, ఎంటెక్/ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ, ఎమ్మెస్సీ, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ పరీక్ష/గ్రూప్ డిస్కషన్/అప్లికేషన్స్ స్క్రీనింగ్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు రూ.850. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: www.unionbankofindia.co.in/

జాబ్ కార్నర్

కోస్ట్ గార్డ్‌లో నేవిక్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 260

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్ నేవిక్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన కోస్ట్ గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్(సీజీఈపీటీ)-02/2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టు: నేవిక్(జనరల్ డ్యూటీ)

రీజియన్/జోన్ వారీ ఖాళీలు: నార్త్-79; వెస్ట్-66; నార్త్ ఈస్ట్-68; ఈస్ట్-33; నార్త్ వెస్ట్-12; అండమాన్ అండ్ నికోబార్-03.

అర్హత: 10+2(మేథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు నిర్థిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 22 సంవత్సరాలు అంటే అభ్యర్థులు 2002 సెప్టెంబరు 1 నుంచి 2006 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు రూ.21,700.

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

పరీక్ష రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఫిబ్రవరి 13

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

ముంబయి వర్సిటీలో జేఆర్ఎఫ్

యూనివర్సిటీ ఆఫ్ ముంబయి, అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డిపార్ట్‌మెంట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో: 1

విద్యార్హతలు: ఎమ్మెస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్/గేట్ స్కోరు కలిగి ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14

వెబ్‌సైట్: https://mu.ac.in/carees

బెల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 22

ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వారాలో ఉన్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రైనీ ఇంజనీర్-1: **8 పోస్టులు**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్-1: **14 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్

విద్యార్హతలు: సంబంధిత విభాగంలో బీఎస్సీ(ఇంజనీరింగ్)/బీఈ/బీటెక్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ట్రెయినీ ఇంజనీర్ పోస్టుకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు 32 ఏళ్లు మించకూడదు.

జీతభత్యాలు: నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000- రూ.55,000. ట్రెయినీ ఇంజనీర్‌కు రూ.30,000- రూ.40,000

ఎంపిక : రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12

వెబ్‌సైట్: https://bel-india.in/



మారని బుద్ధి

ఒక ఊరిలో జోగయ్య అనే వ్యక్తి ఉండేవాడు. పరమ పిసినారి. ఇంట్లో పిల్లలకు కూడా మంచి తిండి తినిపించని పిసినారి. అంత సంపాదించి.. ఏమి మూటగట్టుకుంటావు? అనేవారు ఊరిలో కొందరు. 'ఆ డబ్బుంటేనే కదా..మీరు నన్ను పట్టించుకునేది. మీరంతే మారరు' అంటూ వారిమీద పరిహాసం చేసేవాడు జోగయ్య.


ఎందుకో జోగయ్యకు వ్యాపారాలంటే ఇష్టం. పైగా ఆ వ్యాపారానికి పెట్టుబడి పెట్టడానికి మనసొచ్చేది కాదు. అందుకే కిరాణ కొట్టు పెట్టినా అతనికి కలిసిరాలేదు. తనలోని తప్పు తెలిసేది కాదు. తక్కువ డబ్బులు పెట్టుబడి పెట్టి... ఎక్కువ సంపాదించాలనే ఆలోచన తనది. అలా వ్యవసాయం చేశాడు. నష్టాలను చవిచూశాడు. చివరికి తన మిత్రుడు సలహా మేరకు పాల వ్యాపారంలోకి వచ్చాడు. పాలల్లో నీళ్లు కలుపుతూ మంచి ధనాన్ని సంపాదించాడు.



అలా వ్యాపారం చేస్తూ సొంతంగా గేదెలు, ఆవులు కొన్నాడు. పాలు తన ఇంటిలో పుష్కలం. అయినా పాలల్లో నీళ్లను మాత్రం కలిపేవాడు. పోనుపోను పాలకంటే నీళ్ల ఎక్కువ తేలేవి. అయినా పట్టించుకునేవాడు కాదు. తన దగ్గర పాలు కొనమని భీష్మించుకున్నా పోటీలేక ప్రజలు జోగయ్య దగ్గరే కొనేవారు. నీళ్ల శాతం పాలల్లో ఎక్కువ అవటంతో ఆ ఊరిలోని పెద్దలంతా కలసి జోగయ్యను ఊరినుంచి తరిమేశారు. జోగయ్య తన తప్పే లేదన్నాడు. పాలల్లో నీళ్లు కలపడం లేదనేమాట మాత్రం మాట్లాడలేదు.

జోగయ్య కట్టుబట్టలతో ఊరి చివర తచ్చాడుతుండగా చెట్టు కింద ఓ యోగి కనపడ్డాడు. ఆయన దగ్గరకు వెళ్లి తన బాధను వెళ్లగక్కాడు. బాధపడకు జోగయ్య.. అంటూ ఓదార్చాడు. 'నీకేమి కావాలో కోరుకో. మంత్రశక్తితో నీకు ఇస్తాను' అన్నాడు. 'నాకు పాల వ్యాపారం మళ్లీ చేయాలనుంది.. అది కూడా వేరే ఊరిలో' అన్నాడు. 'ఆ చెరువంతా పాలే.. ఇక సంపాదించుకో' అన్నాడు యోగి. 'నిజమా.. అయితే అదే పనిగా ఇంకో చెరువులో మంచి నీళ్లు వచ్చేట్లు చేయండి' అన్నాడు జోగయ్య. 'ఇక నీ బుద్ధి మారదా?' అంటూ 'ఇక్కడినుంచి తక్షణమే వెళ్లిపో' అన్నాడు. 'నిజంగా పాలున్నాయా స్వామి.. ఆ చెరువులో' అన్నాడు జోగయ్య. 'దూరంగా కనపడేది చెరువు కాదు.. పాల రాళ్లు. నీ కంటికి అలా కనిపిస్తోంది' అన్నాడు యోగి.

సరైన నీడ ఏది?




చుక్కలు కలిపి రంగులు వేయండి



10 తేడాలు గుర్తించండి



ఎన్ని శునకాలు ఉన్నాయి?



డైలీ సుడోకు - 224

		3	5		4		7	
9				2				
	8		9					2
			1			2		8
	9						4	
6		5			2			
5					7		9	
				1				3
	3		2		6	7		

సుడోకు - 223 సమాధానం

8	7	9	6	3	4	2	1	5
4	1	5	7	2	9	6	8	3
3	6	2	1	5	8	4	7	9
5	8	6	9	4	3	7	2	1
1	3	4	2	7	5	9	6	8
9	2	7	8	1	6	5	3	4
6	4	1	5	8	7	3	9	2
2	9	3	4	6	1	8	5	7
7	5	8	3	9	2	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.